thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 66 | కరీంనగర్ శనివారం, 17 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## పాక్‌లో రేడియేషన్ లీక్ అవ్వలేదు: ఐఏఈఏ

న్యూఢిల్లీ : పాకిస్థాన్‌లోని అణ్వాయుధ నిల్వల నుంచి ఎలాంటి అణుధార్మికత(రేడియేషన్) లీక్ అవ్వలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) స్పష్టం చేసింది. భారత్ 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా నిర్వహించిన దాడుల్లో పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌లో ఉన్న స్థావరాలకు నష్టం వాటిల్లినట్లు వస్తున్న వార్తలను ఐఏఈఏ పరోక్షంగా ఖండించింది. తమకున్న సమాచారం మేరకు పాక్‌లోని న్యూక్లియర్ కేంద్రాల వద్ద ఎలాంటి లీకేజీ లేదని పేర్కొంది. అటు భారత వైమానిక అధికారి, ఎయిర్ మార్షల్ ఏకే భారతి కూడా తాము కిరానా హిల్స్‌ను టార్గెట్‌గా చేసుకోలేదని ఇంతకు ముందే ప్రకటించిన విషయం తెలిసిందే..!




హైదరాబాద్: గురుకుల హాస్టళ్లకు నిత్యావసరాలు, కాస్మొటిక్స్ ను సరఫరా చేసే బాధ్యతను మహిళా సంఘాలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన సరకులు అందడంతో పాటు మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఇది దోహదం చేస్తుందని భావిస్తోంది. ఇటీవల మాతృదినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిపై సమీక్ష నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇది అమలు చేసేలా చర్యలు చేపట్టినట్టు సమాచారం.

## అమెరికాకు కేసీఆర్ ఫ్యామిలీ.. సోషల్ మీడియాలో జోరుగా చర్చ



హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు వరుసగా అమెరికా పర్యటనకు వెళ్తుండటం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ నెలలోనే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇద్దరూ అమెరికాలో పర్యటించనున్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం అమెరికాకు వెళ్తారని ప్రచారం జరిగినా దానిపై ఇంకా స్పష్టత రాలేదని పార్టీ నాయకులు చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గతంగా ఆధిపత్య పోరు, అసంతృప్తి రగులుతోందని సామాజిక మాధ్యమాల్లో జోరుగా చర్చ జరుగుతున్న వేళ కేసీఆర్ కుటుంబ సభ్యులు వేర్వేరుగా విదేశీ పర్యటనలకు వెళ్తుండటం ప్రస్తుత రాజకీయాల్లో ఆసక్తిగా మారింది.

**నార్త్ కరోలినాకు కవిత..** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేడు అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. తన కుమారుడి స్నాతకోత్సవంలో భాగంగా ఆమె అమెరికాలోని నార్త్?కరోలినాకు వెళ్తున్నట్టు సమాచారం. ఇందుకోసం కవిత సీబీఐ కోర్టు నుంచి ప్రత్యేకంగా అనుమతి తీసుకొని అక్కడికి వెళ్తున్నట్టు తెలిసింది. సీబీఐ షరతుల నేపథ్యంలో ఆమె తిరిగి ఈనెల 22న హైదరాబాద్‌కు రానున్నారు. కేటీఆర్, కేసీఆర్ మాత్రం ఈ కార్యక్రమానికి హాజరు కావడం లేదని సమాచారం.

**డల్లాస్‌కు కేటీఆర్..** ఎమ్మెల్సీ కవిత తిరిగి రాష్ట్రానికి చేరుకున్న తర్వాత 26న కేటీఆర్.. అమెరికాకు వెళ్లనున్నారు. డల్లాస్‌లో జరిగే పార్టీ రజతోత్సవ వేడుక కార్యక్రమంలో పాల్గొననున్నారు.

తిరిగి ఆయన వచ్చేనెల 4న హైదరాబాద్‌కు రానున్నారు. ఇప్పటికే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను గతనెల?27న ఎల్కతుర్తి నిర్వహించారు. అదే ఊపులో ఉన్న గులాబీ పార్టీ నాయకులు.. ఇతర దేశాల్లోనూ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. కేటీఆర్‌తో పాటు పలువురు నాయకులు సైతం అమెరికాకు వెళ్లనున్నట్టు తెలుస్తోంది.

**కేసీఆర్ పర్యటనపై నో క్లారిటీ..** ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ తన డిప్లమాట్?పాస్‌పోర్ట్‌ను సరేండర్ చేసి సాధారణ పాస్‌పోర్టు తీసుకున్నారు. ఆ తరువాత ఆయన అమెరికా స్టాపింగ్‌సైతం చేయించుకున్నారు. అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి వెళ్లి స్టాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. దీంతో కేసీఆర్ సైతం అమెరికా పర్యటనకు వెళ్తారని పార్టీలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.

కానీ.. ఆయన విదేశీ పర్యటన తేదీలు ఇంకా ఖరారు కాలేదని పార్టీ ముఖ్య నాయకులు తెలిపారు. విదేశీ పర్యటన అవకాశాలు తక్కువగానే ఉన్నాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. మరి ఆయన అమెరికా పర్యటనకు వెళ్తారా? లేదా? అనేది ఇంకా తేలాల్సి ఉన్నది.

# విద్యుత్ శాఖలో విప్లవాత్మక మార్పులు

## రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా స్మార్ట్ పోల్స్..

## అధికారులకు సీఎం కీలక ఆదేశాలు




హైదరాబాద్ : ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. విద్యుత్ డిమాండ్ భారీగా పెరగబోతోందని అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలు, రైల్వే లైన్లు, మెట్రో, ఇతర మాస్ ట్రాన్స్ పోర్ట్ ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఇవాళ హైదరాబాద్ లో విద్యుత్ శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర కార్పొరేషన్లలో విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. భవిష్యత్ లో హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏతో సమన్వయం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవడం, విద్యుత్ లైన్ల ఆధునీకరణపై దృష్టి సారించాలన్నారు.

**పుట్ పాత్, నాలాల్లో సోలార్ ఉత్పత్తి:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. సెక్రటేరియట్, నెక్లస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను తీసుకురావాలన్నారు. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ పరిధిలోని పుట్ పాత్ లు, నాలా ల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ఫ్యూచర్ సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదన్నారు. హై టెన్షన్ లైన్ల ను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని సూచించారు.

**9.8 శాతం పెరిగిన విద్యుత్ డిమాండ్:** గత యేడాదితో పోల్చితే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందని ఈ యేడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని ముఖ్యమంత్రికి అధికారులు వెల్లడించారు. 2025-26లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగుతుందని అది 2034- 35 నాటికి 31,808 మెగావాట్ల డిమాండ్ కు చేరుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు.

## ధరణి దొరల చట్టం భూ భారతి పేదల చట్టం: మంత్రి పొంగులేటి



రుద్రంగి : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవిన్యూ సధస్సు కార్యక్రమములో రెవెన్యూ హిసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రెండో విడత కింద పోరాటాల చరిత్ర అయిన ఈ ప్రాంతములోభూ భారతి ప్రారంభిచు కుంటున్నము.గుట్టలు చదును సాగుచేసుకొని ఉన్నారు,వాటిని పట్టాలు చేయడమే ఈ భూ భారతి.అప్పుడు అమ్ముకొని పోయిన దొరలు ఇప్పుడు మళ్ళీ వచ్చి పెత్తనుము చేస్తున్నారు. వాటిని న్యాయంగా భూ భారతి లో రైతులకు న్యాయం కానున్నది.న్యాయపరంగా సమస్య ఏర్పడితే వాటిని కోర్టుకు పోకుండా ఈ ఆర్ ఓ ఆర్ చట్టం కింద పరిష్కారం అవుతుంది.మహిళలకు వడ్డీ లేకుండా రుణం ఇచ్చి అదుకోబోతున్నము. రుద్రంగి అంటే నాకు ఎనలేని అనుబంధం ఉంది అన్నారు ఈ ప్రాంత రోడ్డు కు నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పంచాయిలతో కార్యలయము చుట్టూ తిరుగకుండ ఈ భూ భారతి తో సమస్య పరిష్కారం అవుతుంది.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ పథకం తెచ్చింది.ధరణి తో ఇబ్బందికి గురారయ్యారు,అధికారులు కూడా ఏమి చేయలేకపోయారు.ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ కబ్జాలకు గురయ్యిందో, ఆక్రమణకు చేసుకున్నారో వారే చెప్పాలి,గత పదేండ్లలో ప్రభుత్వ భూమీ కబ్జా చేసిన వారు స్వంచందంగా తిరిగి ఇవ్వాలి అని అన్నారు.వేములవాడ రుద్రంగి నుండి బొంబాయి కు వెళ్ళడానికి రెండు ఆర్టీసి బస్ లు వేయడానికి హామీ ఇచ్చారు,మహిళలను కోటీశ్వర్లను చేయాలమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటిలిశ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ధరణి దొరల చట్టం..భూ భారతి పేదల చట్టమన్నారు. పేదల కళలను నెరవేర్చుడం కోసం కొన్ని వేల మంది మెదవులతో ఏర్పాటు చేసిన ఈ భూ భారతి.అంబేద్కర్ జన్మదినం రోజు పురస్కరించుకొని ఈ భూ భారతి చట్టం తెచ్చాము.తాళిని తాకట్టు పెట్టి భూ సమస్యల పరిష్కారం కోసం తిరుగారు అయిన కాలేదన్నారు. అవ్వన్నీ భూ భారతి లో పరిష్కారం అవుతాయి. రిజిస్ట్రేషన్ లో సరిహద్దులలో పాటు సర్వెయర్ తో కొలతలతో ప్లాన్ జాతచేయడం జరుగుతుంది. కొలతలతో మీ పాసు బుకులో ప్రింట్ చేస్తాము. జూన్ 2 తారికి వరకు లైసెన్స్ సర్వేర్లను ఎంపిక చేస్తున్నాము.ప్రతి గ్రామానికి విఆర్ఎ, విఆర్ఓ లు ఉండేవారు ఆనాటి దొర వారి రాత్రి నిర్ణయాలకు గ్రామాలకు అధికారి లేకుండా పోయారు. జూన్ 2 తారికి నాడు ముఖ్యమంత్రి చేతుల మీద పరిష్కారం జరిగే వాటిలో రుద్రంగి గ్రామము ఉంది.ఆగస్టు 15 నాటికి భూమి సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతుంది.ఇంకా ఏమన్నా ఉంటే ఆ తరువాత కూడ పరిస్కరిస్తాము. ఈ ప్రాంతానికి 1750 ఇందిరమ్మ ఇండ్ల ఇవ్వడానికి హామీ ఇచ్చారు.2 లక్షల ఇండ్లు నిర్మించడానికి శ్రీకారం చుట్టాము.మీ నియోజకవర్గం అభివృద్ధి కోసం మీ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తహతహలాడుతుండు.ఏ అధికారి ఈ భూ భారతి విషయంలో రైతులను ఇబ్బంది పెడితే ఊరుకుండే లేదని హెచ్చరించారు.

57 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుటకు ప్రభుత్వం ముందుదన్నారు.సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కు నూతనంగా స్వంత బిల్డింగ్ కు నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు రుద్రంగి మండలంతో పాటు బీమరం మండలంలో రెవెన్యూ ఆఫిసులకు నిధులు మంజూరు చేస్తా అని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ కార్యక్రమం చేసారు అర్హులైన వారికీ ఇండ్ల ప్రొసీడింగ్ కాపిలను అందజెసారు ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతి నిధులు ప్రజలు పాల్గొన్నారు.



## పిల్లలమర్రిలో అందాల భామల పర్యటన

మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రిలో మిస్ వరల్డ్ పోటీదారులు పర్యటించారు. సంప్రదాయ నృత్యాలతో కళాకారులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి.. జిల్లా ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, జీఎంఆర్, వీర్లపల్లి శంకర్, చిట్టెం పరిణికా రెడ్డి పాల్గొన్నారు. 16వ శతాబ్దం నాటి రాజరాజేశ్వర సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ విశిష్టతను మిస్ వరల్డ్ పోటీదారులకు చరిత్రకారుడు శివ నాగిరెడ్డి వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో సేకరించిన పలు విగ్రహాల విశిష్టతను గురించి తెలిపారు. అలాగే జిల్లా మ్యూజియాన్ని మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. పిల్లల మర్రి మహావృక్షం చరిత్రను విశిష్టతను అటవీశాఖ అధికారి వివరించారు. డీహైడ్రేషన్‌తో కాస్త అస్వస్థతకు మిస్ వరల్డ్ చైనా కంటెస్టెంట్ గురయ్యారు.

చురకలు





# కిలేడీలతో జాగ్రత్త..

హైదరాబాద్: నగరంలో కిలేడీలతో జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా ఉన్నట్లు నటిస్తూ వాహనదారులను లిఫ్ట్ అడిగి పర్సు, సెల్ ఫోన్ కొట్టేస్తున్న కిలేడీలు ఉన్నారని పోలీసులు అన్నారు. ఎవరైనా అమాయకంగా దొరికితే వారిపై కిలేడీలు వేధింపుల కేసు పెడుతామని బెదిరిస్తున్నారని, మరి కొందరు కిలేడీలు చాటింగ్ పేరిట దగ్గరై చివరకు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని అన్నారు. పోలీసులను సయితం వదలకుండా సికింద్రాబాద్‌లో ఓ కానిస్టేబుల్ నుంచి కిలేడీ రూ. లక్ష కొట్టేసిందని, మరొకరిని మోసం చేయబోయి పోలీసులకు యువతి చిక్కిందని తెలిపారు. చాలామంది బయటికి తెలిస్తే పరువు పోతుందనే భయంతో పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కడం లేదని, బాధితులు ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే వివరాలు గుట్టుగా ఉంచుతామని పోలీసులు భరోసా ఇస్తున్నారు.

**కిలేడీల టార్గెట్ ఎక్కడంటే..** హైదరాబాద్‌లోని ప్రధాన బస్‌స్టేషన్లు, రైల్వే, మెట్రోస్టేషన్ల వద్ద కిలేడీలు పాగా వేస్తారని, చేతిలో సంచితో దూర ప్రాంతం నుంచి వచ్చిన్నట్టు కనిపిస్తారని బైక్‌పై వెళ్లే వారిని లిఫ్ట్ అడిగి.. వారిని మాటల్లో పెట్టి వివరాలు తెలుసుకుంటారని పోలీసులు తెలిపారు. వాహనదారుల ఫ్యాంటు జేబుల్లోని పర్సులు, సెల్‌ఫోన్లు కొట్టేస్తారని, అది గమనించి ప్రశ్నిస్తే తన చేయి పట్టుకొని అల్లరి చేస్తున్నావంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తారని.. దీంతో బయటికి తెలిస్తే పరువు పోతుందనే భయంతో బాధితుడు మొత్తబడేసరికి ఆ కిలేడీ అక్కడి నుంచి మాయమవుతుందన్నారు. ఇదే తరహాలో మలక్‌పేట్‌లో ఓ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. ఒక ప్రైవేటు ఉద్యోగి తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నానని, బైక్‌పై వస్తుంటే జారిపడి పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా మహిళ సెల్ ఫోన్ కొట్టేసినట్టు గుర్తించామన్నారు. అలాగే గతంలోనూ సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో కొందరు మహిళలు ద్విచక్ర వాహనదారులను లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడ్డారన్నారు. జేబీఎస్‌వద్ద కాపు గాసి బైక్‌పై వెళుతున్న మధ్య వయసు వారిని ఆపి లిఫ్ట్ కావాలని అడిగి.. తీరా ఆమె దిగాల్సిన చోటు వద్ద దిగి నగదు, నగలివ్వాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. బోయినపల్లి వద్ద ఒకరిని ఇలాగే బెదిరించి నగదు తీసుకొని పరారయ్యారన్నారు. ఈ తరహ మోసాలు శివారు ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. ఇలాంటి కిలేడీల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు మరోసారి హెచ్చరించారు.





# చరిత్రలో తొలిసారి.. తాలిబన్ మంత్రితో జైశంకర్ చర్చలు

దిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వంలో తాత్కాలిక విదేశాంగ మంత్రిగా ఉన్న ఆమిర్‌ఖాన్ ముత్తాఖీతో.. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఫోన్‌లో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిని తాలిబన్లు ఖండించడాన్ని జైశంకర్ స్వాగతించారు. ఈవిషయాన్ని కేంద్రమంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తాలిబన్ ప్రభుత్వంతో న్యూదిల్లీ మంత్రిత్వ స్థాయి చర్చలు జరపడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. "అఫ్గాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్‌తో మంచి సంభాషణ జరిగింది. పహల్గాం ఉగ్రదాడిని ఆయన ఖండించడం హర్షణీయం. భారత్-అఫ్గానిస్థాన్ మధ్య విభేదాలు సృష్టించేందుకు ఇటీవల అవాస్తవ, నిరాధార ప్రచారం జరిగింది. దాన్ని ఆయన తోసిపుచ్చడాన్ని స్వాగతిస్తున్నా. అఫ్గాన్ ప్రజలతో మా స్నేహబంధాన్ని కొనసాగిస్తాం. వారి అభివృద్ధికి నిరంతర మద్దతు అందిస్తాం. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశంపై మేం చర్చలు జరిపాం" అని జైశంకర్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తాలిబన్ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. అయితే, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్ సంచలన ఆరోపణలు చేసింది. భారత్ ప్రయోగించిన ఓ క్షిపణి అఫ్గాన్ భూభాగంలో పడినట్లు తప్పుడు ప్రచారం చేసింది. దీన్ని కాబూల్ ఖండించింది. తమకు ఎలాంటి హాని జరగలేదని, అదంతా అవాస్తవమేనని తాలిబన్ రక్షణశాఖ ప్రతినిధి వెల్లడించారు. అటు న్యూదిల్లీ కూడా పాక్ ప్రచారాన్ని తిప్పికొట్టింది. 2021 ఆగస్టులో అఫ్గాన్‌లో తాలిబన్ పాలన ఏర్పడిన సంగతి తెలిసిందే. ఆ ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా గుర్తించనప్పటికీ దౌత్య సంబంధాలు మాత్రం కొనసాగిస్తోంది. ఈ ఏడాది జనవరిలో దుబాయ్ వేదికగా ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. మరోవైపు, అఫ్గాన్‌లో అల్‌ఖైదా, ఐసిస్, తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్ వంటి ఉగ్రముఠాల ఉనికిపై న్యూదిల్లీ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే తాజాగా తాలిబన్ మంత్రితో జైశంకర్ చర్చలు జరపడం తాజా పరిస్థితుల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

# హరీశ్‌రావుతో కేటీఆర్ భేటీ.. తాజా పరిణామాలపై సుదీర్ఘ చర్చ



హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసానికి వెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. అనారోగ్యంతో ఉన్న హరీశ్‌రావు తండ్రి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అనంతరం తాజా పరిణామాలు, రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య దాదాపు రెండు గంటల పాటు చర్చ జరిగినట్టు సమాచారం. సామాజిక మాధ్యమాల్లో తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఇటీవల ఖండించిన హరీశ్‌రావు.. అధినేత కేసీఆర్ మాట ప్రకారమే నడుచుకుంటానని స్పష్టం చేశారు. కేటీఆర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించినప్పటికీ తాను సహకరిస్తానని చెప్పారు. తనపై కుట్రలు చేస్తున్నారని, సమయం వచ్చినప్పుడు బయటపెడతానని ఎమ్మెల్సీ కవిత ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ ప్రాధాన్యం సంతరించుకొంది.





# సౌదీని షేక్ చేస్తున్న పాక్ బిచ్చగాళ్లు!

"మేము ఏ మిత్రదేశానికి వెళ్లినా.. అడుక్కోవడానికే వచ్చామన్నట్లు చూస్తారు".. ఇది దాదాపు మూడేళ్ల క్రితం ప్రస్తుత పాక్ పీఎం షెహబాజ్ షరీఫ్ ఓ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు. ఆయన ఏ ఉద్దేశంతో అన్నారో గానీ.. దాని మిత్ర దేశాలను మాత్రం పాక్ బిచ్చగాళ్లు హడలెత్తిస్తున్నారు. యాచకులను ఎగుమతి చేసే దేశంగా అయాచిత అపకీర్తిని పొందింది. తాజాగా సౌదీ అరేబియాలో పాకిస్థాన్‌కు చెందిన 5,033 మంది పాక్ బిచ్చగాళ్లను వారి స్వదేశానికి బలవంతంగా పంపించింది. మరో 369 మందిని ఇతర దేశాలకు అప్పగించింది. ఈ విషయాన్ని పాక్ ఇంటీరియర్ మంత్రి మొహసిన్ నక్వీ ఇటీవల నేషనల్ అసెంబ్లీ (ఆ దేశ పార్లమెంట్)లో వెల్లడించినట్లు డాన్ పత్రిక కథనంలో పేర్కొనడం గమనార్హం.

**సంపన్న ప్రావిన్స్‌ల నుంచే అత్యధిక మంది..** ఇక 2024 జనవరి నుంచి తమ మిత్ర దేశాలు తరిమేసిన పాక్ బిచ్చగాళ్ల సంఖ్యను కలుపుకొంటే ఇది 5,402కు చేరుతుందని వెల్లడించారు. వీరిని సాగనంపిన వారిలో సౌదీతోపాటు.. ఇరాక్, మలేసియా, ఒమన్, ఖతార్, యూఏఈ ఉన్నాయి. ఈ మొత్తంలో సింధ్ ప్రావిన్స్‌కు చెందినవారు 2,795 మంది, పంజాబ్ ప్రావిన్స్ నుంచి 1,437, కేపీ నుంచి 1,002, బలోచిస్థాన్ 125, పీవోకే 33, మరో 10 మంది ఇస్లామాబాద్ నుంచి ఉన్నారు.

**వీసా సమస్యలు..** పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసీఫ్ ఏప్రిల్ 19న సియాల్‌కోట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. దేశంలో యాచన ఓ పెద్ద సమస్యగా మారిందన్నారు. దీనివల్ల ఇతర దేశాలు వీసాలు జారీ చేయడం లేదని చెప్పారు. దేశంలో దాదాపు 2 కోట్ల మంది యాచకులు ఉన్నట్లు చెప్పారు. వీరి నెలసరి ఆదాయం 4,200 కోట్ల పాకిస్థానీ రూపాయిలు అని ఆయనే వెల్లడించారు. సియాల్ కోట్ నుంచి వారిని రెండుసార్లు ఏరివేస్తే.. మళ్లీ తిరిగి వచ్చారన్నారు. 2023లో పాక్ సెనెట్ ప్యానెల్ ఎదుట నాటి ఓవర్సీస్ మినిస్ట్రీ సెక్రటరీ జుల్ఫీకర్ హైదర్ మాట్లాడుతూ విదేశాల్లో అరెస్టు అవుతున్న 90 శాతం బిచ్చగాళ్లు పాక్‌కు చెందినవారని వెల్లడించారు. చాలామంది యాత్రికుల వీసాలను తీసుకొని సౌదీ, ఇరాన్, ఇరాక్ వంటి ప్రదేశాలకు వెళ్లి అడుక్కుంటున్నట్లు చెప్పారు. వీరికి జపాన్ కొత్త కేంద్రంగా మారుతోందని నాడు వెల్లడించారు.

# ట్యాంక్‌బండ్‌పై తిరంగా యాత్ర.. పాల్గొనాలని ప్రజలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు



హైదరాబాద్: ప్రధాని మోదీ ఉగ్రవాదుల అంతు చూస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పాక్‌తో పోరులో భారత సైన్యం చరిత్ర రాసే ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. భారత్‌పై దాడి చేస్తే ప్రతిదాడి ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ ద్వారా నిరూపించామని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భాజపా నిర్వహించే తిరంగా యాత్రలో అందరూ పాల్గొనాలని కోరారు.

"ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచే ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసింది. పాక్ ఆర్మీకి చెందిన 11 కీలకమైన స్థావరాలను మన దేశ సైనికులు ధ్వంసం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా యాత్ర నిర్వహిస్తున్నాం. అంబేడ్కర్ విగ్రహం నుంచి మిలటరీ ట్యాంక్ వరకు ఈ యాత్ర ఉంటుంది. అనేక మంది ప్రముఖులు ఈ యాత్రలో పాల్గొనబోతున్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్రలో ఎమ్మెల్యేలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలి"అని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# యూట్యూబ్ చానల్స్‌తో కేటీఆర్ తప్పుడు ప్రచారం...





హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు వ్యాఖ్యలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంపీ గాంధీ భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. కోడి గుడ్డుపై ఈకలు పీకినట్లు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. సైకో రాము (కేటిఆర్) కల్లు తాగిన కోతిలా మాట్లాడుతున్నారని.. రామప్పగుడి దగ్గర అత్యుత్సాహంతో ఎవరో మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల కాళ్ళు కడిగి ఉండొచ్చునని, దానికి తెలంగాణ మహిళల ఆత్మ గౌరవం ఏమైందంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ట్విట్ చేశారని మండిపడ్డారు. పదేండ్లు వాళ్ళ ఇంటి ఆడబిడ్డ గురించి తప్ప ఏ ఇంటి ఆడబిడ్డ గురించి మాట్లాడలేదని ఎంపీ చామల విమర్శించారు. ఇప్పుడు కేటిఆర్ మహిళల ఆత్మ గౌరవం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కలెక్టర్లతో కాళ్ళు కడిగించుకున్న దౌర్భాగ్య పరిస్థితి మీదని.. జనాన్ని తప్పుదోవ పట్టించాలని కేటిఆర్ రోజు ఏదో ఒకటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అప్పుల పాలు చేసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి చూస్తుంటే.. కేటిఆర్ డిస్టర్బ్ చేస్తున్నారని, గతంలో దండుకున్న వందల కోట్ల రూపాయలతో కొన్ని యూట్యూబ్ చానల్స్‌తో.. మార్ఫుడు వీడియోలతో కేటిఆర్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. మంత్రి కొండా సురేఖ ఏ సందర్భంలో మాట్లాడారో దానికి ఆమే సమాధానం చెబుతారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కాగా శుక్రవారం ఉదయం మాజీ మంత్రి హరీష్ రావు నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. సుమారు రెండు గంటల పాటు హరీష్ రావు ఇంటిలో ఉన్నారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపినట్లు సమాచారం. మరోవైపు అనారోగ్యంతో బాధపడుతున్న హరీష్ రావు తండ్రి ఆరోగ్య పరిస్థితిని కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు.



# నా వ్యాఖ్యలను వక్రీకరించారు

వరంగల్: ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. వరంగల్‌లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద రూ. 4. 5కోట్లతో భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. "క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి. మామూలుగా మంత్రులు అలాంటి ఫైల్స్ వచ్చినప్పుడు డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇస్తుంటారు. మేం మాత్రం మాకు నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు.. సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం" అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. తన వ్యాఖ్యలు కలకలం సృష్టించడంతో కొండా సురేఖ వివరణ ఇచ్చారు.

భారాస ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు. ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని అన్నానని తెలిపారు.

# భారత్‌లోకి పాక్ డ్రగ్స్.. కుట్రను భగ్నం చేసిన పంజాబ్ పోలీసులు

చండీగఢ్: పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి మాదక ద్రవ్యాలు తరలిస్తున్న ముఠాను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 85 కేజీల డ్రగ్స్‌ను పోలీసులు సీజ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ.వందల కోట్లలో ఉంటుందని అంచనా. అమృత్‌సర్‌కు చెందిన అమర్‌జోత్ సింగ్ జోతా సంధును ఇందులో ప్రధాన నిందితుడిగా గుర్తించి, అరెస్టు చేశామన్నారు. ఈ పాక్ స్మగ్లింగ్ ముఠాను యూకే నుంచి లల్లీ అనే వ్యక్తి నడిపిస్తున్నాడని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో అమర్‌జోత్ నివాసం డ్రగ్స్ సరఫరాకు ప్రధాన కేంద్రంగా మారిందని పోలీసులు వెల్లడించారు. పాక్ నుంచి వచ్చిన మాదక ద్రవ్యాలను అతడే దేశంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడని తెలిపారు. పాక్‌లోని ఐఎస్ఐ ఏజెంట్లతోనూ ఈ ముఠాకు సంబంధాలు ఉన్నాయని అన్నారు. మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి దర్యాప్తు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు.



# వామ్మో.. మళ్లీ కొత్త కరోనా..

కోవిడ్ అంటే ఇప్పటికీ జనం గజగజా వణికిపోయే పరిస్థితి. 2019 చివర్లో మన దేశంలోకి ఎంటరైన ఈ వైరస్.. సుమారు రెండేళ్ల పాటు ప్రజలను ముప్పు తిప్పులు పెట్టింది. అలాగే ఎంతో మందిని పొట్టనపెట్టుకుని.. కరోనా పేరు వింటేనే భయంతో చచ్చిపోయే పరిస్థితికి తెచ్చింది. అయితే గత మూడేళ్లుగా ఈ వైరల్ ప్రస్తావన క్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం కరోనా గురించి దాదాపు మాట్లాకోవడమే మానేశారు. అయితే తాజాగా, కొత్త కోవిడ్ కేసులు పెరుగుతుండడంతో మళ్లీ భయాందోళనలు మొదలువుతున్నాయి. ఆసియా దేశాల్లో ఎంటరైన ఈ కొత్త కోవిడ్.. తీవ్ర ప్రభావం చూపుతోందన్న వార్తలు అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయి.. ఆసియాలోని అనేక దేశాల్లో కొత్త కోవిడ్-19 పెరుగుతున్నాయి. ప్రధానంగా హాంకాంగ్‌తో పాటూ సింగపూర్‌లో ఈ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. హాంకాంగ్‌లోని సెంటర్ ఫర్ హెల్త్ ప్రొటెక్షన్‌లోని కమ్యూనికేషన్ డిసీజ్ బ్రాంచ్ అధికారులు మాట్లాడుతూ నగరంలో కోవిడ్-19 కేసులు పెరిగిపోవడం ఆందోళనకు గురి చేస్తోందని తెలిపారు. ఈ రోగుల్లో కోవిడ్ లక్షణాలు తీవ్రంగా ఉండడంతో పాటూ మరణాల రేటు కూడా ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. సింగపూర్‌లో కోవిడ్ కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సుమారు ఏడాది కాలం తర్వాత మేలో ఆ దేశంలో నమోదైన కేసుల వివరాలను ఆరోగ్య శాఖాధికారులు ప్రకటించారు. మునుపటి వారంతో పోల్చితో మే 3 నాటికి కోవిడ్ కేసులు 28% పెరిగి సుమారు 14, 200కి చేరుకున్నాయని వివరించారు. మరో వైపు ఆస్పత్రుల్లో కోవిడ్ బాధితులు 30% పెరిగినట్లు చెబుతున్నారు. మనుషుల్లో రోగ నిరోధక శక్తి తగ్గడం వల్లే ఈ కేసులు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఆసియాలో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. హాంకాంగ్‌కు చెందిన ప్రముఖ పాప్ స్టార్ అయిన ఈసన్ చాన్‌కు కోవిడ్ పాజిటివ్ అని తేలండతో తన తైవాన్ కచేరీలను వాయిదా వేసుకున్నట్లు తెలిసింది. అలాగే బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. చైనాలోకి కూడా కొత్త కోవిడ్ వ్యాపించినట్లు తెలిసింది. మే 4 నాటికి ఐదు వారాల వ్యవధిలో కోవిడ్ కేసులు రెట్టింపు అయినట్లు తెలిసింది. అదేవిధంగా థాయిలాండ్‌లో ఈ ఏడాది రెండు రకాల కోవిడ్ వైరల్‌లు వ్యాప్తి చెందినట్లు ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ దేశంలో గత ఏప్రిల్‌లో సాంగ్‌క్రాన్ అనే పండుగ జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు గుంపులు గుంపులుగా కలవడం వల్ల కేసులు మరింత పెరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ కొత్త వైరస్ ప్రభావం తీవ్రంగా ఉంటుందనడానికి సరైన ఆధారాలు మాత్రం లేవు.

# ప్రపంచ దూరప్రసార మరియు సమాచార సొసైటీ దినోత్సవం

## – డిజిటల్ సమాజ నిర్మాణంలో ఒక విశ్వ దృక్కోణం

### మే 17... ప్రపంచ దూరప్రసార మరియు సమాచార సొసైటీ దినోత్సవం

ప్రపంచ దేశాలన్నీ వేగంగా డిజిటల్ మార్గంలో ప్రయాణిస్తున్న ఈ యుగంలో, సమాచార సాంకేతికత కీలక పాత్ర పోషిస్తున్నాయి. వ్యక్తిగత జీవితం నుంచి ప్రభుత్వ పరిపాలన వరకు, వ్యవసాయం నుంచి అంతర్జాతీయ సంబంధాల వరకు – ప్రతి రంగంలో టెలికమ్యూనికేషన్, ఇంటర్నెట్, డిజిటల్ పరికరాల వినియోగం అపారంగా పెరిగింది. ఇదే పాతాన్ని ప్రపంచానికి గుర్తు చేసే సందర్భమే ప్రపంచ దూరప్రసార మరియు సమాచార సొసైటీ దినోత్సవం. ప్రతి సంవత్సరం మే 17న జరుపుకునే ఈ దినోత్సవం, డిజిటల్ సమానత్వాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలందరికీ అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. 1865 మే 17న 'అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్' స్థాపన జరగడం ద్వారా ఈ రంగానికి శాస్త్రీయ, పరిపాలనా వ్యాసంగం ప్రారంభమైంది. 1969లో ITU దినోత్సవాన్ని గుర్తిస్తూ 'వరల్డ్ టెలికమ్యూనికేషన్ డే' ప్రారంభించారు. అనంతరం, 2005లో ట్యూనిస్‌లో జరిగిన ప్రపంచ సమాచార సొసైటీ ఉమ్మడి సమావేశంలో సమాచార సమాజ అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో టెలికం రంగాన్ని మాత్రమే కాక, మొత్తం సమాచార సాంకేతిక పరిజ్ఞానం, దాని ప్రాభవాన్ని వ్యాప్తి చేయాలన్న దృష్టితో ఈ దినోత్సవానికి World Telecommunication and Information Society Day అనే నూతన రూపం ఇచ్చారు. 2006లో ఐక్యరాజ్య సమితి అధికారికంగా ఈ పేరుతో ఈ దినోత్సవాన్ని గుర్తించింది. ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం... ప్రపంచ వ్యాప్తంగా సమాచార సాంకేతికతలపై అవగాహన కల్పించడం, వాటిని సమర్థవంతంగా వినియోగించే విధానాలను ప్రోత్సహించడం. ఈ క్రమంలో, ICTల యొక్క సామర్థ్యాన్ని వినియోగించి – ప్రజాస్వామ్యం, ఆరోగ్యం, విద్య, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, సహజ విపత్తుల నిర్వహణ మొదలైన అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవచ్చు. ముఖ్యంగా, పట్టణ–గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న డిజిటల్ విభజనను తొలగించి, ప్రతీ ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడమే ఈ దినోత్సవ సందేశం. భారతదేశం ఈ లక్ష్యాలకు ఎంతో సమీపంగా ఉంది. 2015లో ప్రారంభించిన డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఫైబర్ నెట్, మొబైల్ టవర్స్, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పాత గణాంకాల ప్రకారం 2023 నాటికి భారతదేశం ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్యలో ప్రపంచంలో రెండవ స్థానానికి చేరుకుంది. మొబైల్ ఫోన్ వినియోగం, యూపీఐ ఆధారిత డిజిటల్ లావాదేవీలు, ఇ–గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్యా వేదికలు, టెలీమెడిసిన్ వంటి రంగాల్లో భారత్ అద్భుత పురోగతిని నమోదు చేస్తోంది. ఈ ప్రయాణంలో ముఖ్యమైన అంశం – ప్రతి ఒక్కరికీ ఈ సదుపాయాలు సమానంగా అందుబాటులో ఉండేలా చూడటం. WTISD మనకు ఇదే సంకేతం ఇస్తుంది. అంతర్జాతీయంగా కూడా ఈ దినోత్సవం సందర్భంగా వివిధ దేశాలు కార్యక్రమాలు నిర్వహిస్తూ, టెలికం రంగ అభివృద్ధిని ప్రదర్శిస్తాయి. పుస్తకావిష్కరణలు, సాంకేతిక సెమినార్లు, పబ్లిక్ అవేర్‌నెస్ కార్యక్రమాలు, స్కూల్ విద్యార్థులకు అవగాహన క్లాసులు, పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో డిజిటల్ చైతన్యం పెంపొందించే ప్రయత్నాలు చేస్తారు. ఈ దినోత్సవం మనకు తెలియజెప్పే సందేశం స్పష్టం... సమాచారం ఓ ఆధికారం. అయితే అది సమర్థవంతంగా, సమానంగా అందుబాటులో ఉండాలంటే – టెక్నాలజీ సృష్టించడమే కాదు, దాన్ని ప్రజలకి చేరవేసే విధానాలు అవసరం. డిజిటల్ ప్రపంచం, ఒక సాంకేతిక అద్భుతం మాత్రమే కాకుండా, ఒక సామాజిక శక్తిగా మారే దిశగా WTISD నడిపిస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మనం ప్రతిజ్ఞ తీసుకోవాలి – డిజిటల్ టెక్నాలజీని బాధ్యతతో వినియోగించాలి, సమాచారాన్ని బహిరంగంగా పంచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలి, మరియు డిజిటల్ సమానత్వం కోసం నిరంతరం కృషి చేయాలి. ఎందుకంటే, సమాచారం అందుబాటులో ఉన్నప్పుడు మాత్రమే సాధికారత, స్వయం అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిపుష్టి సాధ్యం అవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# ఊపందుకున్న 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం.. సెలెబి సంస్థపై కేంద్రం వేటు

భారత విమానాశ్రయాల్లో కీలక భద్రతా సేవలను అందజేస్తున్న తుర్కియే సంస్థ సెలెబి ఏవియేషన్‌పై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. జాతీయ భద్రత దృష్ట్యా, సెలెబి సంస్థకు ఇచ్చిన సెక్యూరిటీ క్లియరెన్స్‌ను తక్షణమే రద్దు చేస్తూ బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆదేశాలను జారీ చేసింది. పాకిస్థాన్‌కు తుర్కియే మద్దతుగా నిలవడం, ఆపరేషన్ సింధూర్ సమయంలో డ్రోన్లు, క్షిపణులు అందించడం వంటి చర్యలు దేశవ్యాప్తంగా ఆగ్రహానికి కారణం అయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు జమ్మూలో మాట్లాడుతూ.. జాతీయ భద్రతకు సంబంధించిన విషయాల్లో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. ఇది భద్రతాపరమైన అంశం. సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మంత్రి వ్యాఖ్యలు రామ్మోహన్ నాయుడు చేసిన కొన్ని గంటల్లోనే సెలెబి సంస్థపై వేటు పడింది. సెలెబి ఏవియేషన్.. భారత్‌లోని పలు విమానాశ్రయాల్లో గ్రౌండ్



హ్యాండ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 'సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియా' పేరుతో ఈ సేవలను అందజేస్తుంది. ఢిల్లీ విమానాశ్రయంలో కార్గో సేవలను 'సెలెబి దిల్లీ కార్గో టెర్మినల్ మేనేజ్‌మెంట్ ఇండియా' నిర్వహిస్తోంది. విమానాల రాకపోకలు, ప్రయాణికుల భద్రత, కార్గో నిర్వహణ వంటి కీలకమైన పనులను ఈ సంస్థ పర్యవేక్షిస్తుంది. ర్యాంప్ సర్వీసులు, లోడ్ కంట్రోల్, బోర్డింగ్ బ్రిడ్జిల అనుసంధానం, పోస్టల్, గోదాముల నిర్వహణ వంటివి ఈ సంస్థ బాధ్యతలు.ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే మద్దతుగా నిలవడం, డ్రోన్లు, క్షిపణులు అందించడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం ఊపందుకుంది. ట్రావెల్ ఏజెన్సీలు తుర్కియేకు బుకింగ్‌లు నిలిపివేశాయి. పలు విశ్వవిద్యాలయాలు ఆ దేశంతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకున్నాయి. తుర్కియే నుంచి దిగుమతి అయ్యే వస్తువులను నిషేధించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ఈ నిర్ణయం భారత్–తుర్కియే సంబంధాలపై ప్రభావం చూపనుంది. భద్రతా పరమైన విషయాల్లో భారత్ ఎంత కఠినంగా ఉంటుందో ఈ చర్యలు స్పష్టం చేస్తున్నాయి.

# మేఘాల పైన ఊరు.. ఒక్క చుక్క వర్షం లేదు.. ప్రపంచంలోనే అత్యంత పొడి ప్రదేశం ఇదే

ఈ భూమ్మీద ఒక్క చుక్క వర్షం పడని ఊరు ఒకటుందని తెలుసా ? చాలామందికి ఈ విషయం తెలియదు. యెమెన్‌లోని 'అల్–హుతైబ్' అనే గ్రామంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా వర్షం కురవలేదట. ఇది యెమెన్ రాజధాని సనాకు పశ్చిమాన దాదాపు 3,200 మీటర్ల ఎత్తులో ఉన్న ఒక కొండపై ఉంది. నిపుణులు చెప్పేదాని ప్రకారం.. ఈ ప్రాంతం మేఘాల కంటే చాలా ఎత్తులో ఉండడం వల్లే ఇక్కడ వర్షాలు పడడం లేదట. అంటే, మేఘాలు ఈ ఊరి కింద నుంచి వెళ్ళిపోతాయి కానీ, వర్షాన్ని మాత్రం ఇవ్వవు. అందుకే ఈ ఊరిని ప్రపంచంలోనే 'డ్రై సిటీ' అని కూడా అంటారు. ఇక్కడ ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ఈ ఊరిలో ఎక్కువగా ఉండేది అల్–బోహ్రా తెగకు చెందిన ప్రజలు. వీళ్ళని యెమెన్ కమ్యూనిటీస్‌గా పిలుస్తారు. వీళ్ళు అసలు మన ముంబై నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారట. వర్షం పడకపోతే ఈ ప్రజలు ఎలా బతుకుతున్నారని మీకు డౌట్ రావచ్చు. నిజానికి యెమెన్‌లో నీటి సమస్య చాలా ఎక్కువ. సనాలో అయితే మరీ దారుణం. అందుకే సనా మున్సిపల్ వాటర్ కార్పొరేషన్ 2007లో కొత్త పద్ధతులు తీసుకొచ్చింది. మొబైల్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సిటీ మొత్తానికి నీటిని సరఫరా చేస్తున్నారు. కొండపై ఎత్తులో ఉన్న అల్–హుతైబ్‌కు కూడా మొబైల్ ట్యాంకర్లతో పాటు,



పైపుల ద్వారా నీటిని అందిస్తున్నారు. వర్షం లేకపోయినా, అల్–హుతైబ్ ఒక అద్భుతమైన ప్రదేశం. మేఘాల కంటే ఎత్తులో ఉండటం వల్ల ఇక్కడి వాతావరణం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఉదయం సూర్యుడు ఉదయించే వరకు చలిగా ఉంటుంది, సూర్యుడు రాగానే వేడి మొదలవుతుంది. మళ్ళీ సాయంత్రానికి చల్లగా మారిపోతుంది. ఈ వింతైన గ్రామాన్ని చూడటానికి చాలామంది టూరిస్టులు వస్తుంటారు. మేఘాలు తమ చేతికి అందేంత దగ్గరగా ఉండటం, చుట్టూ పచ్చని ప్రకృతి దృశ్యాలు టూరిస్టులను బాగా ఆకర్షిస్తాయి. అంతేకాదు, కొండ కింది భాగంలో చిన్న చిన్న జలపాతాలు కూడా చాలా అందంగా ఉంటాయి. ఇక్కడ 'క్యాట్' అనే ఒక ప్రత్యేకమైన మొక్కను ఎక్కువగా పండిస్తారు. ఇదిలా ఉంటే, ప్రపంచంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతం మన భారతదేశంలోనే ఉంది. మేఘాలయ రాష్ట్రంలోని మౌసిన్ రామ్ అనే గ్రామంలో ఏడాది పొడవునా భారీ వర్షాలు కురుస్తాయి. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం, భూమిపై అత్యంత తేమ కలిగిన ప్రదేశం ఇదే. ఇక్కడ సగటు వార్షిక వర్షపాతం ఏకంగా 11,871 మిల్లీమీటర్లు. ఒక్కోసారి సంవత్సరంలో 26,000 మిల్లీమీటర్ల వర్షపాతం కూడా నమోదైన సందర్భాలు ఉన్నాయి. మేఘాలయ రాజధాని షిల్లాంగ్ కూడా భారీ వర్షపాతం పొందే ప్రాంతమే. బంగాళాఖాతం నుంచి వచ్చే నైరుతి రుతుపవనాలు ఈ ప్రాంతంలో భారీ వర్షాలకు కారణం.

# తెలంగాణ విప్లవోద్యమ చరిత్రలో ఒక వెలుగురేఖ పల్లెమీది నారాయణ.



అవిభక్త కరీంనగర్ జిల్లాలో తొలి తరం నక్సలైట్ నాయకులలో ముఖ్యులైన పందుగ నారాయణ సార్ మే 15న ఈ లోకాన్ని విడిచి వెళ్ళారు. మూడు నెలలుగా కాలేయం అన్న వాహిక వద్ద ఏర్పడిన కంతితో, జాండిస్ వ్యాధితో జీర్ణవ్యవస్థ వ్యవస్థకు అడ్డు పడి ఆపరేషన్ చేయించుకుని, కోలుకుని, తిరిగి అస్వస్థులై , మే 15 వతేదీ గురువారం అర్ధరాత్రి తరువాత తుది శ్వాస విడిచారు. తెలంగాణ విప్లవోద్యమ చరిత్రలో ఒక వెలుగురేఖ పల్లెమీది నారాయణ. జగిత్యాల జైత్రయాత్రను ముందుండి నడిపించిన సారథిగా, ప్రజా ఉద్యమాలకు సిద్ధాంతాన్ని అందించిన బోధకుడిగా, నక్సలైట్ ఉద్యమం తొలి రోజుల్లో కీలకమైన నాయకుడిగా ఆయన నిలిచారు. విద్యావంతుల్లో , పౌరహక్కుల ఉద్యమ నిర్మాతల్లో ఆయన చేసిన ఉద్యమాల జ్ఞాపకాలు చెరిగి పోనివి. ఉత్తర తెలంగాణను భూస్వామ్య పెత్తందారీతనం నుండి విముక్తి చేయడానికి జరిగిన పోరాటంలో నారాయణ ఒక గొప్ప గురువుగా ప్రజల మన్ననలు పొందారు. ఉద్యమంలో, జైలు లోపల కూడా సిద్ధాంత అధ్యయన తరగతులు నిర్వహించే వారు. ఉద్యమంలో ఉన్నా, జైలు గోడల మధ్య ఉన్నా ప్రజల చైతన్యం కోసం నిరంతరం తపించిన ఆయనను అందరూ ప్రేమగా "నారాయణ సార్" అని పిలుచు కున్నారు. పల్లెమీది నారాయణ, కల్లూరు నారాయణ అని కూడా పిలుస్తారు. 1950లో కరీంనగర్ జిల్లా కోరుట్ల మండలం సర్వరాజ్ పల్లెలో జన్మించిన పందుగ నారాయణ విద్యార్థి దశ నుండే చైతన్యంతో నిండారు. ఆ చైతన్యాన్ని ఆయన జీవితాంతం ఉద్యమంగా మలిచారు. తొలుత ఒక ప్రైవేటు పాఠశాలను నడిపిన ఆయన, 1968లో ప్రజల పక్షాన నిలిచారు. నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో వ్యాపిస్తున్న సమయంలో ఆయన ఒక సిద్ధాంత కర్తగా, ప్రజలను చైతన్యపరిచే వాగ్ధాటి కలిగిన వక్తగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. జైలు జీవితం అనుభవించినప్పటికీ, అక్కడ కూడా మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనలను బోధిస్తూ ఉద్యమానికి బలమైన పునాదులు వేశారు. 1978 జూలై 17న జరిగిన జగిత్యాల రైతు కూలీ మహాసభ, ఆ తర్వాత చరిత్రలో నిలిచిపోయిన జగిత్యాల జైత్రయాత్రకు ఆయన ముఖ్య సూత్రధారుల్లో ఒకరు. ఈ యాత్ర తెలంగాణ గ్రామీణ ప్రజల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాట స్ఫూర్తిని రగిలించింది. విద్యార్థులు, యువకులు గ్రామాల్లో నిర్వహించిన చైతన్య కార్యక్రమాలతో రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో ఉద్యమంలో భాగస్వాములయ్యేలా చేసిన కృషిలో నారాయణ పాత్ర ఎంతో ముఖ్యమైనది. ఆయన వేసిన వ్యూహాలు ఉద్యమాన్ని ప్రజల గుండెల్లోకి తీసుకువెళ్లాయి. అయితే, కాలక్రమంలో పార్టీ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలపై నారాయణ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలు చేయాలన్న ఆయన ఆలోచనలకు విరుద్ధంగా పార్టీ గెరిల్లా పోరాటాలకు ప్రాధాన్యత ఇచ్చింది. రహస్య మార్గాల కంటే ప్రజలకు చేరువగా ఉండే పోరాట పద్ధతుల వైపు ఆయన మొగ్గు చూపారు. ఈ విభేదాల కారణంగానే 1982లో జైలు పాలై,1984లో జైలు నుండి విడుదలైన తర్వాత ఆయన పార్టీకి దూరమయ్యారు. పార్టీని వీడినా, కేసులు కొట్టేయ బడినా, భూస్వాముల పాత పగలు ఎక్కడ వెంటాడతాయోనని, కొంత కాలం రహస్య జీవితాన్నే ఎంచుకుని, కుటుంబంతో కలిసి, నారాయణ హైదరాబాద్ వెళ్ళి, సిటీ బస్ కండక్టర్ గా కుశాయి గూడ బస్ డిపోలో మూడో నెంబర్ రూట్ పై పని చేసి రిటర్ అయ్యారు. పార్టీని వీడినప్పటికీ, ఆయన ఆశయాలు మాత్రం మారలేదు. భూస్వాముల దోపిడీని ఆయన ఎప్పటికీ మరచిపోలేదు. కష్టాల చీకటి ఆయన జీవితంలో ఒక భాగమైపోయింది. హైదరాబాద్‌లో సిటీ బస్సు కండక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ తర్వాత, పట్టణ వాతావరణం వీడి, తిరిగి జన్మ నిచ్చిన స్వగ్రామానికే తిరిగి వచ్చారు. ఉద్యమం రూపురేఖలు మారినా, ఆయన లక్ష్యం మాత్రం చెక్కుచెదరలేదు. గ్రామాల్లో సామాజిక మార్పు ఆయన హృదయంలో నిత్యం మెదులుతూనే ఉంది. తన ఆశయాలను గుర్తు చేసుకుంటూ ఆయన మిగిలిన జీవితాన్ని గడిపారు. నేటి పీపుల్స్ వార్ మావోయిస్టు పార్టీకి తొలి బీజాలు వేసి చరిత్ర సృష్టించిన కార్యకర్తగా, నాయకుడిగా, మార్గదర్శిగా, నారాయణను విప్లవ చరిత్ర గుర్తుంచు కుంటుంది. నారాయణ ఆలోచనలు సాకారమైతే, ఆ పంథాలో ఉద్యమాలు సాగితే గ్రామ స్వరాజ్యం, స్థానిక పాలన , బహుజన సామాజిక అధికారం మార్పిడి ఎపుడో జరిగి వుండేదని ఆయన అభిమానులు ఇప్పటికీ భావిస్తుంటారు. నారాయణ కేవలం చరిత్రలోని ఒక పేజీ మాత్రమే కాదు, ఉద్యమాల స్ఫూర్తి. ఆయన చూపిన మార్గం నేటికీ గ్రామాల్లోని ప్రజలకు, రైతులకు, యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. నేటి మావోయిస్టు ఉద్యమానికి, పీపుల్స్ వార్‌కు ఆయన నాటిన విప్లవ బీజాలే మూలం. జగిత్యాల జైత్రయాత్ర చరిత్రలో నిలిచి ఉన్నంత కాలం, పల్లెమీది నారాయణ పేరు తరతరాలకూ గుర్తుండి పోతుంది. ఆయన పేరు అమరవీరుల జాబితాలో కనిపించక పోయినా, ఆయన జీవితం ఒక గొప్ప శిల్పం. మానవత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం ఒక నిరంతర ప్రయాణం. తెలంగాణ చరిత్రలో ఉద్యమం అంటే ఏమిటో తన జీవితం ద్వారా చూపించిన ఒక గొప్ప వ్యక్తి ఆయన. పల్లెమీది నారాయణ సార్ ఒక యుగపురుషుడు అంటే అతిశయోక్తి కాదేమో... **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# తెలుగు రాష్ట్రాల తెరచాటు 'జల' యుద్ధం.. బాబే కదలాలి!



–రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి సమస్యలు, వివాదాలు కామన్‌గానే ఉన్నాయి. గతంలో రాష్ట్ర విభజన నుంచి ఇప్పటి వరకు కూడా.. ఈ వివాదాలు కొనసాగుతున్నాయి. కానీ.. ఇప్పుడు తార స్థాయికి చేరింది. "ఏపీకి చుక్కనీరు కూడా ఇవ్వొద్దు. తాగడానికి కూడా ఇవ్వడానికి వీల్లేదు" అని తెలంగాణ ప్రభుత్వం తెగేసి చెప్పేసింది. అంతేకాదు.. ఇదే చేయకపోతే.. తాము మరింత దూకుడుగా వ్యవహరిస్తామని కూడా.. కృష్ణారివర్ బోర్డు మేనేజింగ్‌కు తేల్చి చెప్పింది. అయితే.. గతంలో తెలంగాణలో బీఆర్ ఎస్ ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో ఏపీలో చంద్రబాబు సర్కారు ఉన్నప్పుడు.. సహకారం లోపించింది. దీంతో ఇరు రాష్ట్రాల మధ్య జల వివాదాలు కొనసాగాయి.

ఆ తర్వాత.. జగన్ ప్రభుత్వం ఏపీలో కొలువు దీరిన తర్వాత.. కష్టాలు.. నష్టాలు తగ్గుతాయని అందరూ అనుకున్నారు.కానీ, అప్పట్లోనూ కాళేశ్వరంపై జగన్, రాయల సీమ ఎత్తిపోతలపై కేసీఆర్ ప్రభుత్వం వివాదానికి దిగాయి. మొత్తానికి పదేళ్లు గడిచిపోయాయి. ఇక, ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్, ఏపీలో కూటమి ప్రభుత్వం ఉన్నాయి. పైగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు, ఆయన శిష్యుడేనని పిలిపించుకునే రేవంత్‌రెడ్డి తెలంగాణ సీఎంగా ఉన్నారు. వీరిద్దరి మధ్య ఒకసారి చర్చలు కూడా జరిగాయి. స్వయంగా చంద్రబాబు వెళ్లి హైదరాబాద్‌లో మీట్ అయ్యారు. ఆ తర్వాత.. జల వివాదాలను సామరస్య పూర్వకంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని భావించారు. ఈ క్రమంలోనే కమిటీని కూడా ఏర్పాటు చేయాలని అనుకున్నారు. కానీ, ఏడు మాసాలు పూర్తయినా.. దీనిపై ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పైగా.. ఇప్పుడు మరింత వివాదాలు తెరమీదికి వచ్చాయి. నాగార్జున సాగర్‌లో నీటిని చుక్క కూడా ఏపీకి ఇచ్చేది లేదని కనీసం తాగునీరు అవసరాలను కూడా తీర్చడానికి వీల్లేదని తెలంగాణ సర్కారు ముక్కుమీద గుద్దినట్టు కేఆర్ ఎంబీ(కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు)ను దాదాపు ఆదేశించినంత పనిచేసింది. ఇదేసమయంలో ఏపీ కూడా.. అసలు తెలంగాణ తన వాటాను పూర్తిగా వాడేసిందని.. తనకు ఇలాంటి మాటలు మాట్లాడే హక్కులేదని.. అవసరమైతే.. సుప్రీంకోర్టుకు వెళ్తామని తేల్చి చెప్పింది. కానీ.. ఇదే జరిగితే.. అటు తెలంగాణ, ఇటు ఏపీ కూ డా ఇబ్బందులు పడతాయి. ఈ క్రమంలో ఇప్పటికైనా సీఎం చంద్రబాబు ఒక మెట్టు దిగి.. చర్చలకు వస్తే తప్పు.. సమస్య పరిష్కారం కాదని అంటున్నారు నిపుణులు. మరి ఏం చేస్తారో చూడాలి. పంతానికి పోవడం రెండు రాష్ట్రాలకూ సరికాదని కూడా చెబుతున్నారు.

చురకలు

## సంపాదకీయం

# స్వార్థంతోనే పాక్ కు టర్కీ సాయం..

# దీనివెనుక పెద్ద స్కెచ్

ఇండియా వర్సెస్ పాకిస్తాన్ వార్ లో టర్కీ పాకిస్తాన్‌కు గణనీయమైన మద్దతును ప్రకటించింది, ఇందులో డ్రోన్లు , క్షిపణులతో సహా సైనిక సాయం అందజేసింది. భవిష్యత్తులో కూడా సహాయం కొనసాగిస్తామని హామీ ఇచ్చింది. టర్కీకి, భారతదేశానికి మధ్య సంఘర్షణ చరిత్ర లేనందున ఈ చర్య చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది. ఈ గుణపాఠంతో ఇప్పుడు అందరూ 'బాయ్ కాట్ టర్కీ' అంటూ నినదిస్తున్నారు. టర్కీ ఉద్దేశాలు భారతదేశం పట్ల ద్వేషంతోనే పాతుకుపోలేదు. పాకిస్తాన్ ప్రేమ కాదు.. అంతకుమించిన స్వార్థం ఉందని తెలిసింది. స్వార్థంతో కూడిన "మాస్టర్ ప్లాన్" ను టర్కీ చేసిందని చెబుతున్నారు. ఇస్లామిక్ దేశమైన టర్కీకి అధ్యక్షుడు ఎర్డోగాన్ నాయకత్వం వహిస్తున్నారు. ఇస్లామిక్ ప్రపంచానికి నాయకత్వం వహించాలనే ఆశయాలు ఆయనకు ఉన్నట్లు అర్థమవుతోంది.. ఇస్లామిక్ దేశాలలో టర్కీని ఆధిపత్య శక్తిగా నిలబెట్టడానికి ఆయన ఆసక్తి చూపుతున్నట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మరొక ఇస్లామిక్ దేశమైన పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడం టర్కీ ప్రభావంలోకి తీసుకురావడానికి ఒక వ్యూహాత్మక చర్యగా పరిగణించబడుతుంది. టర్కీ పాకిస్తాన్‌కు భారత్ పై ఉపయోగించడానికి డ్రోన్‌లను కూడా సరఫరా చేసింది. ఇది ఈ సంబంధంలో వ్యాపార స్వభావాన్ని హైలైట్ చేస్తుంది. పాకిస్తాన్‌కు మద్దతు కేవలం సంఘీభావ చర్య కాదని, ఆ దేశంపై పట్టు సాధించడానికి ఒక లెక్కించిన ప్రయత్నమని ఈ దృక్పథం తెలియజేస్తోంది. అధ్యక్షుడు ఎర్డోగాన్ తన విస్తృత లక్ష్యాలను సాధించడానికి పాకిస్తాన్ ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్నారని తెలుస్తోంది. ఇస్లామిక్ ప్రపంచంలో టర్కీ నాయకత్వాన్ని పాకిస్తాన్ అంగీకరించడంపై ఈ మద్దతు ఆధారపడి ఉంటుంది. చాలా అరబ్ యేతర ఇస్లామిక్ దేశాలకు బలమైన ఆర్థిక శక్తి లేదని, దీనిని అధ్యక్షుడు ఎర్డోగాన్ తన ప్రయోజనం కోసం ఉపయోగించుకుంటున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. అందువల్ల పాకిస్తాన్‌కు అందించే సహాయం పూర్తిగా పరోపకారం కాదని, టర్కీ యొక్క విస్తృత భౌగోళిక రాజకీయ ఆశయాలలో ఒక వ్యూహాత్మక ఎత్తుగడగా భావిస్తున్నారు.. పాకిస్తాన్ ఇస్లామిక్ దేశాలలో టర్కీ నాయకత్వ ఆకాంక్షలకు అనుగుణంగా లేకపోతే, అటువంటి సహాయం కొనసాగింపును టర్కీ పునఃపరిశీలించే అవకాశం ఉంటుంది . ఇది ఇస్లామిక్ ప్రపంచంలో తన ప్రభావాన్ని పటిష్టం చేయడానికి లక్ష్యంగా చేసుకున్న టర్కీ విదేశాంగ విధానంలో ఒక స్వార్థపూరిత అంశంగా పాకిస్తాన్‌కు దాని మద్దతును విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

# తెలుగు సినీ పరిశ్రమకు "అమ్మ" శాంత కుమారి - మే 17...శాంత కుమారి జయంతి




తెలుగు చిత్ర పరిశ్రమ ఆప్యాయంగా 'అమ్మ' అని పిలుచుకునే నటి శాంతకుమారి అత్యంత పాత తరానికి, తొలి టాకీ చిత్రాల కాలానికి చెందిన సినీ నటి. తెలుగు సినిమా పరిశ్రమలో అలనాటి మేటి కథా నాయకులైన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎం.జి. రామచంద్రన్, శివాజీ గణేశన్ లతో పలు చిత్రాలలో నటించారు. 250 చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. ఎన్టి రామారావు నిర్మించి, దర్శకత్వం వహించిన తల్లా పెళ్ళామా చిత్రంలో ఆమె అమ్మమ్మ పాత్ర పోషించారు. ఆమె పేరొందిన దర్శకుడు పి.పుల్లయ్య సతీమణి. 1936లో 'శశిరేఖా పరిణయం' సినిమాతో నటజీవితం ప్రారంభించారు. శాంతకుమారి అసలు పేరు వెల్లాల సుబ్బమ్మ. సుబ్బమ్మ వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు లో మే 17, 1920 సంవత్సరంలో జన్మించారు. తండ్రి వెల్లాల శ్రీనివాసరావుకు కళలు అంటే ఎంతో ఇష్టం. అందుకనే కూతురైన సుబ్బమ్మను మద్రాసులో ఉన్న ప్రొ.పి. సాంబమూర్తి వద్దకు కర్ణాటక సంగీతం, వయొలిన్ నేర్చు కోవటానికి దరఖాస్తు చేయించారు. డి.కె.పట్టమ్మాళ్... సుబ్బమ్మకు సహాధ్యాయిని. పదమూడేళ్ళ వయసులోనే సుబ్బమ్మ కర్ణాటక సంగీతంలో ఉత్తీర్ణురాలయ్యింది. పదిహేనేళ్ల వయసులో వయొలిన్ లో ఉత్తీర్ణురాలైనారు. తరువాత గురువుతో కలసి దక్షిణ భారతదేశం అంతా ఎన్నో కచేరీలు చేశారు. పదహారేళ్ళ వయసులోనే విద్యోదయా స్కూలులో పిల్లలకు సంగీతం నేర్పించే వారు. పదహారేళ్ళ వయసులో ఆలిం డియా రేడియో కళాకారిణి. ఆకాశవాణి కోసం సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వర రావుతో కలిసి పాడారు. సుబ్బమ్మ కచేరి చూసిన దర్శక – నిర్మాత పి.వి.దాసు (పినపాల వెంకట దాసు) మాయా బజార్/శశిరేఖ పరిణయం (1936) సినిమాలో శశిరేఖ పాత్రను ఇచ్చారు. కానీ సుబ్బమ్మ సినిమా లలో నటించటానికి ఆమె బామ్మ నిరాకరించడంతో, పి.వి.దాసు, అయన మేకప్ మన్ మంగయ్య ఒప్పించడానికి ఎంతో ప్రయత్నించారు. సుబ్బమ్మను శశిరేఖ వేషంలో చూసిన ఆమె బామ్మ చివరకు ఆమె సినిమాలో నటించడానికి ఒప్పుకొన్నారు. దాసు, సుబ్బమ్మ కొంచెం పాతగా ఉందని పేరును శాంతకుమారిగా మార్చారు. శాంతకుమారిగా మారిన నట – గాయక సంచలనం తరువాత సినిమా సారంగధర (1937)లో చిత్రాంగి అనే దుష్ట పాత్రను ఎంతో ఉత్సాహ భరితంగా పోషించారు. చిత్ర దర్శకుడైన పి.పుల్లయ్యను ఇష్టపడి పెళ్ళి చేసుకొన్నారు. పెళ్ళి చేసు కొన్న తరువాత కూడ ఆమె నట జీవితం సాఫీగా కొనసాగింది. శాంతకుమారి పి.పుల్లయ్య దంపతులకు రాధ, పద్మ అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు. పుల్లయ్య, శాంతకుమారి 1979 లో ముత్తైదువా అనే ఏకైక చిత్రంలో భార్య మరియు భర్తగా నటించారు. శాంత కుమారి సినిమా జీవితం ప్రారంభ దశలో అన్నీ పురాణాలు ఇతివృత్తంగా ఉన్న సినిమాలలోనే నటించారు. యశోదగా కూడా నటించిన ఆమె కృష్ణుని ముద్దుచేస్తూ "చిరు చిరు నగవులు చిందే తండ్రి" అనే మధురమైన పాటను అద్భుతంగా పాడారు. శాంతకుమారికి మెదటి సాంఘిక చిత్రం ధర్మపత్ని. ఈ చిత్రంలో భానుమతి, శాంత కుమారి, రాళ్ల బండి కుటుంబరావు, పెద్దాపురం రాజు, బేబీ లక్ష్మి, ఆరణి సత్య నారాయణ మొదలైన వారు నటించారు. హనుమంత రావు అనే నటుడు హీరో పాత్ర ధారి. అందులో అక్కినేని నాగేశ్వరరావు పలువురు విద్యార్థులతో కలిసి, విద్యార్థిగా నటించారు. అక్కినేనికి శాంత కుమారికీ మధ్య ఎంతో ఆత్మీయ మైన అనుబంధం ఉండేది. అక్కినేనిని ఆమె అప్యాయంగా చిన్న తమ్ముడిని పిలచినట్లు "అబ్బి" అనే వారు. మాయలోకం సినిమాలో అక్కినేనికి ప్రక్క కథా నాయికగా నటించిన శాంత కుమారి, జయభేరి సినిమాలో వదినగా నటించారు, అర్ధాంగి సినిమాలోనైతే సవతి తల్లిగా నటించారు. ఎన్.టీ.ఆర్ కు కూడా తల్లా పెళ్ళామా సినిమాలో బామ్మగా నటించారు. తెలుగు సినీ పరిశ్రమలో అగ్రతారలైన ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, తమిళ సినీ ప్రముఖులు శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ తదితరులకు చాలా చిత్రాల్లో శాంతకుమారి తల్లిగా నటించారు. పద్మశ్రీ పిక్చర్స్, రాగిణి పిక్చర్స్ పేరుతో సొంతంగా ఇరవైకి పైగా సినిమాలను నిర్మించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. తమ కుమార్తె పద్మ పేరు మీద పద్మశ్రీ పిక్చర్స్ పేరును వారి కొన్ని సినిమాలకు ఉపయో గించారు. జయభేరి (1959), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), ప్రేమించి చుడు (1965) వంటి చిత్రాలతో విజయం సాధించారు. శంకరు (1950), అర్ధాంగి (1955), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), శాంతి నివాసం (1960), రాముడు భీముడు (1964) సహా తన భర్త నిర్మించిన చాలా సినిమాల్లో సంతకుమారి నటించారు. పద్మశ్రీ మరియు రాగిణి బ్యానర్‌లలో వారు 22 సినిమాలు చేశారు. ఆమె సుమారు 250 చిత్రాలలో నటించారు. కృష్ణ ప్రేమ, రేచుక్క, అర్ధాంగి, 'జయభేరి, ప్రేమ్‌నగర్' ఆమెకు పేరు తెచ్చిన సినిమాలు. సినిమాలలో నటించ డం మానేసిన తరువాత ఆమె మంగళంపల్లి బాలమురళీ కృష్ణ పాడే పాటలను వ్రాసి, స్వరపరిచే వారు. మాయా బజార్ లేదా శశిరేఖా పరిణయం (1936), సారంగధర (1937), రుక్మిణీ కల్యాణం (1937), భక్త జయదేవ (1938), శ్రీ వేంకటేశ్వర మహత్యం (1939), ధర్మపత్ని (1941), పార్వతీ కల్యాణం (1941), కృష్ణప్రేమ (1943) (రాధ పాత్ర), మాయా లోకం (1945), గుణసుందరి కథ (1949) (గుణసుందరి దేవి దుష్ట బుద్ధిగల అక్కగా), షావుకారు (1950), ధర్మదేవత (1952) (కాత్యాయిని పాత్ర), అర్ధాంగి (1955), సారంగధర (1957), జయభేరి (1959) (అన్నపూర్ణ పాత్ర), శ్రీ వెంకటేశ్వర మహత్యం (1960) (వకుళ పాత్ర), సిరి సంపదలు (1962), ప్రేమించి చూడు (1965), ప్రాణ మిత్రులు (1967), బంగారు పిచ్చుక (1968), అక్కా చెల్లెలు (1970) (జడ్జి రామచంద్రరావు తల్లి), ప్రేమనగర్ (1971), కొడుకు కోడలు (1972), సోగ్గాడు (1975), అందరూ బాగుండాలి (1976) తదితర చిత్రాలలో నటించారు. 1999వ సంవత్సరానికి గాను ఆమె 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను అందుకున్నారు. ఎన్టిఆర్ జయంతి సందర్భంగా సినీ కళాకారులకు ఇచ్చే 'కళా నీరాజన' పురస్కారాన్ని కూడా ఆమె పొందారు. తెలుగు వెండి తెర బామ్మ 86 సంవత్సరాల వయస్సులో, సుదీర్ఘ అనారోగ్యంతో జనవరి 17, 2006 న స్వగృహంలో మృతి చెందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# టీకా సృష్టికర్త ఎడ్వర్ట్ జెన్నర్ - రోగ నిరోధక శాస్త్ర పితా మహుడు ఎడ్వర్ట్ జెన్నర్ - మే 17... ఎడ్వర్డ్ జెన్నర్ జయంతి



వివిధ వ్యాధులు సోకకుండా కాపాడు కోవడానికి, రోగ నివారణ కోసం వ్యాక్సిన్లు తీసుకోవడం సర్వ సాధారణ మై పోయింది. కుక్కకాటు, క్షయ, కలరా, కామెర్లు, మలేరియా, కేన్సర్ల వంటి వ్యాధులకు పూర్వం సరైన మందులు లేవు. ప్రధానంగా మానవాళి మనుగడకు పెను సవాలుగా నిలిచిన మశూచి వ్యాధి ప్రపంచ మంతా భయంకరంగా వ్యాపించి ఉండేది. ఇంగ్లండ్‌కు చెందిన ఎడ్వర్డ్ జెన్నర్ మహనీయుడు స్మాల్‌ఫాక్స్ వ్యాధి సోకకుండా ఉండటానికి వ్యాధి నిరోధక 'వాక్సినేషన్' మందు కనిపెట్టి మానవాళికి ఎంతో మేలు చేశాడు. వ్యాక్సిన్ అనే పదం 'వాకా' నుంచి వచ్చింది. వాకా అంటే ఆవు అని అర్థం. స్మాల్‌పాక్స్ (మశూచి) క్రీ.పూ 3వ శతాబ్దం నుంచి మానవ చరిత్రలో ఈ వ్యాధి ప్రస్తావన కనిపిస్తుంది. 18వ శతాబ్ది నాటికి కాలనైజేషన్ కారణంగా ప్రపంచమంతా విస్తరించింది. దీనివల్ల కలిగే మరణాలు భారీగా ఉండేవి. మశూచి అంటువ్యాధి. అయితే, దీనికి వ్యాక్సిన్ కనిపెట్టింది మాత్రం 1796వ సంవత్సరంలోనే బ్రిటన్ కు చెందిన డాక్టర్ ఎడ్వర్డ్ జెన్నర్ మశూచికి వ్యాక్సిన్ కనిపెట్టారు. ఒక వ్యాధికి అడ్డుకట్ట వేయడానికి తయారు చేసిన తొలి వ్యాక్సిన్ ఇదే. దీని వల్లే మశూచి మరణాల సంఖ్య గణనీయంగా తగ్గాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాక్సిన్ అందుబాటు లోకి రావడంతో 1980 నాటికి మశూచి అంతమైనట్లు అప్పటి వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ప్రకటించింది. జెన్నర్ ఒక ఆంగ్ల వైద్యుడు, మశూచి వ్యాక్సినేషన్ మార్గదర్శకుడు, రోగనిరోధక శాస్త్ర పితామహుడు. ఎడ్వర్డ్ జెన్నర్ 1749 మే 17న గ్లౌసెస్టర్‌షైర్ లోని బర్కిలీలో జన్మించాడు. 14 సంవత్సరాల వయస్సులో, స్థానిక సర్జన్ వద్ద, తరువాత లండన్‌లో శిక్షణ పొందాడు. 1772లో, అతను బర్కిలీకి తిరిగి వచ్చాడు. అతని కెరీర్‌లో ఎక్కువ భాగం తన స్థానిక పట్టణంలో వైద్యుడిగా గడిపాడు. 1796లో, అతను ఎనిమిదేళ్ల జేమ్స్ ఫిప్స్‌పై ఇప్పుడు ప్రసిద్ధి చెందిన ప్రయోగాన్ని చేశాడు. జెన్నర్ కౌపాక్స్ స్ఫోటము నుండి తీసిన చీమును బాలుడి చేతిపై ఒక కోతలోకి చొప్పిం చాడు. తన ప్రయోగాన్ని వివరిస్తూ 1797లో రాయల్ సొసైటీకి ఒక పత్రాన్ని సమర్పిం చాడు, జెన్నర్ తన స్వంత 11నెలల కొడుకుతో సహా ఇతర పిల్లలపై ప్రయోగాలు చేశాడు. 1798లో, ఫలితాలు చివరకు ప్రచురించ బడ్డాయి. మశూచి 16, 17 శతాబ్దంలో కొన్ని లక్షల మంది చావుకు కారణం అయిన వ్యాధి. ఎడ్వర్డ్ జెన్నర్ డాక్టర్ అయ్యాక గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం చేయడం ప్రారంభించాడు. మశూచి బాగా ప్రభలుతున్న కాలంలో డైరీ ఫారం లో పనిచేస్తూ కౌ ఫాక్స్ వ్యాధి వచ్చిన రైతులకు మశూచి సోకడంలేదని ఆయన గమనించాడు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే కౌఫాక్స్‌తో బాధపడుతున్న ఒక వ్యక్తి అతను పనిచేసే డాక్టర్ దగ్గరకు వచ్చాడు. కౌఫాక్స్ సోకిన వ్యక్తులు స్మాల్‌ఫాక్స్ బారిన పడక పోవడాన్ని ఎడ్వర్డ్ గమనించాడు. ఈ పరిశీలనే స్మాల్‌ఫాక్స్‌కు వ్యాక్సిన్ తయారుచేసేలా తోడ్పడింది. మొట్టమొదట వ్యాక్సిన్ తయారుచేసిన పరిశోధకుడిగా చరిత్రలో నిలిచిపోయేలా చేసింది. ఎడ్వర్ట్ జెన్నర్‌కు ఫాదర్ ఆఫ్ ఇమ్యునాలజీ అని పేరుంది. తన ఫ్రెండ్ అనుమతితో ఆయన కొడుకు అయిన జేమ్స్ మీద 1796 మే 14 న ఒక ప్రయోగం చేసాడు. కౌ ఫాక్స్ సోకిన వ్యక్తి శరీరం మీద వచ్చే బొబ్బ నుంచి వచ్చే స్రావాన్ని జేమ్స్ కి రాసేసి కౌ ఫాక్స్ వచ్చేలా చేశాడు. 6వారాల తర్వాత జేమ్స్ ని మశూచి కి గురిచేయగా, ఎటువంటి మసూచి లక్షణాలు కనిపించలేదు. ఇదే మశూచి వాక్సిన్ కనుగొనడానికి జరిగిన ప్రయత్నం. వ్యాక్సిన్‌లోని పరిణామాలపై పరిశోధన, సలహాలు ఇవ్వడంలో ఎక్కువ సమయం గడిపాడు. జెన్నర్ అనేక ఇతర రంగాలలో పరిశోధన చేసాడు. శిలాజ సేకరణ, ఉద్యాన వనాలపై కూడా ఆసక్తిని పెంచు కున్నాడు. వ్యాధి నివారణలో మానవాళికి మహోపకారం చేసిన జెన్నర్ 1823 జనవరి 26న మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# నిశ్శబ్ద హంతకి పట్ల అవగాహన అవసరం - మే 17...ప్రపంచ రక్తపోటు దినోత్సవం




రక్తపోటు... ఇది ఒక మౌన వ్యాధి. లక్షణాల్లేకుండానే శరీరాన్ని లోపలివేపు నశింపజేసే "నిశ్శబ్ద హంతకి" అని దీనిని వైద్య నిపుణులు అభివర్ణిస్తారు. దీని ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా... మన దేశంలోనూ అత్యంత తీవ్రమైన ఆరోగ్య సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజలలో రక్తపోటు పట్ల అవగాహన కల్పించడం, ముందస్తుగా గుర్తించి, నివారించడమే దీని ముఖ్య ఉద్దేశం. రక్తపోటు అనే పదం మన శరీరంలోని అత్యవసర ప్రక్రియకు చెందినది. మన హృదయం ప్రతి ముట్టెడు రక్తాన్ని శరీరంలోని ఇతర అవయవాలకు పంపిస్తుంది. ఈ పంపకంలో, రక్తం రక్తనాళాల్లోకి ప్రెషర్‌తో ప్రవహిస్తుంది. దీని ద్వారానే శరీరం జీవశక్తిని పొందుతుంది. ఈ ప్రెషర్, లేదా ఒత్తిడినే రక్తపోటు అంటారు. ఇది రెండు రకాలుగా కొలుస్తారు. గుండె శ్వాసించే సమయంలో వచ్చేది సిస్టాలిక్ ప్రెషర్, విశ్రాంతి సమయంలో దయాస్టాలిక్ ప్రెషర్. సాధారణంగా 120/80 mm Hg వరకు ఉండే రక్తపోటు ఆరోగ్యంగా పరిగణించబడుతుంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నిర్వహించిన అధ్యయనాల ప్రకారం, దేశంలో సుమారు 31 కోట్ల మంది ప్రజలు %-% అంటే దాదాపు నాలుగింట ఒక వంతు జనాభా – రక్తపోటుతో బాధ పడుతున్నారు. పురుషులలో ఇది సగటున 24 శాతంగా ఉండగా, మహిళలలో 21 శాతంగా నమోదు అయింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లోకంటే పట్టణాల్లో రక్తపోటు వ్యాప్తి మరింత అధికంగా ఉంది. ఇది జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, మరియు శారీరక చురుకుదనాన్ని కోల్పోవడం వంటి అంశాలకు నిదర్శనం. మహారాష్ట్ర రాష్ట్రంలో పరిస్థితి మరింత శోచనీయంగా ఉంది. ఇండియా హైపర్టెన్షన్ కంట్రోల్ ఇనిషియేటివ్ ప్రకారం, రాష్ట్రంలో సుమారు 27 లక్షల మంది నమోదైన రక్తపోటు రోగులున్నారు. ముంబై వంటి మహా నగరాల్లో ఈ వ్యాధి వ్యాప్తి 35 శాతం దాటినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కేవలం వృద్ధుల్లోనే కాక, యువతలోను, కొద్దిపాటి మానసిక ఒత్తిడికే విలవిలలాడే ఉద్యోగ జీవనశైలిలో ఉన్నవారి లోనూ హైపర్టెన్షన్ పెరుగుతోంది. రక్తపోటుకు ముఖ్య కారణాలు అనేకం %-% అధిక బరువు, అధిక ఉప్పు వాడకం, ధూమపానం, మద్యం, ఆందోళన, కుటుంబ వారసత్వం, వ్యాయామాభావం మొదలైనవి. చాలా సందర్భాల్లో ఇది లక్షణాల్లేకుండా వస్తుంది. కానీ దీర్ఘకాలంగా అది గుండెపోటు, స్ట్రోక్, కిడ్నీ సమస్యలు, కనురెప్పల నష్టం వంటి తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. అందుకే దీన్ని "నిశ్శబ్ద హంతకి" అంటారు. ఈ పరిస్థితుల్లో ముందస్తు జాగ్రత్తలు అత్యంత అవసరం. ప్రతి ఒక్కరూ తమ రక్తపోటును క్రమం తప్పకుండా కొలవడం మొదలు పెట్టాలి. ఆహార నియమాలు పాటించాలి – తక్కువ ఉప్పు, ఎక్కువ పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు తీసుకోవాలి. రోజూ కనీసం 30 నిమిషాలు శారీరక శ్రమ చేయడం, మద్యం, ధూమపానం మానేయడం, యోగా, ధ్యానం వంటి పద్ధతులతో ఒత్తిడిని తగ్గించుకోవడం కూడా ఎంతో ఉపకరిస్తుంది. మునుపు నుంచి రక్తపోటుతో బాధపడేవారు వైద్యుల సలహా మేరకు మందులు నిర్లక్ష్యం చేయకుండా వాడాలి. 2025లో ప్రపంచ రక్తపోటు దినోత్సవం థీమ్ ు "Measure Your Blood Pressure Accurately, Control It, Live Longer" ు అంటే "మీ రక్తపోటును ఖచ్చితంగా కొలవండి, అదుపులో పెట్టుకోండి, ఆయుష్షు పెంచుకోండి". ఈ సందేశం మన ఆరోగ్యంపై మేల్కొలుపుగా నిలవాలి. మన ఆరోగ్యాన్ని మనమే పట్టించుకోవాలన్న సంకల్పానికి ఇది ఒక గొప్ప అవకాశం. ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా మాత్రమే మనం ఈ మౌన వ్యాధిని ఎదుర్కొన గలుగుతాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చురకలు



# వరద వచ్చేలోగా.. పనులు పూర్తయ్యేనా!

ఖమ్మం : గతేడాది మున్నేరు పోటెత్తింది. ఖమ్మం నగరం, గ్రామీణ మండలాల్లో తీరని నష్టం వాటిల్లింది. మళ్లీ అటువంటి వరద వస్తే రక్షణగా ఉండేందుకు కరకట్టలు(రిటైనింగ్ వాల్స్) నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకవైపు ఖమ్మం అర్బన్, రెండోవైపు ఖమ్మం గ్రామీణ మండలాలు ఉన్నాయి. రెండు వైపులా 8.50 కి.మీ. పొడవున 17 కి.మీ పొడవున 35 అడుగుల ఎత్తు గోడలు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో పనులు కొనసాగుతున్నాయి. అవల 4 కి.మీ., నగరం వైపు 1.1 కి.మీ. గోడలు 15 నుంచి 20 అడుగుల ఎత్తు వరకు ముక్కలుగా నిర్మిస్తున్నారు. మధ్యలోని పట్టా స్థలాల్లో భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారింది.

**భూసేకరణే అడ్డంకి..**

గ్రామీణ మండలంలోని పోలేపల్లి, గోళ్లపాడు, గుదిమళ్ల, గుర్రాలపాడు, ఏదులాపురం రెవెన్యూ పరిధిలోని పట్టా భూముల రైతులతో రెవెన్యూ, నీటిపారుదల అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఎక్కువ శాతం మంది భూమి ఇచ్చేందుకు ముందుకొచ్చినట్లు సమాచారం. కరుణగిరి చర్చి నిర్వాహకులు 13 ఎకరాలు స్వచ్ఛందంగా అప్పగించారు. అర్బన్ మండలంలో మామిళ్లగూడెం, దానవాయిగూడెం, బుర్హాన్‌పురం, ఖమ్మం రెవెన్యూ గ్రామాల్లోని పట్టా భూములు కోల్పోతున్న రైతులు ఎక్కువ మంది విముఖంగా ఉన్నారు. తమ భూములు విలువైనవని, నష్ట పరిహారం ఎంత ఇస్తారో ముందుగా తేల్చాలంటున్నారు.

పోలేపల్లి రెవెన్యూ పరిధిలో 125 ఎకరాల ఇరిగేషన్ భూమిలో లేఅవుట్ చేసి ఇళ్ల స్థలాలు అభివృద్ధి చేస్తున్నారు. భూములు కోల్పోతున్న వారికి దామాషా ప్రకారం ఇళ్ల స్థలాలు కేటాయించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నిర్ణయించారు. కొందరు తమకు స్థలాలు వద్దని



పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. అందుకే భూసేకరణ ప్రక్రియ ఆలస్యమవుతోంది.

**తగ్గనున్న చెక్‌డ్యాం ఎత్తు!**

ఈసారి వరద వస్తే ఎదుర్కోక తప్పదు. అందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. వరద సన్నద్ధతపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ముందస్తు సమావేశం నిర్వహించారు. మున్నేరులో ప్రకాశ్‌నగర్ వద్ద నిర్మించిన చెక్ డ్యాం వల్ల గతేడాది ఎక్కువ నష్టం జరిగిందని, ఎత్తు కనిష్ట స్థాయికి తగ్గించాలని నిపుణుల కమిటీ సూచించింది. ఇందుకు అనుమతులు కోరుతూ అధికారులు ప్రభుత్వానికి రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపించనున్నారు. వరదలు వచ్చేలోగానే చెక్ డ్యాం ఎత్తు తగ్గించే అవకాశం ఉంది. భూసేకరణలో సమస్యలున్నా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచనలతో ముందుకు సాగుతున్నాం. అనువైన ప్రదేశంలో గోడలు నిర్మిస్తున్నాం. వరదలు వచ్చేలోగా పునాదుల వరకు నిర్మాణ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నాం. మంగళంపూడి వెంకటేశ్వర్లు, ఎస్ఈ, నీటిపారుదలశాఖ, ఖమ్మం


# కరుగుతోంది కాలం.. కదలనంటోంది ధాన్యం

ఖమ్మం: నైరుతి రుతుపవనాలు గతంలో కన్నా ఈసారి ముందుగానే పలకరిస్తాయని వాతావరణశాఖ చెబుతోంది. ఈ నెలాఖరుకు తెలంగాణలో వానలు మొదలయ్యే అవకాశముందని అంచనా వేస్తో ంది. వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతు న్నారు. అయినా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో యాసంగి ధాన్యం సేకరణ ప్రక్రియ రైతులకు పరీక్ష పెడుతోంది. వారాల తరబడి కదలని కాంటాలతో సాగుదారులకు తంటాలు తప్పటం లేదు.

**ఉభయ జిల్లాల్లో..** ఖమ్మం జిల్లాలో ఈసారి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని పౌరసరఫరాలశాఖ లక్ష్యం నిర్దేశించుకుంది. ఏప్రిల్ 1న ధాన్యం కొనుగోళ్లు మొదలుపెట్టింది. ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభమై ఆరు వారాలు దాటినా లక్ష్యంలో సగానికి కూడా చేరుకోకపోవటం గమనార్హం. జిల్లాలో ఇప్పటివరకు 15వేల మంది రైతుల నుంచి 1,19,349 మెట్రిక్ టన్నుల వడ్లు కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 67వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఖరీదు చేశారు. వచ్చే రెండు వారాల్లో మిగిలిన ధాన్యాన్ని ఎలా కొంటారనే ప్రశ్న రైతులను వేధిస్తోంది. కొన్నిచోట్ల ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారు.

**కొనుగోలు కేంద్రాల్లోనే నిల్వలు..**

సేకరించిన ధాన్యాన్ని ఖమ్మం జిల్లాలో 70 మిల్లులకు, భద్రాద్రి జిల్లాలో 30 మిల్లులకు కేటాయించారు. ఓవైపు కొనుగోళ్లు నత్తనడకన సాగుతుంటే.. మరోవైపు కాంటాలు పూర్తయిన వడ్లనూ సకాలంలో ఎగుమతి చేయకపోవ



టంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి కాంటాలు పూర్తయితే ధాన్యంతో రైతులకు ఎలాంటి సంబంధం లేదని గతంలోనే అధికార యంత్రాంగం స్పష్టం చేసింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ధాన్యాన్ని అమ్ముకునేందుకు కేంద్రాల్లో వారాల తరబడి పడిగాపులు పడిన కర్షకులు.. ఆ వడ్లను మిల్లులకు తరలించే వరకు బాధ్యతలను రైతుల పైనే కేంద్రాల నిర్వాహకులు మోపుతున్నారు. కాంటాలు పూర్తయినా లారీలు సకాలంలో రాకపోవటంతో ధాన్యం ఎగుమతి, రవాణా నిలిచిపోతుంది. ఫలితంగా కాంటాలు పూర్తయిన తర్వాతా వేలాది క్వింటాళ్ల ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోతున్నాయి. ఉభయ జిల్లాలకు చెందిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి కొనుగోళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు. ఖమ్మం జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం. గన్నీసంచుల కొరత లేదు. లారీల సమస్యను అధిగమిం చాం. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన వెంటనే కేటాయించిన మిల్లులకు ధాన్యాన్ని తరలించేలా చూస్తున్నాం. ఈ సీజన్‌లో విధించిన లక్ష్యం మేరకు సకాలంలో వడ్లు సేకరిస్తాం. శ్రీలత, పౌరసరఫరాల సంస్థ మేనేజర్, ఖమ్మం

# కొనుగోళ్లు సాగవు.. తూకాలు పట్టవు



తాండూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అగచాట్లు తప్పడం లేదు. పంట పొలాల్లో నాలుగు నెలలు శ్రమిస్తుండగా విక్రయించేందుకు నాలుగు వారాలు నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంటోంది. తూకాలు వేయడం దగ్గర్నుంచి..లారీల్లో తరలించే దాకా ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు తప్పడంలేదు.

**క్వింటాలుకు రూ.150 నష్టం**

చెంగోల్, గోనూరు, బెల్కటూరు, డీసీఎమ్మెఎస్ కార్యాలయం వద్ద కొనుగోలు కేంద్రాల్ని ప్రారంభించారు. విక్రయించేందుకు రైతులు ధాన్యంను బాహ్య వలయ రహదారి వద్దకు తెచ్చి నిల్వ ఉంచారు. రెండు మూడు వారాలు గడిచినా కొనుగోలు వేగంగా సాగడం లేదు. కొనుగోలు కేంద్రానికి తెచ్చాక రెండు మూడు వారాలకు తూకాలు వేస్తున్నారు. తూకం వేశాక ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు లారీలు సకాలంలో రావడం లేదు. కొనుగోలులో జాప్యం చేస్తుండటంతో వీరారెడ్డిపల్లికి చెందిన రైతులు గత్యంతరంలేక ప్రైవేటు అడ్తి దుకాణదారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. దీంతో క్వింటాలుకు రూ.150 వరకు నష్టపోవాల్సి వస్తోంది. **తరుగు పేరిట టోకరా..:** ఒక్కో బస్తాకు 600 గ్రాముల ధాన్యం తరుగు తీయాల్సి ఉండగా కొనుగోలు కేంద్రాల్లో ఏకంగా 2 నుంచి 3 కిలోలు తరుగు తీస్తూ అన్నదాతల వద్ద దోపిడికి పాల్పడుతున్నారు.

**రోజుకు రెండు లారీలే వస్తున్నాయి**

ఈనెల 5 నుంచి తూకాలు వేస్తున్నాం. రోజుకు ఒకటిరెండు లారీలే వస్తున్నాయి. ఇప్పటిదాకా పది లారీల్లో ధాన్యం మిల్లుకు చేరవేశాం. రైతులకు 35వేల గన్నీ బ్యాగులు అందజేశాం. డెబ్భై శాతం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. - భాస్కర్‌చౌదరి, కొనుగోలు కేంద్రం బాధ్యుడు, చెంగోల్.

**మూడు రోజులుగా నిరీక్షిస్తున్నా..**

రెండు ఎకరాల్లో వరి సాగు చేయగా 104 బస్తాల ధాన్యంను కొనుగోలు కేంద్రం వద్దకు తెచ్చా. పది రోజులు దాటాక తూకం వేశారు. లారీలో తరలించే దాకా ఉండాలనడంతో మూడు రోజులుగా నిరీక్షిస్తున్నా. - రమేష్, చింతామణిపట్నం. **ఇరవై రోజులైంది: రాములు, చెంగోల్.** మూడెకరాల్లో పండిస్తే 120 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. విక్రయించేందుకు కొనుగోలు కేంద్రంకు తరలించి ఇరవై రోజులైంది. తూకం వేసినప్పటికి లారీ రానందున ఎనిమిది రోజులుగా ధాన్యం కుప్పల వద్ద కాపలా ఉంటున్నా.

# కొమ్ముల జింకలే లక్ష్యంగా వేట!



పూడూరు : దామగుండం రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు గత నెల 30న ఉదయం కొందరు భక్తులు ఆలయ సమీపంలోకి వెళ్లారు. అక్కడ శునకాల గుంపు ఓ జింకపై దాడిచేస్తుండగా జింక అరుపులతో గుర్తించిన వారు శునకాలను వెంబడించడంతో వదిలి పారిపోయాయి. అప్పటికే అది నడవలేని పరిస్థితిలో ఉంది. అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి వైద్యుడిని ఇక్కడికే రప్పించి చికిత్స అందించే ప్రయత్నం చేశారు. కొద్ది సేపటికే అది మృతిచెందింది. ఇటీవల కుక్కల దాడిలో కొమ్ములున్న మగ జింకలే ఎక్కువగా చిక్కడం గమనార్హం.”

ఇలాంటి సంఘటనలు జిల్లాలోని అడవి ప్రాంతాల్లో ఎక్కడో ఒక చోట చోటుచేసుకుంటూనే ఉన్నాయి.. పల్లెల్లోనూ అడవుల్లోనూ ఎక్కడ చూసినా శునకాలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా చేరి అడవి జంతువులపై పంజా విసురుతుండడంతో మృత్యువాత పడుతున్నాయి. అధికారులు తగిన చర్యలు చేపట్టక పోవటంతో వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోతోంది. అవి అడవి పందులు, కుందేళ్లు, నెమళ్లు కనిపించినా వదలటం లేదు. మృత్యువాత పడుతున్న జింకల్లో మగ జింకలే అధికంగా ఉన్నాయి. అవి కుక్కలకు దొరుకుతూ బలవుతున్నాయి. వాటికి కొమ్ములు ఉండటంతో తప్పించుకునే క్రమంలో పొదల కొమ్మలల్లో ఇరుక్కుని పరుగెత్తలేక చిక్కుతున్నాయి.

**నియంత్రణ కేంద్రం ఉన్నా..**

కుక్కల సంతానోత్పత్తిని నివారించటం కోసం వికారాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో అధికారులు నాలుగేళ్ల క్రితమే శివారెడ్డిపేట చెరువు పక్కన జంతు జనన నివారణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వాటి బెడద ఎక్కువగా ఉందో తెలుసుకుని పురపాలక సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో చేరుకుని పట్టుకోవాలి. ప్రత్యేక కేంద్రానికి తరలించాల్సి ఉంది. సంతానం కలగకుండా ఒక్కో రోజుకు మూడు నుంచి ఐదింటికి శస్త్ర చికిత్సలు చేయాలి. అక్కడే రెండు రోజుల పర్యవేక్షణ అనంతరం ఎక్కడి నుంచి పట్టుకొచ్చారో అక్కడే వదిలిపెట్టాల్సి ఉంటుంది. దీనికి అయ్యే ఖర్చు పూర్తిగా పురపాలక సంఘం ద్వారా చెల్లిస్తారు. ఆడ, మగజాతి ఏదైనా శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంది. కానీ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పల్లెల్లో గ్రామ సింహాల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతుంది. వాటికి తగిన ఆహారం లభించక అడవులు, పొలాల్లోనూ సంచరిస్తున్నాయి. అడవి జంతువుల వేట మొదలు పెట్టాయి.

**పట్టించుకోవటం లేదు..- అరుణ, ఫారెస్టు అధికారిణి వికారాబాద్**

అటవీ ప్రాంతాల్లో శునకాల సంచారాన్ని అరికట్టేందుకు వికారాబాద్ పురపాలక సంఘం వారికి ఫిర్యాదు చేశాం. ఒక్కసారి అనంతగిరి అడవిలో నుంచి కొన్నింటిని పట్టుకుని వెళ్లి శస్త్ర చికిత్సలు చేసి వదిలారు. నెలలు కావస్తున్నా.. మిగతా వాటిని పట్టుకోక పోవడంతో అడవి జంతువులపై దాడులు పెరిగాయి. ఎప్పటికప్పుడు గస్తీ తిరుగుతూ నివారణ కోసం చర్యలు చేపడుతున్నాం.

జిల్లాలో అటవి విస్తీర్ణం 1.8 లక్షల ఎకరాలు

జింకల సంఖ్య: 2,800

ఏడాదిలో మృత్యువాత పడుతున్నవి: 25 నుంచి 30

ఇప్పటి వరకు శునకాలను తరలించింది: 50

# బుంగలు పడి.. పూడిక నిండి..


మంథని : మంథని డివిజన్ పరిధిలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డి-83 కాలువలు అధ్వానంగా మారాయి. కొన్నేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో పిచ్చిమొక్కలు, తుమ్మ పొదలతో ఆనవాళ్లు కోల్పోయాయి. ఏటా బుంగలు పడి నీరంతా వృథాగా పోతుండటంతో చివరి ఆయకట్టుకు అందడం లేదు. ప్రస్తుతం మరమ్మతుల నిర్వహణకు అనుకూల సమయం. ఇప్పుడు పనులు ప్రారంభిస్తే వచ్చే వానాకాలం నాటికి పూర్తయి నీటి పారుదలకు ఇబ్బందులు తీరనున్నాయి. లేకుంటే చివరి ఆయకట్టులో సాగుకు కష్టాలు తప్పేలా లేవు.

**సాగుకు దూరంగా 2 వేల ఎకరాలు**

2 టీఎంసీల సామర్థ్యం కలిగిన గుండారం జలాశయం నుంచి కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాలకు ఎస్సారెస్పీ నీరు సరఫరా అవుతోంది. నాలుగు మండలాల్లో 25 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రధాన, పిల్ల కాలువల్లో చాలా చోట్ల ఆనవాళ్లు కనిపించడం లేదు. చివరి ఆయకట్టు ప్రాంతమైన మంథని మండలం ఖానాపూర్, గోపాల్‌పూర్, గుంజపడుగు, ఉప్పట్ల ప్రాంతాలకు నీరందక దాదాపు 2 వేల ఎకరాలు సాగుకు నోచుకోవడం లేదు. ఖానాపూర్ గ్రామానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలు తవ్వినప్పటి నుంచి 40 ఏళ్లుగా నీరు అందకపోవడం గమనార్హం. పేరుకు ఎస్సారెస్పీ కాలువలున్నా ఈ ప్రాంతంలోని చాలా మంది రైతులు బోర్లు తవ్వుకొని పంటలు సాగు చేసుకుంటున్నారు. ఎల్-6 కాలువ పరిధిలో మంథని మండలం నాగారం, కన్నాల, గుంజపడుగు, మంథని, ముత్తారం మండలంలో సర్వారం, మైదంబండ, పోతారం, హరిపురం, కమాన్‌పూర్ మండలంలో కమాన్‌పూర్ గుండారం, జూలపల్లి, రామగిరి మండలం బుధవారంపేట, బేగంపేట గ్రామాల్లో ఎస్సారెస్పీ కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది.

**రూ.1.82 కోట్లతో ప్రతిపాదనలు**

ఎస్సారెస్పీ కాలువల్లో పొదల తొలగింపు, బుంగల పూడ్చివేత,



పూడికతీత తదితర పనులు చేపట్టేందుకు రూ.1.82 కోట్లతో నిధుల మంజూరుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కాగా గుండారం జలాశయం మరమ్మతుకు రూ.13.8 లక్షలు, రామగిరి మండలం బుధవారంపేట కాలువ మరమ్మతుకు రూ.3.56 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి.

**నిధులు మంజూరైతే వేసవిలోగా పూర్తి చేస్తాం**

ఎస్సారెస్పీ కాలువల మరమ్మతు కోసం నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. మంజూరైతే వేసవి ముగిసేలోగా పనులు పూర్తి చేస్తాం. టెండర్లు ఖరారు కాగానే గుండారం జలాశయం, బుధవారంపేట కాలువల మరమ్మతు చేపడతాం. వానాకాలంలో సాగునీటికి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం. బలరామయ్య, నీటిపారుదల శాఖ ఈఈ

# భూభారతి.. దరఖాస్తుల పురోగతి

నేలకొండపల్లి :నేలకొండపల్లి మండలాన్ని భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ప్రకటించింది. రెవెన్యూ యంత్రాంగం, భూయజమానులు నూతన ఆర్ఓఆర్ చట్టం-2025 అమలు తీరుపై ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గతంలో లేని విధంగా చట్టంలో వివిధ మాడ్యూళ్లలో భూ సమస్యల పరిష్కారానికి నూతనంగా కొన్ని అవకాశాలు కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు. ఆరు మాడ్యూళ్లలో 33 ఐచ్ఛికాలను పొందుపరిచారు. వీటిపై అవగాహన కోసం గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. నేలకొండపల్లి మండలంలో ఏప్రిల్ 17 నుంచి 30 వరకు రెవెన్యూ సదస్సులు జరిగాయి.

**పరిశీలనకు ఏడు బృందాలు**

దరఖాస్తుల పరిశీలనకు ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి నాయబ్ తహసీల్దార్, గిర్దావర్, సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్‌లను కేటాయించారు. వీరు ప్రతి దరఖాస్తును రెండు విధాలుగా పరిశీలిస్తున్నారు. తొలుత రెవెన్యూ రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. తరువాత గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి భూమి భౌగోళిక హద్దుల్ని నమోదు చేస్తున్నారు. సంబంధిత వివరాలను దరఖాస్తుకు జోడించి తహసీల్దార్కు, ఆయన ద్వారా ఆర్డీఓకు నివేదించనున్నారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తును పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించి అనుమతులు రాగానే పరిష్కరిస్తామని, నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు.



**వేలల్లో దరఖాస్తులు...**

నేలకొండపల్లి మండల వ్యాప్తంగా 3,224 దరఖాస్తులు అందాయి. సాదాబైనామాతో భూమి హక్కుల కోసం 1,200 వచ్చాయి. పాసు పుస్తకాల్లో తప్పులు, పాత పాసుపుస్తకం నుంచి కొత్తదాంట్లో భూమి నమోదుకాలేదని, విస్తీర్ణం, భూమి స్వభావం, హక్కు రకం తదితర అంశాల్లో సమస్యలున్నాయని 700 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల హక్కుల నమోదుకు 94 అర్జీలు అందాయి. వీటిని రెవెన్యూ అధికారులు క్రోడీకరించి మాడ్యూళ్ల వారీగా విడదీశారు. దరఖాస్తుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో ప్రణాళిక రూపొందించారు.

**నేలకొండపల్లి భూ సమాచారం**

మండలం విస్తీర్ణం 186 చదరపు కి.మీ.

మొత్తం భూమి 45,474 ఎకరాలు

ఎండోమెంట్ 82.50

శిఖం: 1,349.02

అటవీ, వక్ఫ్..: 0

ప్రభుత్వ భూమి 3,546.30

రెవెన్యూ గ్రామాలు: 22

పంచాయతీలు: 32


# అక్రమార్కులపై ‘అనిశా’స్త్రం

సూర్యాపేట: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా వరుసగా అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు పట్టుబడుతున్నా ప్రభుత్వ ఉద్యోగుల తీరు మాత్రం మారడం లేదు. ప్రభుత్వం నుంచి వేతనం తీసుకుంటూనే బల్ల కింద చేయి పెట్టనిదే పనిచేయడం లేదు. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ శాఖల నుంచి ఎక్కువగా అనిశాకు పట్టుబడుతున్నారు. తాజాగా సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి, ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు ఒక నకిలీ వైద్యుడి నుంచి రూ.16 లక్షలు డిమాండ్ చేస్తూ పట్టుబడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

ఈ ఏడాది ఐదు నెలల్లోనే ఎనిమిది మంది ప్రభుత్వ ఉద్యోగులు పని కోసం లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు చిక్కారు. వీరిలో ఐదుగురు పోలీసు శాఖకు చెందిన వారు కావడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఎప్పుడూ లేనివిధంగా ఈ శాఖలో ఒక డీఎస్పీ, ఇక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైలు, ఒక కానిస్టేబుల్ ఏసీబీకి పట్టుబడటం ఆ శాఖకు మాయని మచ్చగా మారింది.

**దొరికేది కొందరే...**

పోలీసు, రెవెన్యూ శాఖతోపాటు ఇతర శాఖల్లోనూ కొంత మంది అవినీతి అధికారులు వేళ్లూనుకొని ఉన్నారు. డబ్బులివ్వలేక కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన బాధితులు అనిశాను ఆశ్రయించి వారి భరతం పడుతున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో నిత్యం చాలామంది ఎంతో కొంత ముట్టచెప్పి సానుకూల ధోరణిలో వెళుతున్నారు. ఇలా దొరకకుండా అవినీతి అధికారులు, సిబ్బంది తెర చాటునే ఉంటున్నారు. లంచం ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించే చైతన్యం ప్రజల్లో



మరింత పెరగాలి. అవినీతి ఉద్యోగులపై ఉక్కుపాదం మోపా చ్చు. ఆ మేరకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ఐదు నెలల్లో ఏసీబీకి చిక్కింది వీరే..

16.01.2025: నల్గొండ జిల్లా డిండి ఆర్ఐగా పనిచేస్తున్న నేనావత్ శ్యాంనాయక్ రైతు వద్ద నుంచి రూ.5 వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.

25.01.2025: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ఎస్సై సురేశ్, కానిస్టేబుల్ నాగరాజు ఇద్దరూ కలిసి ఓ వ్యక్తిని కేసు నుంచి తప్పిస్తానని రూ.లక్ష (రూ.70 వేలు నగదు, రూ.30 వేలు ఫోన్‌పే) తీసుకొని అనిశాకు చిక్కారు.

14.02.2025: నల్గొండ జిల్లా మర్రిగూడ రెవెన్యూ సర్వేయర్ (అవుట్ సోర్సింగ్ ఉద్యోగి) లావిడి రవి రైతు భూమి కొలిచేందుకు రూ.12 వేలు పుచ్చుకుంటూ పట్టుబడ్డాడు.

06.03.2025: చౌటుప్పల్ విద్యుత్తు శాఖ ఉద్యోగి రాజుల శ్యాంప్రసాద్ ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చేందుకు రైతు నుంచి రూ.70 వేలు తీసుకుంటూ అడ్డంగా దొరికాడు.

1 1.04.2025: సూర్యాపేట జిల్లా చింతలపాలెం ఎస్సై నర్రా అంతిరెడ్డి ఓ బాధితుడి నుంచి రూ.10 వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.

12.5.25: డీఎస్పీ పార్థసారథి, సీఐ వీర రాఘవులు రూ.16 లక్షలు డిమాండ్ చేస్తూ పట్టుబడ్డారు.

చురకలు




## పల్లె దారులకు పచ్చజెండా

సిరిసిల్ల: జిల్లాలో ఆర్అండ్బీ రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. మండల కేంద్రాలను జిల్లా కేంద్రంతో అనుసంధానించేలా హైబ్రిడ్ యాన్యూటీ మోడ్(హ్యామ్) విధానంలో 300 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. తొలిదశలో 136.2 కిలోమీటర్ల మేర రహదారులకు ఆమోదం లభించింది. ఈ దారుల్లో ట్రాఫిక్, ప్రస్తుత రహదారి పరిస్థితి సర్వే చేయనున్నారు. తర్వాత టెండర్ల ద్వారా 40-60 శాతం ఈపీసీ(ఇంజినీరింగ్ ప్రొక్యూర్మెంట్ కన్స్ట్రక్షన్), బిల్డ్ ఆపరేటర్, ట్రాన్స్ఫర్(బీవోటీ) పద్ధతిలో శాశ్వతంగా నిర్మిస్తారు.

**మంజూరైన రహదారులు ఇవే**

బోయినపల్లి మండలం శాభాష్పల్లి-నమిలికొండ(17.3 కిలో మీటర్లు)
తంగళ్లపల్లి మండలం జిల్లెల కూడలి నుంచి ఇల్లంతకుంట(16.0)
సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రహదారిలో మాచారెడ్డి నుంచి



ముస్తాబాద్(38.8) సిరిసిల్ల-ముస్తాబాద్ రహదారిలో నామాపూర్, వెంకటాపూర్, అవునూరు(12.4) వేములవాడ-కోరుట్ల(26). చందుర్తి-మోత్కురావుపేట(10.6) సిరిసిల్ల నుంచి కోనరావుపేట మండలం మరిమడ్ల రహదారి(4.6)
కోనరావుపేట మండలం బావుసాయిపేట-వెంకటాపూర్(3.3)
కోనరావుపేట మండలం వట్టిమల్ల-నిమ్మపల్లి(2.9)
వేములవాడ పట్టణం మూలవాగు నుంచి చింతల్ఠాణా ఆర్అండ్ఆర్ కాలనీ 4.3 కిలోమీటర్లు ఉన్నాయి.

అల్లుకున్న ఆహ్లాదంఏపుగా పెరిగిన చెటు.. తోరణాలను తలపించేలా అల్లుకున్న కొమ్మలు చూడటానికి ఎంతో బాగుంది కదూ. వేములవాడ, కోరుట్ల రహదారిలో చందుర్తి మండలం మల్యాల, లింగంపేట గ్రామాల మధ్య ఈ చెట్లు ఉన్నాయి. రహదారికి ఇరువైపులా ఉన్న ఈ చెట్లు వాహనదారులు, ప్రయాణికులకు నీడతోపాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

## ఉత్కంఠకు తెర

కరీంనగర్ : ప్రైవేటు కళాశాలలు ఎట్టకేలకు సమ్మె విరమించి పరీక్షలకు సహకరించటంతో శాతవాహన వర్సిటీ పరిధిలో బుధవారం నుంచి జరిగే డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు యథాతథంగా జరగనున్నాయి. మూడేళ్లుగా కళాశాలలకు రావాల్సిన ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్స్ పెండింగ్లో ఉన్నాయని.. విడుదల చేయాలని ప్రభుత్వం మీద ప్రైవేటు కళాశాలల యజమాన్యాలు ఒత్తిడి తెచ్చాయి. పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. పరీక్షలు రేపనగా సైతం విద్యార్థుల



ఫీజులు వర్సిటికీ చెల్లించలేదు. ఒక దశలో నిర్ణీత సమయానికి పరీక్షలు జరుగుతాయా అనే సందేహంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఓ వైపేమో వర్సిటీ అధికారులు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఫీజు చెల్లించాలని ఆదేశిస్తూ వచ్చారు. ఫీజు చెల్లించిన ప్రభుత్వ, కొన్ని ప్రైవేటు కళాశాలల విద్యార్థులకే పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. చర్చలతో కొలిక్కి..సీఎం రేవంత్రెడ్డితో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి చర్చలు జరిపారు. నాలుగు రోజుల్లో ఒకవిడత బకాయిలు విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చారని ప్రైవేటు యాజమాన్యాలతో చర్చించి నచ్చజెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వం విజ్ఞప్తితో వర్సిటీ పరిధిలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు మంగళవారం సాయంత్రం వరకు పరీక్ష ఫీజులు వర్సిటీకి చెల్లించాయి. దీంతో బుధవారం నుంచి జరిగే పరీక్షల ఉత్కంఠకు తెరపడినట్లయింది.

## పల్లెలపై పట్టింపేదీ?

జగిత్యాల : సర్పంచుల పదవీకాలం ముగియటం.. నిధుల లేమి.. అధికారులపై పని ఒత్తిడితో పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. పైగా జిల్లాలో డీపీవో, డీఎల్పీవో పోస్టులను భర్తీ చేయకపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. జగిత్యాల జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉండగా 9 లక్షలకుపైగా జనాభా ఉంది. గతేడాది ఫిబ్రవరిలో సర్పంచుల పదవీ కాలం ముగియగా.. ప్రత్యేక అధికారులను నియమించారు. నిధుల లేమి.. పని ఒత్తిడి కారణంగా ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. గ్రామాలపై కన్నెత్తి కూడా చూడటం లేదు. పంచాయతీ కార్యదర్శులతో పాలన కొనసాగుతోంది. గతేడాది ఆగస్టులో జగిత్యాల డీపీవోగా పనిచేసిన దేవరాజ్.. డీఎల్పీవోగా ఉన్న కనకదుర్గ, మెట్పల్లి డివిజన్ డీఎల్పీవో శ్రీనివాస్ బదిలీపై వెళ్లారు. కోరుట్ల డీఎల్పీవో శంకర్ ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి వీరి స్థానాల్లో ఎవరిని నియమించలేదు. ప్రస్తుతం ఏపీడీగా పనిచేస్తున్న మధన్మోహన్కు అదనంగా డీపీవో బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయనపై పనిభారం పెరిగింది. డీఎల్పీవోలుగా ఇన్ఛార్జులను నియమించారు. పంచాయతీ అధికారుల పోస్టుల్లో ఎవరిని ప్రభుత్వం నియమించకపోవటంతో పల్లెల్లో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

**నిధులు రాక.. అభివృద్ధి సాగక**

జిల్లాలో పంచాయతీలకు అందే నిధులు సుమారు 8 నెలలుగా రావటం లేదు. దీంతో ఎక్కడిక్కడ అభివృద్ధి పనులు నిలిచి పోయాయి. కొత్తగా ఏవైనా పనులు మొదలు పెట్టాలన్న అధికారులు ఆలోచిస్తున్నారు. గ్రామాల ఆదాయం అంతంత మాత్రమే కావటంతో పాలన పూర్తిగా కుంటు పడింది. చిన్న పంచాయతీల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఈ-పంచాయతీ ఆపరేటర్లు కూడా 5 నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. పల్లెలకు పంచాయతీ కార్యదర్శులు వెళ్లి పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర పనులు మాత్రమే పరిశీలిస్తున్నారు. మిగతా పనులు ఎవరూ పట్టించుకోవటం లేదు. కొన్ని గ్రామాల్లో మొక్కలకు నీళ్లు పట్టక ఎండిపోతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

## అష్టకష్టాల పన్ను.. ఆన్లైన్తో దన్ను




హైదరాబాద్: ఆస్తిపన్ను సంబంధిత సేవల కోసం ప్రజలు నేరుగా జీహెచ్ఎంసీకి దరఖాస్తు చేసుకోవచ్చు. బల్దియా వెబ్సైట్లో ఎనిమిది రకాల దరఖాస్తులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. దళారుల ప్రమేయం, లంచాలు, ప్రజల సమయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని.. డిజిటల్ దరఖాస్తు సేవలను సొంతంగా నిర్వహించాలని తాజాగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ రెవెన్యూ విభాగాన్ని ఆదేశించారు. సంబంధిత అధికారులు దరఖాస్తు విధానంపై కసరత్తు ప్రారంభించారు. ప్రక్రియను రెండు నెలల్లో ముగించి.. అందుబాటులోకి తెస్తామని జీహెచ్ఎంసీ ధీమా వ్యక్తం చేస్తోంది.

**ప్రస్తుతం 'మీ సేవా' ద్వారానే..**

గ్రేటర్ పరిధిలోని 72 మీసేవా కేంద్రాల్లో ఆస్తిపన్ను సంబంధిత సేవలకు దరఖాస్తులు తీసుకుంటున్నారు. పలు కేంద్రాల్లో మీసేవా సిబ్బంది, స్థానిక బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్స్పెక్టర్లు, దళారులు జట్టుగా ఏర్పడి.. దరఖాస్తుదారులను ఇబ్బంది పెడుతున్నారు. వాటిని దూరం చేయాలన్న లక్ష్యంతో జీహెచ్ఎంసీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని కమిషనర్ నిర్ణయించారు.ఎక్కడి నుంచైనా..: వెబ్సైట్లో దరఖాస్తు ప్రక్రియ అందుబాటులోకి వస్తే..ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్లైన్ చెల్లింపుల కోసం 8 బ్యాంకులు, వాటికి సంబంధించిన 537 బ్రాంచీలతో ఒప్పందం చేసుకున్నామని, నెట్ బ్యాంకింగ్, ఎన్ఈఎఫ్టీ, ఆర్టీజీఎస్, యూపీఐని ఉపయోగించి రుసుం చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు.

**జోరుగా కసరత్తు..**

మీసేవా కేంద్రాలు ప్రస్తుతం దరఖాస్తు రుసుము రూ.45 వసూలు చేస్తున్నాయి. దాన్ని కొనసాగించాలా, తగ్గించాలా, ఉచితంగా తీసుకోవాలా అనే విషయమై రెవెన్యూ విభాగం కసరత్తు చేస్తోంది. ఆన్లైన్ దరఖాస్తు ఎలా ఉండాలి? దరఖాస్తులను ఆమోదించే అధికారాన్ని ఎవరికి ఇవ్వాలనే విషయంపైనా అధికారులు జోరుగా చర్చిస్తున్నారు. పరిశీలన, ఆమోదానికి నిర్ణీత గడువు ఉంటుందని, ఆ లోపు పరిష్కారం కాకుంటే.. బాధ్యులైన అధికారులపై చర్యలు ఉండేట్టు జీహెచ్ఎంసీ నిబంధన పెట్టబోతోంది. వెబ్సైట్లోనేగాక.. ఆయా దరఖాస్తులను మై జీహెచ్ఎంసీ మొబైల్ యాప్లోనూ అందుబాటులోకి తీసుకొస్తామని, అరచేతి నుంచే ప్రజలు సేవలను పొందవచ్చని జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది.

ఏయే సేవలంటే..
- కొత్త భవనాలకు ఆస్తిపన్ను మదింపు
- మ్యుటేషన్జి
- పన్ను సవరణ (రివిజన్)
- యజమాని పేరు సవరణ
- ఇంటి నంబరు సవరణ
- వినియోగంలో లేని భవనానికి పన్నులో రాయితీ
- ఆస్తిపన్ను నుంచి మినహాయింపు
- బ్లాక్ చేసిన పీటీఐఎన్లను వినియోగంలోకి తేవడం

## ప్రతి అడుగూ.. ప్రగతి వైపే..



బొంరాస్పేట: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.10 వేల కోట్లకు పైగా విలువ చేసే పనులు మంజూరు చేశారు. వీటిలో ముఖ్యమైనవి కొడంగల్కు సాగు, తాగునీరు అందించే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, కొడంగల్లో వైద్య, పశువైద్య, నర్సింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు రహదారులు, పలు భవనాల నిర్మాణ పనులు కూడా ఉన్నాయి. కొన్నింటి పనులు చకచకా జరుగుతున్నాయి.

**'కడా' ఆధ్వర్యంలోనే అంతా..**నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన 'కడా' పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్తో పాటు సీఎం సోదరుడు నియోజకవర్గ ఇన్ఛార్జ్ తిరుపతి రెడ్డి తరచూ అభివృద్ధి పనులను సమీక్షిస్తున్నారు. అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తూ పనులు సకాలంలో పూర్తిచేసే విధంగా ఆదేశాలు జారీ చేస్తున్నారు.

**ఇవిగో ఉదాహరణలు..**నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల కోసం కావలసిన భూసేకరణ వేగవంతం. దీనికోసం రూ.2900 కోట్లు మంజూరు. కొడంగల్లో సమీకృత గురుకుల పాఠశాలకు రూ.250 కోట్లు కేటాయించారు. 25 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మించనున్నారు. నియోజకవర్గంలో వైద్య, నర్సింగ్, ఫిజియోథెరపీ, 220 పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.224.50 కోట్లు ఇచ్చారు. 220 పడకల ఆసుపత్రి నిర్మాణ దశలో ఉంది.

బొంరాస్పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలం హకీంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, హకీంపేటలో ఐటీఐ మంజూరయ్యాయి.

దుద్యాల మండల కేంద్రంలో మండల కార్యాలయాల భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

బొంరాస్పేటలో రూ.65 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టారు.పనులు సాగుతున్నాయి.

బొంరాస్పేట, కొడంగల్, దౌల్తాబాద్లలో గురుకుల పాఠశాలలకు రూ.75 కోట్లతో సొంత భవనాలు నిర్మిస్తున్నారు.

నాలుగు మండలాల్లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు మంజూరయ్యాయి. పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

నిధుల కేటాయింపులు ఇలా (రూ.కోట్లు)
ఎత్తిపోతలకు- 2900
వైద్య, పశువైద్య, నర్సింగ్ కళాశాలలకు- 224.50.
సమీకృత గురుకులం-250
రహదారులకు-రూ.500
విద్యా సంస్థలకు- రూ.500

## నిఘా డొల్ల.. సొత్తు గుల్ల

వీణవంక : ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం అనే మాట అక్షరాల సత్యం. రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలు, దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటే వాటితో సాధ్యమని గ్రామాల్లో పోలీసుల చొరవ, దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో మంచి ఫలితాలు వచ్చాయి. దొంగతనాలు తగ్గుముఖం పట్టాయి. అయితే వీణవంక మండలంలోని 20 గ్రామాల్లో వందకుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఏడాదిన్నర కాలంగా అవి పని చేయడంలేదు. ప్రస్తుతం పోలీస్ స్టేషన్ పరిసరాలలో తప్ప ఏ గ్రామంలో సీసీ కెమెరాలు పని చేయడంలేదు. దీంతో గ్రామాల్లో చోరీలు జరిగితే దొంగలను పట్టుకోలేకపోతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**దొరకని దొంగల ఆచూకీ..**

ఈ ఏడాది మార్చి 8న రాత్రి గన్ముకుల ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ గది నుంచి మూడు కంప్యూటర్లు చోరీకి గురయ్యాయి. ఈ చోరీ ఇంటి దొంగల పనే అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకు ఏడాదికాలంగా మండలంలో జరిగిన చోరీలలో ఏ ఒక్కరిని పట్టుకోకవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. మండలంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నామని.. ఎస్సై తిరుపతి తెలిపారు.

ఆరు నెలల క్రితం వీణవంక ఠాణాకు కూతవేటు దూరంలో ప్రధాన రహదారి పక్కన ఓ ఎలక్ట్రికల్ దుకాణం, ఓ మద్యం దుకాణంలో షట్టరు తాళాలు పగులగొట్టి సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. మొత్తం రూ.45 వేల విలువగల మద్యం సీసాలు, ఇతర సొమ్ము దొంగిలించారు.

## ప్రతిభకు మెరుగులు.. ఉపాధికి బాటలు

కరీంనగర్ : ఉపాధి.. ఉద్యోగాలకు బాసటగా నిలిచే వృత్తివిద్యా కోర్సులు నిరుద్యోగ యువతతోపాటు గృహిణులను కూడా ఆకర్షిస్తున్నాయి. డ్రాయింగ్, టైలరింగ్-ఎంబ్రాయిడరీ వంటి వాటిల్లో స్థిరపడేందుకు ఉపకరించే టెక్నికల్ టీచర్స్ కోర్సు (టీటీసీ)లను చేస్తున్నారు. కరీంనగర్లోని ధన్గర్వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మ్యూజిక్ టీటీసీ శిక్షణ తరగతులు వారిలో సృజనాత్మకతను పెంచుతున్నాయి. ఉమ్మడి జిల్లా వారితోపాటు సిద్దిపేట, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అభ్యర్థులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు.

**ఉద్యోగాలపై ఆసక్తితో..**

పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో పార్ట్టైం, ఫుల్టైం బోధకులుగా వృత్తి విద్యాకోర్సుల్లో టీసీసీ పూర్తి చేసిన వారు పనిచేస్తున్నారు. దీంతో వృత్తి



విద్యాకోర్సుల్లో శిక్షణకు ఆదరణ ఊపందుకుంది. సహజంగానే టైలరింగ్, ఎంబ్రాయిడరీ, డ్రాయింగ్లలో కొంత ప్రావీణ్యమున్న వారు సులభంగా ఇలాంటి ఉద్యోగాలను సాధించడమో, ఉపాధి పొందవచ్చన్న ధీమా యువతలోనే కాకుండా మహిళల్లో బాగా పెరిగింది. ఆయా అంశాల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్లను సాధించి టెక్నికల్ టీచర్స్ కోర్సులో శిక్షణ పొంది పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు వారు పోటీపడుతున్నారు. దీనికి కరీంనగర్లో నిర్వహిస్తున్న టీటీసీ శిక్షణ తరగతులు వారి ఆసక్తికి వేదికగా నిలుస్తోంది. టీటీసీ పరీక్షకు ముందు అభ్యర్థులు 42 రోజుల పాటు థియరీ, ప్రాక్టికల్స్లో విద్యాశాఖ అందించే శిక్షణ తరగతుల్లో వారు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

**శిక్షణలో 860 మంది అభ్యర్థులు**

డ్రాయింగ్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ, మ్యూజిక్లలో నిర్వహిస్తున్న టీటీసీ శిక్షణ తరగతుల్లో మొత్తం 860 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారు. ఈ నెల 1న ప్రారంభమైన తరగతులు వచ్చే నెల 11న ముగియనున్నాయి. కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల్లోని ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లతో నిత్యం అభ్యర్థులకు డ్రాయింగ్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ, మ్యూజిక్ అంశాల్లో మెలకువలతోపాటు పాఠశాల పరిపాలన, నిర్వహణ, బోధన పద్ధతులు, సైకాలజీ థియరీ క్లాసులు, ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతుల బోధనపై పట్టు పెంచుకుంటున్న అభ్యర్థులు ప్రాక్టికల్ తరగతుల ద్వారా ఆయా అంశాల్లో మరింత సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణకు 856 మంది అభ్యర్థులు పాల్గొంటుండగా, వారిలో అధిక సంఖ్యలో మహిళలు, యువతులే ఉండటం విశేషం. అల్లికలు, నిరుపయోగంగా పడేసే కాగితాలు, అట్టలు వంటి వాటితో అలంకరణ వస్తువులు, ఆకట్టుకునేలా గాజులు, మహిళలకు అందంగా నిలిచే ఎంబ్రాయిడరీ డిజైన్లు, వివిధ రకాల కుట్లు, దుస్తుల కుట్టు వంటివి టైలరింగ్-ఎంబ్రాయిడరీ అభ్యర్థులు, డ్రాయింగ్లో పలువురు అభ్యర్థులు అబ్బురపరిచే చిత్రాలతోపాటు రమణీయమైన డిజైన్లు వేయడంలో శిక్షణ పొందుతున్నారు.

అన్ని సదుపాయాలతో శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తూ వారి హాజరు, ప్రాక్టికల్స్ ఆధారంగా వారికి మార్కులను కేటాయించనున్నట్లు శిక్షణ కేంద్రం కోర్సు ఇన్ఛార్జి బొట్ల రామస్వామి తెలిపారు.

## సాధారణ కాన్పులు మెరుగు

పాల్వంచ : మారుమూల ప్రాంతాల్లోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు.. భద్రాచలం, చర్ల, అశ్వారావుపేట, మణుగూరు, బూర్గంపాడు, పాల్వంచ, ఇల్లెందులో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది.గతంలో ఆయాచోట్ల స్పెషలిస్ట్ వైద్యుల కొరత వేధించేది. ప్రభుత్వం ఆదేశాలతో సరైన వేతనాలు, ప్రోత్సాహకాలు కల్పించి స్పెషలిస్టులను మారుమూల వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఉన్నతాధికారులు నియమించారు. స్థానికంగా మెరుగైన ప్రసూతి వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. పిల్లల వైద్యులు, మత్తు, రేడియాలజిస్టులను నియమించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆపరేషన్ థియేటర్లు, ప్రసూతి వార్డుల్లో మౌలిక వసతులు కల్పించారు. 24 గంటల వైద్యసేవలతో పాటు ల్యాబ్ టెస్టులు, గర్భిణులకు ఏఎన్సీ, టిఫా స్కాన్లు అందుబాటులో తెచ్చారు. వేసవి నేపథ్యంలో ప్రసూతి వార్డుల్లో ఏసీలు, కూలర్ల ఏర్పాటు చేయించారు. ఫలితంగా కాన్పుల కోసం ఆసుపత్రులకు వచ్చే గర్భిణుల సంఖ్య పెరిగింది.

**జిల్లా వ్యాప్తంగా..**మణుగూరు సామాజిక ఆరోగ్య ఆసుపత్రిలో ఫిబ్రవరిలో



కేవలం ఎనిమిది ప్రసవాలు కాగా, ఏప్రిల్లో ఆ సంఖ్య 58కి పెరిగింది. జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరిలో 300గా ఉన్న ప్రసవాల సంఖ్య ఏప్రిల్లో 400కి చేరింది. భవిష్యత్తులో కాన్పులు పెంచుతామని వైద్య విధాన పరిషత్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల లో కోత లేకుండా సుఖప్రసవాలు చేసేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

ప్రైవేటుతో పోల్చిచూస్తే సిజేరియన్ సెక్షన్ల సంఖ్య ప్రభుత్వ దవాఖానాల్లో తక్కువగా నమోదవుతోంది. సాధారణంగా ప్రైవేటు దవాఖానాల్లో ఒక కాన్పునకు సుమారు రూ.30,000 నుంచి రూ.40,000 వరకు ఖర్చవుతుంది. కానీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు ఉచితం కావడంతో రద్దీ అధికమవుతోంది. వైద్య సిబ్బంది అంకితభావం, అధునాతన వైద్య సేవలు, మిడ్ వైఫరీ నర్సుల సహకారంతో సుఖ ప్రసవాల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. 'ప్రభుత్వ దవాఖానాల్లో కాన్పు చేయించుకుంటే స్కానింగ్, రక్త పరీక్షలు, సిజేరియన్, రూం తదితర ఖర్చుల భారం తగ్గుతుంది. వైద్య విధాన పరిషత్ దవాఖానాల్లో అందుతున్న మెరుగైన సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి. కొందరు ఆసుపత్రి సిబ్బంది సైతం తాము పనిచేస్తున్న ఆసుపత్రుల్లోనే సాధారణ కాన్పులు చేయించుకోవడానికి మొగ్గు చూపుతున్నారు.'డా.రవిబాబు, డీసీహెచ్ఎస్

చురకలు



# ఇంతి సైతం.. ఇంటి కోసం..!

భువనగిరి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మేముసైతం అని నిరూపించుకుంటున్నారు మహిళా కూలీలు. వీరికి అధికారుల ప్రోత్సాహం కూడా తోడైంది. జిల్లాలోని ఆయా మండలాల్లో చేపట్టిన భూ అభివృద్ధి పనులు, హరితహారం, మట్టి రహదారుల నిర్మాణం, చెరువుల పూడికతీత, ఫిష్‌పాండ్, మొక్కల పెంపకం, ఫీడర్ ఛానల్స్, ఫాంపండ్ తదితర పనుల్లో భాగస్వాములవుతున్నారు. ముఖ్యంగా ప్రత్యేక నైపుణ్యాలు అవసరం లేకపోవడం, పనివేళలు అనువుగా ఉండటం, స్థానికంగానే పనులు కల్పిస్తుండటంతో అతివలు ఆసక్తి చూపుతున్నారు. ఉపాధిహామీ పథకంలో పురుషులతో పోలిస్తే మహిళా కూలీలే రెట్టింపుగా పనులు చేస్తూ శ్రామిక రంగంలో



ముందంజలో ఉన్నారంటే అతిశయోక్తికాదు.

**మహిళలకు వరంగా..**

గ్రామీణులు వలస వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం 2005లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద మొదట పురుషులే పనులకు వెళ్లేవారు. క్రమేణా మహిళలూ 'ఉపాధిహామీ' పనులు చేయడం ప్రారంభించారు. పొదుపు కోసం ఏర్పాటు చేసిన మహిళా సంఘాల సభ్యులు గ్రూపులుగా చేరిన అనంతరం ఉపాధి పనులు చురుగ్గా చేస్తున్నారు. ఒకదశలో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, బిహార్ రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చి గంపగుత్తాగా వరినాట్లు ఇతర పనులు చేస్తున్న సంఘటనలూ ఉన్నాయి. ప్రతి ఏడాదిలో వందరోజుల పాటు ఉపాధి పొందుతున్న మహిళా కూలీలు ప్రభుత్వం చెల్లించే సొమ్మును సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉపాధిహామీ పథకం కింద అందుతున్న కూలీ డబ్బుతో కుటుంబ అవసరాలు తీరుతున్నాయని పలువురు మహిళా కూలీలు అంటున్నారు.

# విద్యుత్తు గోదాముల్లో నో స్టాక్..!

మిర్యాలగూడ : అద్దంకి బైపాస్ వెంబడి బహుళ అంతస్తు నిర్మిస్తున్న యజమాని నూతన విద్యుత్తు నియంత్రిక కోసం మూడు నెలల క్రితం డీడీ చెల్లించారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలోని గోదాములో విద్యుత్తు సామగ్రి కొరతతో నియంత్రిక అమర్చలేదు. దీంతో యాబై నివాసాల వారు ఇబ్బందులు పడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్తు అమర్చుకోవాలని రాయితీపై ఇస్తుండగా.. ఈ ప్లాంట్లకు త్రీఫేజ్ లైన్ అవసరం. కాగా నూతనంగా ఏర్పాటు చేసేందుకు విద్యుత్తు తీగలు కూడా స్టోర్‌లో అందుబాటులో లేని దుస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలోని విద్యుత్తు స్టోర్లలో తీవ్ర సామగ్రి కొరత నెలకొంది. నూతనంగా ఏర్పాటు చేస్తున్న కాలనీల్లో విద్యుత్తు మీటరు అమర్చేందుకు సామగ్రి అందించలేని పరిస్థితి దక్షిణ డిస్కం సంస్థలో ఉంది. వినియోగదారులు, అధికారులు, గుత్తేదార్లు, పరిశ్రమల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమలకు విద్యుత్తు నియంత్రికలు అవసరం అయితే ఇంజినీర్లు పరిశీలించి నివేదిక సిద్ధం చేస్తే, పరిశ్రమల వారు విద్యుత్తు శాఖకు డీడీలు



చెల్లిస్తారు. గతేడాది డీడీ చెల్లించిన పది రోజుల్లోపు మెటీరియల్ గుత్తేదార్లకు అందించే వారు ఈ ఏడాది మూడు నెలలు దాటుతున్నా సామగ్రి అందించలేని పరిస్థితి ఏర్పడింది.

**జిల్లాలో పరిస్థితి:**

జిల్లాలోని మిర్యాలగూడ, నల్గొండ, దేవరకొండ డివిజన్ల పరిధిలో 16 మంది ఏడీఈలు, 36 మంది ఏఈలు పనిచేస్తున్నారు. వీరి పరిధిలో అవసరమైన పనుల కోసం వందల సంఖ్యలో ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ కనీసం సామగ్రి అందించలేని పరిస్థితి నెలకొంది. వేసవిలో ఓవర్ లోడ్ కారణంగా తరచూ విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతుండగా.. అప్పటికప్పుడు అధికారులు ఉన్న సామగ్రితో తూతూ మంత్రంగా మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఉంది. రానున్న నెలరోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సామగ్రి పంపిణీ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ సమస్యపై విద్యుత్తు ఎస్ఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. సామగ్రి కొరత ఉన్నమాట వాస్తవమేనని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అత్యవసర పనులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# నోటరీతో బురిడీ!

హైదరాబాద్: జవహర్‌నగర్ భూముల్లో మరోసారి ఆక్రమణలు ఊపందుకున్నాయి. తాజాగా ఆక్రమణలను హెచ్ఎండీఏ అధికారులు తొలగించారు. కంచెను సైతం తొలగించి ఆక్రమణలు చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. సెక్యూరిటీ ప్రమేయంపై అనుమానాలు రావడంతో.. వారిని మరోచోటుకి మార్చారు. తక్కువ ధరకే 80, 100 గజాల స్థలాలు విక్రయిస్తామని పేదలు, మధ్యతరగతి వాళ్లకు అక్రమార్కులు ఆశ చూపుతున్నారు. ప్రాంతాన్నిబట్టి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. తొలుత భూమిని చదును చేసి షెడ్లు వేసి తప్పుడు ఇంటి నంబర్లను రాస్తున్నారు. జీహెచ్ఎంసీ నుంచి ఇంటి నంబరు వచ్చిందని నమ్మించి నోటరీ చేసి విక్రయిస్తున్నారు. అధికారులు కూలగొట్టే సమయంలో కోర్టు నుంచి స్టే తెచ్చుకుంటున్నారు. అలా 300 ఎకరాల్లో పక్కా ఇళ్లు వెలిశాయి. మరో 500-600 ఎకరాల్లో కోర్టు కేసులు నడుస్తున్నాయి. భూముల రక్షణకు హెచ్ఎండీఏ ప్రణాళిక వేసింది. కోర్టు కేసుల్లేని 12, 107 సర్వే నంబర్లలో 750 ఎకరాలకు ఇనుప కంచెకు రూ.7 కోట్లు వరకు వెచ్చించినా ఫలితం లేదు.

# రోజుకో రీతిగా.. బాలికలకు భరోసా..!



కొత్తగూడెం : సామాజికంగా వెనుకబడిన, ప్రతికూల నేపథ్యాల నుంచి వచ్చిన బాలికలకు మెరుగైన విద్య అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో(కేజీబీవీ) ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. కేజీబీవీలను బలోపేతం చేయనుంది. ప్రస్తుతం ఈ విద్యాలయాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం (ఈనెల 17)తో పరీక్షలు ముగియనున్నాయి. ఈనెల 24 నుంచి విద్యాలయాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈనేపథ్యంలో గురువారం నుంచి ఈనెల 23 వరకు విద్యార్థినులకు రోజుకో కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది. కార్యక్రమాల అమలుకు సంబంధిత ఉపాధ్యాయులు.. విద్యార్థినుల కోసం ప్రత్యేక సమయం కేటాయించనున్నారు. ఈమేరకు ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ అధికారులు దిశానిర్దేశం చేశారు.

**వారం పాటు కొనసాగింపు**

తొలిరోజు వారం రోజుల ప్రణాళికపై సమావేశం నిర్వహిస్తారు. రెండోరోజు విద్యార్థులకు నచ్చిన, ఇష్టమైన కథలు తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో రాయటం, చదవటం (స్టోరీ రైటింగ్, లిరిక్ రైటింగ్) వంటివి చేయిస్తారు. మూడోరోజు విద్యార్థులు తమను తాము పరిచయం చేసుకోవటంతో పాటు తల్లిదండ్రులను పరిచయం చేయటం (స్పోకెన్ ఇంగ్లిష్, పబ్లిక్ స్పీకింగ్) వంటి కార్యక్రమాలు చేపడతారు. నాలుగోరోజు విద్యార్థులు తమ ఆకాంక్షలను తల్లిదండ్రులకు చదివి వినిపించి.. అమ్మానాన్నల ఆకాంక్షల (డ్రీమ్ కార్నర్/ కెరీర్)ను తెలుసుకుంటారు. కేజీబీవీల్లో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారి విజయగాథలు, ఆత్మగౌరవ కార్యకలాపాల గురించి ఐదోరోజు ఉపాధ్యాయులు వివరిస్తారు. ఆరో రోజు జీవిత నైపుణ్యాల (లైఫ్ స్కిల్స్)పై అవగాహన కల్పిస్తారు. సురక్షితమైన బాధ్యతాయుతమైన ప్రవర్తన, బాల్యవివాహాలపై స్కిట్ రూపంలో అవగాహన కల్పిస్తారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తారు. చివరి రోజు తల్లితండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థినుల స్థితిగతులు వివరిస్తారు.

అడ్డంకులను అధిగమించి విద్యార్థినులు తమ కలలను సాకారం చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. రానున్న విద్యాసంవత్సరంలో ప్రవేశాలు భారీగా పెరగటానికి ఇవి దోహదపడతాయి. కేజీబీవీలు బాలికలకు భరోసా కల్పిస్తాయనే విశ్వాసాన్ని పెంపొందిస్తాం.

తులసి, జీసీడీఓ, ఖమ్మం

కేజీబీవీలు

ఖమ్మం 14

భద్రాద్రి 14

విద్యార్థినులు (6-9వ తరగతి)

ఖమ్మం 3,000

భద్రాద్రి 2,200

# కల్తీ 'టీ'తో చేటు.. క్యాన్సర్ 'కాటు'



హైదరాబాద్ : తిండి మానేస్తారేమోగానీ.. 'టీ' తాగకుండా రోజు గడవని వారు హైదరాబాద్‌లో అడుగడుగునా కనిపిస్తారు. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్ర పోయే వరకు తేనీటిని తాగుతుంటారు. చాయ్ ప్రియులారా.. కాస్త జాగ్రత్త పడాలంటూ జీహెచ్ఎంసీ ఇటీవల చేపట్టిన పరీక్షలు స్పష్టం చేస్తున్నాయి. సికింద్రాబాద్, చందానగర్, ఫతేనగర్, తదితర ప్రాంతాల్లో గుట్టలుగా స్వాధీనం చేసుకున్న నకిలీ టీ పొడిని నాచారంలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలలో పరీక్షించగా.. అందులో హానికర సింథటిక్ రంగులను ఉపయోగించినట్లు వెల్లడైంది. టీ పొడితోపాటు.. మంచి ఆరోగ్యం కోసం తినే ఎండు 'కివి' పండు ముక్కలు, బెల్లంలోనూ హానికర రంగును కలిపినట్లు పరీక్షల్లో తేలింది.

**సింథటిక్ కలర్స్ కలుపుతూ...**

రెండేళ్లుగా నగరంలో విస్తృతంగా తనిఖీలు జరుగుతున్నాయి. పోలీసులు, ఆహార భద్రతాధికారులు ఇప్పటి వరకు రెండు నుంచి మూడు టన్నుల నకిలీ టీ పొడిని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. అక్టోబరు, 2024లో ఫతేనగర్‌లో 300కేజీల కల్తీ టీ పొడి, 200 కేజీల కొబ్బరి చిప్పల పొడి స్వాధీ నం చేసుకున్నారు. జగన్నాథ్ కోణార్క్ టీ పౌడరు పేరుతో ప్యాకింగ్ చేసినట్లు అప్పట్లో అధికారులు వెల్లడించారు. డిసెంబరు, 2024లో చందానగర్‌లోని ఓ ఇంట్లో 150 కేజీల నకిలీ పొడిని పట్టుకున్నారు. అందులో కేజీ చొప్పున ఉన్న 130 ప్యాకెట్లు ఉండటం గమనార్హం. 500గ్రాముల ఇడకోల్ సన్‌సెట్ ఎల్లోకలర్, 500గ్రాముల నీల్ కియాన్ కలర్, 12 ఇలాచి వాసన వచ్చే ద్రవం సీసాలను అధికారులు స్వాధీనం చేసుకోగా. చందానగర్ సర్కిల్ ఆహార భద్రతాధికారి హృదయ ఆ నమూనాలను ప్రయోగశాలకు పంపారు. టీ పొడిలో హానికర రంగును కలిపినట్లు తేలింది. ఎల్బీనగర్‌లో ఈ ఏడాది మార్చిలో చేపట్టిన తనిఖీల్లోనూ నకిలీ పొడి పెద్దయెత్తున దొరికింది. అందులోనూ రంగు ఉన్నట్టు పరీక్షల్లో తేలింది. నామమాత్రపు పొడి..రంగుతో ఎక్కువ తేనీటిని తయారు చేసేందుకు సింథటిక్ రంగులను ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాంటి తేనీటితో క్యాన్సర్ వంటి ప్రమాదాకర వ్యాధులకు గురవుతారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎండు పండ్లలోనూ..**

2025 ఫిబ్రవరి 1న చందానగర్‌లోని ఓ సూపర్‌మార్కెట్లో లూజ్ డ్రైడ్ కివీ ముక్కలను స్వాధీనం చేసుకుని, ప్రయోగశాలకు పంపించగా, వాటిలో సింథటిక్ రంగును పెద్దయెత్తున ఉపయోగించినట్టు ప్రయోగశాల స్పష్టం చేసింది. ముదురు పసుపు రంగులోకి మారే ఎండు కివీ ముక్కలు, ఆకు పచ్చని రంగులో ముంచి, స్వల్పంగా వాటిపై చక్కెర ద్రవాన్ని పిచికారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.


**తింటే ఆస్పత్రికే..**

గతంతో పోలిస్తే చాలా మంది వ్యాపారులు ఆహార పదార్థాల తయారీలో రంగుల వినియోగాన్ని ఆపేశారు. తనిఖీలకు వెళ్లినప్పుడు.. వంట మనుషులు, హొటళ్ల యాజమాన్యాలకు రంగుల వాడకం వల్ల వినియోగదారులకు తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నట్టు ఎఫ్ఎస్ఓ హృదయ తెలిపారు. సింథటిక్ రంగులకు బదులు.. కశ్మీరీ మిరప పొడి ద్రవం, కుంకుమ పువ్వు ద్రవం, హల్దీ పొడిని ఉపయోగించాలని సూచిస్తున్నామన్నారు. సింథటిక్ రంగులతో చేసే ఆహారోత్పత్తులను తింటే.. దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరక తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# భళా.. తపాలా..!

సూర్యాపేట: తపాలాశాఖ పొదుపు ఖాతాలను తెరిచి తమ సేవలను బలోపేతం చేస్తోంది. ప్రైవేటు రంగానికి దీటుగా సేవలందిస్తూ ముందుకు సాగుతోంది. వివిధ పొదుపు ఖాతాలతోపాటు పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ బీమా సేవలతో ప్రజలకు మరింత చేరువుతోంది. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు ప్రజల్లో నమ్మకం పెంచుకొని గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శాఖకు కేటాయించిన లక్ష్యం చేరుకుంటోంది. ఏటా ఆర్థిక సంవత్సరంలో విధించిన లక్ష్యంపై దృష్టి సారించి శాఖ అభివృద్ధికి అధికారులు తోడ్పడుతున్నారు.

**ఇదీ పరిస్థితి..** జిల్లాలో ప్రధాన తపాలా కార్యాలయాలు 2, ఉప తపాలా కార్యాలయాలు 27, పోస్టాఫీసులు 319 ఉన్నాయి. వీటన్నింటిలో తపాలా శాఖకు సంబంధించిన వివిధ రకాల పొదుపు, బీమాకు సంబంధించి తపాలా శాఖకు 95,500 పొదుపు ఖాతాలు లక్ష్యం విధించగా ఇప్పటి వరకు 83,935 ఖాతాలు తెరిచారు. పీఎల్ఐ రూ.15.45 కోట్లు లక్ష్యం విధించగా రూ.15.64 కోట్లకు చేరుకున్నారు. అలాగే ఆర్‌పీఎల్ఐ 12.54 కోట్ల లక్ష్యంగా.. రూ.13.69 కోట్లు లక్ష్యం చేరుకోగా స్పీడ్‌పోస్టు రూ.44.87 లక్షల లక్ష్యం విధించగా రూ.50 లక్షలకు చేరుకున్నారు.





**మే 31 వరకు పునరుద్ధరించుకోవాలి..** వెంకటేశ్వర్లు, తపాలాశాఖ సూపరింటెండెంట్, సూర్యాపేటమే 31 వరకు పాలసీలు పునరుద్ధరణ చేసుకోవాలి. లేనిపక్షంలో వడ్డీ మినహాయింపు ఉండదు. పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ, పాలసీలు ఏడాదిపాట విషయమై గమనించి తమ పాలసీలు తిరిగి చెల్లించాలి.

# గడ్డకట్టని రక్తం.. ప్రమాదానికి సంకేతం

మిర్యాలగూడ :సాధారణంగా ఏదైనా గాయమైనప్పుడు రక్తం కారి..తర్వాత దానంతట అదే గడ్డ కట్టి కారడం ఆగిపోతుంది. అయితే చిన్న గాయమైనా సరే తీవ్ర రక్తస్రావం అయితే అది హిమోఫీలియా వ్యాధిగా అనుమానించి..తక్షణమే వైద్యులను సంప్రదించాలి. హిమోఫీలియాను రక్తస్రావ రుగ్మత, రక్తం గడ్డ కట్టని వ్యాధిగా పిలుస్తారు. ఇది జన్యుపరంగా వచ్చే అరుదైన వ్యాధి. ఈ వ్యాధి పట్ల ప్రజలో సరైన అవగాహన లేక అనేక మంది ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఏటా ఏప్రిల్ 17న 'ప్రపంచ హిమోఫీలియా దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

వ్యాధి రెండు రకాలు..

హిమోఫీలియా వ్యాధి ఏ, బీ రెండు రకాలుగా ఉంటుంది. ఏ సాధారణ వ్యాధి. ఇది ప్రోటీన్-8 లోపం వల్ల వస్తుంది. బీ వ్యాధి ప్రోటీన్-9 లోపం వల్ల సంభవిస్తుంది. ఇది అత్యంత అరుదు, ప్రమాదకరమైంది.

**లక్షణాలు ఇవీ..**

శస్త్ర చికిత్స సమయంలో అధిక రక్తస్రావం.

చిన్నగాయమైనా ఎక్కువ రక్తం కారడం.

శరీరంపై నీలి మచ్చలు.

మూత్రం, మలంలో రక్తం పడడం.


ముక్కు నుంచి రక్తం కారడం.

గుండె, మెదడు వంటి అంతర్గత అవయవాల్లో రక్తస్రావం.

చిగుళ్లలో రక్తస్రావం.

కీళ్లలో వాపు, నొప్పి.

జాగ్రత్తలే మార్గం..





హిమోఫీలియా వ్యాధికి శాశ్వత చికిత్స లేదు. తగు జాగ్రత్తలు పాటిస్తూ వ్యాధిని నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఈ వ్యాధి ఎక్కువగా పురుషుల్లోనే వస్తుందని నిపుణులు గుర్తించారు. సాధారణ వ్యక్తుల కంటే ఈ వ్యాధి సోకిన వారి జీవిత కాలం సుమారు 10 సంవత్సరాలు తగ్గుతుంది. దెబ్బలు తగిలినప్పుడు రక్తం ఆగకుండా కారడంతో ప్రాణానికే ముప్పు వాటిల్లవచ్చు. ఈ వ్యాధి ఉన్న వారు ఫుట్‌బాల్, రెజ్లింగ్ వంటి క్రీడలకే దూరంగా ఉండడంతో పాటు కొన్ని రకాల నొప్పి నివారణ మాత్రలు వాడకూడదు. కుటుంబంలో ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే తప్పనిసరిగా కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకోవాలి. మరోవైపు వ్యాధి ఉన్న వారు నడక, సైక్లింగ్, ఈత కొట్టడం వల్ల కొన్ని ఉపయోగాలు ఉంటాయి.

లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి

డాక్టర్ నగేశ్, పీఎం జన్‌మన్ ప్రోగాం అధికారి, నల్గొండ.

చిన్న గాయానికి కూడా తీవ్రంగా రక్తం కారే లక్షణాలుంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. రక్త పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. హిమోఫీలియాలో ఏ రకానికి చెందిన వారో గుర్తించి చికిత్స మొదలుపెడతారు. ఇది జన్యుపరంగా వచ్చే అరుదైన వ్యాధి. సుమారు 20వేల మందిలో ఒకరికి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో వారికి ఈ వ్యాధి పట్ల అవగాహన లేక చికిత్సకు ముందుకు రావడం లేదు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా ఇలాంటి వ్యాధి బాధితులను గుర్తించి తగిన చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

# ఇళ్ల నిర్మాణాలు.. ఇనుప కంచెలు

మోతె : తహసీల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో రూ.2 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ఇళ్ల స్థలాల భూమిని దొరికిన వాళ్లు దొరికినంత ఆక్రమించుకుంటున్నారు. మండలకేంద్రంలోని సర్వే సంఖ్య-238లో 5.21 ఎకరాలను దశాబ్దాల క్రితం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ తర్వాత ఏళ్ల క్రితం కొందరు పేదలకు పట్టాలు పంపిణీ చేసింది. ఏళ్లు గడుస్తున్నా ఎవరూ ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం ఈ భూమి సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారికి అనుకుని ఉండటంతో విలువ అమాంతం పెరిగింది. ఇంకేం అందరి కన్ను ఖాళీ స్థలాలపై పడింది. ఆక్రమిత స్థలాల్లో ఆక్రమణదారులు కొందరు ఏకంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. మరికొందరు గడ్డివాములు, పెంటదిబ్బలు వేస్తున్నారు. కొందరైతే ఇనుప కంచెతో హద్దులు ఏర్పాటు చేసి అట్టి పెట్టుకున్నారు. ఆక్రమిత ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఉప తహసీల్దార్ లావణ్యను వివరణ కోరగా.. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు, ఇళ్ల నిర్మాణంపై



క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఈ భూమిలో గత ప్రభుత్వం 64 రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి పంచింది. ఈ సముదాయంలో ఇంకా ఎకరాకు పైగా ఖాళీ స్థలం ఉంది. ఈ ఖాళీ జాగాను స్థానికులు ఇష్టారీతిన ఆక్రమించారు. ఈ అక్రమ తతంగం అంతా తహసీల్ కార్యాలయం పక్కనే జరుగుతోంది. అయినా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు అరెకరం విస్తీర్ణానికి పైగా స్థలం ఆక్రమణకు గురైంది. ఇక్కడ బహిరంగ మార్కెట్లచి గజం రూ.10వేలు ధర పలుకుతోంది. ఈ ధరలతో పోలిస్తే ఆక్రమిత భూమి విలువ తక్కువలో తక్కువ రూ.2 కోట్లు దాటుతుందని స్థానికులే చెబుతున్నారు.

# సైబర్ ఉచ్చు.. జీవితాల్లో చిచ్చు

కర్నూలు : వృద్ధులను, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతుండటంతో చాలా కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. ఇటువంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. బ్యాంకు ఖాతాల్లో ఎక్కువ నిల్వలు ఉంచుకున్న, సెల్‌ఫోన్ వినియోగించే విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను తొలుత నేరగాళ్లు గుర్తిస్తున్నారు. వారితో మాటలు కలిపి వారి ఖాతాల నుంచి డబ్బుల్ని దోచేస్తున్నారు. సైబర్ నేరాలపై అవగాహనలేని వారిని గుర్తించి ఆశపెడుతున్నారు. దారిలోకి రాకపోతే భయపెట్టి డబ్బుల్ని దోచేస్తున్నారు. ప్రశాంత జీవితం గడపాల్సిన సమయంలో వృద్ధులు సైబర్‌నేరగాళ్ల ఉచ్చులో పడి మానసిక కల్లోలానికి గురవుతున్నారు.

**జిల్లాలో జరిగిన సంఘటనలు ఇవీ..**

కర్నూలు వెంకటరమణకాలనీకి చెందిన 80 ఏళ్ల విశ్రాంత పంచాయతీ రాజ్‌శాఖ ఇంజినీరు ఎం.సుధీందర్‌రావును ఓ ప్రైవేట్ గ్రూపులో చేరమని ఆయన చరవాణికి సందేశాన్ని పంపించారు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో లాభాలు పొందొచ్చని, కొంత డబ్బు చెల్లించాలనడంతో ఆయన రూ.2 లక్షలను వారు సూచించిన ఖాతాకు పంపించారు. తర్వాత ఆ గ్రూప్ నుంచి ఓ మహిళ ఫోన్‌చేసి 'బీఆర్ బ్లాక్స్ మాక్స్' అనే ట్రేడింగ్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోమని చెప్పడంతో ఆయన అలా చేశారు. తర్వాత వారు సూచించిన ఖాతాలకు రూ.54,44,430 పంపించారు. చివరికి మోసపోయినట్లు గుర్తించారు.

కర్నూలులోని పెద్దమార్కెట్‌కాలనీకి చెందిన ఓ మహిళ న్యాయశాఖలో పనిచేసి 2017లో ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ చేయడంతో వచ్చిన డబ్బును బ్యాంకులో ఫిక్స్‌డ్ చేసుకున్నారు. ఒంటరిగా జీవిస్తున్న ఆమెకు సైబర్ నేరగాడు ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని, క్రెడిట్‌కార్డు తీసుకోమని అడిగాడు. తాను ఉద్యోగవిరమణ చేయగా వచ్చిన డబ్బును ఫిక్స్‌డ్ చేశానని, తనకు క్రెడిట్‌కార్డు అక్కరలేదని ఆమె చెప్పారు. తర్వాత కొన్ని రోజులకు సైబర్‌నేరగాడు ఫోన్ చేసి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎస్పైని మాట్లాడుతున్నానని, అక్రమ డబ్బు, నకిలీ నోట్ల కేసుల్లో అరెస్టు వారెంట్



మీపైన జారీ అయ్యిందని బెదిరించారు. భయపడిన ఆమె అతడు చెప్పిన ఖాతాకు తొలుత రూ.45 లక్షలు, మరోసారి రూ.8.50 లక్షలు పంపించారు. మొత్తంగా సైబర్‌నేరగాళ్లు ఆమెను భయపెట్టి రూ.53.50 లక్షలు కాజేశారు.

**ఆ ఖాతాలపైనే కన్ను**

విశ్రాంత ప్రభుత్వ అధికారులకు ఉద్యోగ విరమణ సమయంలో వచ్చిన ప్రయోజనాలను ఖాతాల్లో జమ చేసి కాలం వెళ్లదీస్తుంటారని సైబర్ నేరగాళ్లు గుర్తిస్తున్నారు. ఖాతాల్లో నిల్వ ఉంచుకున్న డబ్బుకు తోడు ప్రతి నెలా పింఛను జమ అవుతూ ఉంటోంది. శాఖలు, హోదాలను బట్టి వారు ఖాతాల్లో ఎంత మేర డబ్బు ఉంటుందో సైబర్‌నేరగాళ్లు అంచనా వేస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులు సెల్‌ఫోన్ వినియోగిస్తుండటం సైబర్‌నేరగాళ్లకు అవకాశంగా మారుతోంది. అధికలాభాలు వస్తాయని నమ్మించి పెట్టుబడి పెట్టించటం, అక్రమాస్తులు కలిగిఉన్నారని బెదిరించి వివిధ మార్గాల్లో డబ్బును దోచేస్తున్నారు. మోసపోయిన బాధితులు చాలామంది కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక..పోలీసులకు ఫిర్యాదు చేయలేక కుమిలిపోతున్నారు.

**సమాచారం ఎలా సేకరిస్తున్నారు..**

సైబర్‌నేరగాళ్లు పలు మార్గాల్లో విశ్రాంత అధికారులు, ఉద్యోగుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. తెలిసిన బ్యాంకు ఉద్యోగులు, పనిచేసి మానుకున్న వారి నుంచి వివరాలు తెలుసుకుంటున్నారు. కొందరు సైబర్‌నేరగాళ్లు ఫోన్ చేసి మాయమాటలు చెప్పి ఏదో ఒక సర్వే పేరు చెప్పి వివరాలు అడుగుతున్నారు. ఈక్రమంలో విశ్రాంత అధికారులు, ఉద్యోగుల సమాచారం సేకరిస్తున్నారు. పనిచేసిన శాఖలు, హోదాలను బట్టి వారి ఖాతాల్లో ఉండే డబ్బు అంచనా వేసుకుని వారి సెల్‌ఫోన్ నంబర్లు తెలుసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పగానే ఫించను తీసుకునే వృద్ధులు నమ్మి అన్ని వివరాలు చెప్పేస్తున్నారు.

**పోలీసుల సూచన**

విశ్రాంత ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు సైబర్‌నేరాలపై అవగాహన పెంచుకోవాలని పోలీసుఅధికారులు సూచిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు పంపిన లింకులు, చేసిన ఫోన్‌కాల్స్‌ను నమొద్దంటున్నారు. అలాంటి సమాచారం, ఫోన్‌కాల్స్‌ను తొందరపడి నమ్మకుండా మొదట నిర్ధారించుకోవాలన్నారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లయితే వెంటనే 1930 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలంటున్నారు.

# అతివల 'ఉన్నతి'కి లేదు వడ్డీ

ఒంగోలు : స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయం ఉపాధితో రాణించా లన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే మహిళల జీవనోపాధుల కింద బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు.. రాయితీలు అందజేస్తోంది. ఆయా సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు చేయూతనందించేలా 'ఉన్నతి' కార్యక్రమం కింద వడ్డీ లేని రుణాలు అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే అమలవుతున్న ఈ పథకాన్ని గత ప్రభుత్వ హయాంలో రుణాల మంజూరుకు సంబంధించి నెలల తరబడి జాప్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాన్ని గాడిలో పెట్టింది. గతంలో యూనిట్ లేకున్నా సొంత అవసరాలకు వినియోగించుకునేవారు. ఇప్పుడు ఉపాధి యూనిట్ల ఏర్పాటు తప్పనిసరి చేశారు. 1,611 మంది మహిళలు.. గరిష్ఠంగా రూ.3 లక్షలు: 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉన్నతి పథకం కింద జిల్లాలోని 1,611 మంది మహిళలకు రుణం అందించేలా ప్రణాళిక చేశారు. ఏర్పాటు చేసే యూనిట్ ఆధారంగా ఒక్కో మహిళకు రూ.50 వేలు నుంచి రూ.3 లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నారు. రుణం మొత్తానికి అనుగుణంగా నెలవారీ చెల్లింపునకు సంబంధించి కాల పరిమితి నిర్ణయిస్తారు. రూ.50 వేల రుణానికైతే 24 నెలలుబీ రూ.2 లేదా రూ.3 లక్షలు అయితే 48 నెలలపాటు వాయిదాలు చెల్లించేలా గడువు విధించనున్నారు. వడ్డీ లేని రుణాలు కావడంతో నిర్దిష్ట గడువులోపు చెల్లించాలి. లేకపోతే అపరాధ రుసుము విధిస్తారు. మహిళలు ఏదైనా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలై ఉండాలి. గ్రామ సంఘాల్లో తీర్మానం చేసి సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. సభ్యులు ఎంపిక చేసుకున్న యూనిట్ ఆధారంగా రుణం మంజూరుకు లబ్ధిదారులను డీఆర్డీఏ అధికారులు ఎంపిక చేస్తారు.

# సౌర.. ఔరా అనిపించలేరా?



తిరుపతి : క్షేత్రస్థాయిలో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. ముందుగానే వినియోగదారులు డబ్బు చెల్లించేందుకు నిరాసక్తత వ్యక్తం చేయడం.. అధికారులు అంతగా అవగాహన కల్పించనందున పౌరులు తమ గృహాలపై సౌర ఫలకాలు అమర్చేందుకు ముందుకు రావడం లేదు. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను అధికారులు నివృత్తి చేస్తేనే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం నెరవేరుతుంది. గతేడాది ఫిబ్రవరి 13న కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించింది. ఇంటి పై కప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకుంటే కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు రాయితీ వస్తుందని ప్రకటించారు. వినియోగదారులు ముందుగా జాతీయ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విద్యుత్తు బిల్లు, బ్యాంకు ఖాతా, చిరునామా తదితర వివరాలు నమోదు చేసి నిర్ణీత ఫీజు చెల్లించి డిస్కంకు దరఖాస్తు ఇవ్వాలి. ఎం- ప్యానల్ చేసుకున్న కంపెనీల నుంచి ఎంచుకున్న కిలోవాట్ల సామర్థ్యానికి అనుగుణంగా డబ్బులు కట్టాలి. ప్రాజెక్టు ఏర్పాటయ్యాక ఫొటోలు అప్‌లోడ్ చేస్తే డిస్కం అధికారులు పరిశీలించి స్మార్ట్‌మీటర్ బిగిస్తారు. ఇది పూర్తయిన 15 రోజుల్లో కేంద్రం నుంచి వచ్చే రాయితీ సొమ్ము వినియోగదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. **చిత్తూరు జిల్లాలో కేవలం 268..**

చిత్తూరు జిల్లాలో ఇప్పటివరకు 49,947 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలు 47,500 మంది ఉన్నారు. ప్రస్తుతానికి కేవలం 268 గృహాలపైనే సౌర ఫలకాలు ఏర్పాటయ్యాయి. ఇందులో ముఖ్యమంత్రి చంద్రబాబు పైలట్ గ్రామంగా ప్రారంభించిన కుప్పం మండలం నడిమూరులోనే 95 ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 6న కుప్పంలో ఈ ప్రాజెక్టు మొదలుకాగా వేగవంతంగా పరికరాలు అమరుస్తారని భావించినప్పటికీ నెమ్మదిగా పనులు జరుగుతున్నాయి.

**ఎస్సీ, ఎస్టీల దరఖాస్తులు కలిపితేనే..**

తిరుపతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలతో కలుపుకొని 63,534 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో సుమారు 60వేలు ఎస్సీ, ఎస్టీలవే. ప్రస్తుతం వీరికి సౌర ఫలకాలు అమర్చేందుకు అయ్యే వ్యయం మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీగా ఇవ్వనుండటంతో ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందాయి. త్వరలోనే వీటికి టెండర్లు పిలిచి పై కప్పులపై పరికరాలు ఏర్పాటు చేస్తారు. ముందుగానే నగదు చెల్లించాలనే నిబంధన కారణంగా మిగతా వర్గాలు పెద్దగా ముందుకు రావడంలేదు. దీనికి తోడు రాయితీల గురించి అంతగా అవగాహన లేదు. ఎస్పీడీసీఎల్, నెడ్‌క్యాప్ అధికారులు దీనిపై ఆయా వర్గాల అనుమానాలు నివృత్తి చేయాలి.

**నారావారిపల్లిలో భేష్**

సీఎం చంద్రబాబు స్వగ్రామం చంద్రగిరి మండలం నారావారిపల్లి క్లస్టర్‌లో మాత్రం పురోగతి బాగుంది. ఇక్కడ 2,300 గృహాలున్నాయి. రూఫ్‌టాప్ లేనివి, ఒకరికే రెండు- మూడు కనెక్షన్లు ఉన్నవి మినహాయిస్తే 1,600 ఇళ్లున్నాయి. వీటన్నింటిపై సౌర ఫలకాలు అమర్చారు. తిరుపతి జిల్లాలో 2,094 ఇళ్లపై పరికరాలు అమర్చగా ఇందులో సింహభాగం నారావారిపల్లిలోనే ఉండటం గమనార్హం.

# పాత కుంట.. పాపపు పంట



కుప్పం : మా ప్రభుత్వం వచ్చింది.. మాకు ఏదైనా ఉపాధి చూపండి సారూ.. అని అడిగితే సీఎం నియోజకవర్గం. ఇక్కడ ఏ చిన్న తప్పూ చేయలేమని ఉపాధి సిబ్బంది నుంచి ఎదురవుతున్న సమాధానం. బయటకు నీతులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో చాపకింద నీరులా అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. కొద్ది రోజుల కిందట అటవీ శాఖ అధికారులు నిధులు దోచేశారు. తాజాగా ఓ చెరువులోని చేపల కుంటలనే మళ్లీ తవ్వినట్లు చూపుతూ నిధులు గోల్‌మాల్ చేశారు. ఉపాధి పథకంలో తవ్వే కొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. కూలీల పేరుతో స్వాహా: చెరువులో గతంలో తవ్విన చేపల కుంటలనే మళ్లీ తవ్వేలా 2025-26లో పనులు మంజూరు చేయించారు. ఫలితంగా పాత కుంటకు కొత్త మెరుగులు దిద్ది కూలీల పేరుతో బిల్లులు స్వాహాకు బరి తెగించారు. ఇంత జరుగుతున్నా క్షేత్రస్థాయిలో పనులన్నీ పారదర్శకమేనని అధికారులు బుకాయిస్తున్నారు.

**ఆ చెరువులో ఆరు చేపల కుంటలు:** కుప్పం మండలం వసనాడు చెరువులో 2019-20, 2022-23లో రెండు చేపల కుంటల పనులు పూర్తయినట్లు ఉపాధి హామీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మళ్లీ 2023-24, 2024-25కు గాను రెండింటిని మంజూరు చేశారు. తాజాగా 2025-26 సంబంధించి రెండు చేపల కుంటలు మంజూరు చేశారు. ఇందులో వర్కు ఐడీ ఎఫ్ఆర్ 999900317927 8కు సంబంధించి పనులు జరుగుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. మే 3న రికార్డులు పరిశీలించగా మస్టర్ సంఖ్యలు 1394, 1395, 1396లో 20 మంది కూలీలకు హాజరు వేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పాత కుంటకే మెరుగులు దిద్దుతున్నట్లు కనిపిస్తోంది.

**ఇక్కడ కొత్తేమీ కాదు:** కుప్పం మండలం నడుమూరు నర్సరీలో 20 వేల బ్యాగులకు మట్టిని నింపే పనులను ఏడుగురు మహిళలు, ముగ్గురు పురుషులు హాజరైనట్లు ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేశారు. ఆ చిత్రం పరిశీలిస్తే మహిళలు కనిపించరు. తీరా వారంతా ప్రతినెలా అటవీశాఖ నుంచి రూ.10 వేల చొప్పున జీతం అందుకుంటున్న వాచర్ల అని తెలిసింది.

**తనిఖీ బాధ్యత ఏపీవోదే.. - విజయదత్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, కుప్పం**

పనులన్నీ తనిఖీ చేయడం వీలుకాదు. ఆ బాధ్యత చూసుకోవాల్సింది ఏపీవోదే. అక్రమాలు జరిగితే చర్యలకు సిఫార్సులు చేస్తాం.

**పరిశీలించి చర్యలు- వెంకటరత్నం, ఏపీడీ, కుప్పం**

ఉపాధి పనులకు కూలీలు రావడంలేదు. ఒకటి, రెండు చోట్ల ఇలాంటి తప్పులు జరిగిఉండొచ్చేమో. నేను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటా.

# ఎంఎస్ఎంఈలు.. ఉపాధి నిలయాలు

పలమనేరు : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎస్ఈ) స్థాపనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఈ తరహా పారిశ్రామికవాడలు ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ వెంటనే ఏపీఐఐసీ అధికారులు రంగంలోకి దిగారు. అనువైన స్థలాలు ఎంపిక చేస్తున్నారు. ఇప్పటికే పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో పార్కులు ప్రారంభించగా.. చిత్తూరు, పుంగనూరు, జీడీ నెల్లూరు, పూతలపట్టు, నగరి నియోజకవర్గాల్లో స్థల సేకరణ దశలో ఉంది.

త్రిరాష్ట్ర కూడలి అనుకూలం: తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దు నియోజకవర్గాలైన కుప్పం, పలమనేరులో మొదట ఈ పార్కులు ప్రారంభించారు. సీఎం చెప్పిన వారంలోగా స్థలాలు గుర్తించి ఖరారు చేశారు. బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పనులు వేగంగా సాగుతున్నాయి. మరో వైపు రెండు విమానాశ్రయాలు, పోర్టు అందుబాటులో ఉంటాయి. అదే సమయంలో పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు సులభంగా అనుమతులు మంజూరు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు చోట్లకు పరిశ్రమలు తరలివస్తాయని అధికారులు చెబుతున్నారు. గుడుపల్లె మండలంలో 38.78 ఎకరాల్లో: మొదటగా కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం పొగురుపల్లి వద్ద 38.78 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇక్కడ దాదాపు 250 వరకు సంస్థలు ఏర్పాటు చేసేలా ప్లాట్లుగా మార్చుతున్నారు. ఒక్కొక్కటి 300 చదరపు మీటర్లలో ఉంటుంది. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా.. అనుమతులు ఇస్తున్నారు. దీనికోసం ప్లగ్ అండ్ ప్లే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ నూతన విధానంలో విద్యుత్తు, రహదారులు, నీరు తదితర మౌలిక వసతులు ప్రభుత్వమే కల్పిస్తుంది.




పారిశ్రామికవేత్తలు రావడం.. వెంటనే ఉత్పత్తి ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. టెక్స్‌టైల్, ఫ్లోర్‌మిల్ వంటివి ఇక్కడ రాగానే వెంటనే మొదలు పెట్టుకుంటారు.

పలమనేరులో రూ.15.27 కోట్లతో: ఈ నెల 8న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నాగమంగళం వద్ద 3.85 ఎకరాల స్థలంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. రూ.15.27 కోట్లతో ఏపీఐఐసీ మౌలిక వసతులు కల్పించనుంది. 2018లో తెదేపా హయాంలో మంత్రిగా అమరనాథరెడ్డి.. ఇక్కడ పారిశ్రామికవాడ ఏర్పాటు చేశారు. దాదాపు 250 ప్లాట్లను పరిశ్రమలకు కేటాయించారు. ఇప్పటికే పదుల సంఖ్యలో పరిశ్రమలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 2028 నాటికి అన్ని చోట్ల ప్రారంభించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి- సుబ్బారావు, ఏపీఐఐసీ జెడ్ఎం

జిల్లాలో పరిశ్రమలు స్థాపించాలనుకునే ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మౌలిక వసతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేస్తాం.

# వసతికి గ్రహణం

నంద్యాల : సాంఘిక సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు గ్రహణం పట్టింది. వేసవి సెలవుల్లో పనులు పూర్తిచేసి సౌకర్యాలు మెరుగుపరుస్తారని ఆశించిన విద్యార్థులకు నిరాశే మిగులుతోంది. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల నిర్వహణకు నిధులివ్వలేదు. దీంతో హాస్టళ్లు సమస్యల నిలయాలుగా మారాయి. విద్యార్థులు పడుతున్న అవస్థలు గుర్తించిన కూటమి ప్రభుత్వం వీటి మరమ్మతులకు నిధులు కేటాయించింది. మార్చిలో ప్రారంభమయ్యాయి. నిధులివ్వకపోవడంతో గుత్తేదారులు అర్ధంతరంగా ఆపేశారు. కేటాయింపులు గత ఆర్థిక సంవత్సరం పద్దుల్లో చేర్చకపోవడమే ఈ సమస్యకు కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం 2025- 26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నుంచి కేటాయింపులు సమాలోచనలు జరుగుతున్నాయి.

**చేసినవి నాసిరకమే**

వసతిగృహాల్లో ఇప్పటి వరకు చేపట్టిన పనుల్లో నాణ్యత కరవైంది. మరుగుదొడ్లలో నాసిరకం కుళాయిలు వేశారు. కొన్నిచోట్ల ఆరు కుళాయిలు అవసరం రెండే ఏర్పాటు చేశారు. నంద్యాల కళాశాల బాలుర వసతిగృహం-1లో 14 కుళాయిలకు ఆరు మాత్రమే అమర్చారు. ఇదే ప్రాంగణంలోని వసతిగృహం-2లో కూడా అవసరమైనన్ని



కుళాయిలు ఏర్పాటు చేయలేదు. ఫ్లోరింగ్ పనులను తూతూమంత్రంగా చేశారు. పనులపై పర్యవేక్షణ కొరవడింది.

**చేయాల్సిన పనులివే**


ఉమ్మడి జిల్లాలోని 55 సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో చిన్న, పెద్ద మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. వీటితో మరుగుదొడ్ల మరమ్మతులు, రన్నింగ్ వాటర్, తాగునీటి సరఫరా, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల ఏర్పాటుతో పాటు ఎల్ఈడీల అమరిక తదితర విద్యుదీకరణ పనులు, దోమల నివారణకు మెష్‌ల ఏర్పాటు, తలుపులు, కిటకీలు, పైకప్పు, ఫ్లోరింగ్‌కు మరమ్మతులు, బాలికల వసతిగృహాలకు ప్రహరీలు నిర్మించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో రూ.16.19 కోట్లు కేటాయించారు. కర్నూలు నియోజకవర్గంలో 3, ఆదోని 4, ఆలూరు 3, పత్తికొండ 6, కోడుమూరు 2, ఎమ్మిగనూరులో 1, పాణ్యం 6, నంద్యాల 5, డోన్ 4, ఆళ్లగడ్డ 5, బనగానపల్లి 5, శ్రీశైలంలో నాలుగు, నందికొట్కూరు నియోజకవర్గంలోని 7 వసతిగృహాల్లో పనులు ప్రారంభించారు.

**అర్ధంతరంగా వదిలేశారు**

2025- 26 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోగా వసతిగృహాల్లో పనులు పూర్తి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ శాఖలకు బాధ్యతలు అప్పగించింది. నంద్యాల జిల్లాలోని 20 మండలాల్లోని 31 వసతి గృహాల పర్యవేక్షణను ఏపీఈడబ్ల్యూఐడీసీ, సమగ్ర శిక్షా అభియాన్, ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు కట్టబెట్టారు. కర్నూలు జిల్లాలోని 13 మండలాల్లో ఉన్న 24 వసతిగృహాల పనులను ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఏపీఈడబ్ల్యూ ఐడీసీ శాఖలు పర్యవేక్షిస్తున్నాయి. మార్చిలో పనుల ప్రారంభించి జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. రెండు జిల్లాల్లో ఎక్కడా పనులు పూర్తి కాలేదు. చాలా వసతిగృహాల్లో 50 శాతం కూడా చేయకుండానే గుత్తేదారులు చేతులెత్తేశారు.

# జూన్ చివరి నాటికి వెలిగొండ పూర్తి లక్ష్యం

ఒంగోలు : పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులు జూన్ ఆఖరు నాటికి పూర్తికావాలని జల వనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఇంజినీర్లను ఆదేశించారు. వెలిగొండ, నాగార్జున సాగర్ ప్రాజెక్టు, గుండ్లకమ్మ జలాశయం ఇంజినీర్లతో ఒంగోలులోని ఎన్నెస్పీ అతిథి గృహంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా కొంతసేపు సమావేశంలో పాల్గొన్నారు. జూన్ ఆఖరున వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నందున ఆ లోపు సొరంగాలు, ఆర్ అండ్ ఆర్ పనులు పూర్తిచేయాలన్నారు. గుత్తేదారులను పిలిపించి నిర్ణీత గడువులోపు పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని వెలిగొండ ఎస్ఈని



ఆదేశించారు. రెండు సొరంగాల పనులు ఎంతవరకు వచ్చాయి.. ఇంకా ఏమేమి చేపట్టాల్సి ఉంది.. నిధుల లభ్యత, ఇంకా ఎంత అవసరం అనే అంశాలపై ఇంజినీర్లతో చర్చించారు. సాగర్ నీరు త్వరలో విడుదల చేస్తున్నందున తాగునీటి అవసరాలకు చెరువులు నింపుకొనేలా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీఈ శ్యాంప్రసాద్, వెలిగొండ ఎస్ఈ నాగమురళీ మోహన్, మార్కాపురం, కంభం, దోర్నాల ప్రాజెక్టు అధికారులు అబుద్అలీ, అప్పారావు, శ్రీనివాసరావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# నిఘా కళ్లు.. నేలచూపు!



అనంతపురం : జిల్లాలోని పలు ఆర్టీసీ ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు నేలచూపు చూస్తున్నాయి. వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. మరికొన్ని చోట్ల ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. నిత్యం వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్లలో భద్రతపై నీలినీడలు అలముకున్నాయి. చాలా మంది ప్రయాణికులు గమ్యస్థానం చేరాలన్న ఆత్రుత...మరికొందరు బస్సుల్లో సీటు దక్కితే చాలన్న ఆలోచనలో ఉంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు పెట్రేగిపోతున్నారు. పోలీసు ఔట్‌పోస్టు ఉంటున్నా నామమాత్రంగా ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. గుంతకల్లు, తాడిపత్రి, గుత్తిలో మినహా మిగతా చోట్ల అరకొరగా సీసీ కెమెరాలు ఉన్నా సక్రమంగా పని చేయడం లేదు.

అనంత జిల్లా కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణానికి రాష్ట్రం నుంచే కాకుండా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి నిత్యం 270 బస్సులు వస్తుండగా.. సుమారు 50 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీకి సంబంధించిన ఒక్క సీసీ కెమెరా లేకపోవడం గమనార్హం. దుకాణాల నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్న కెమెరాల మీదే ఆధారపడాల్సి వస్తోంది. గతంలో పోలీసులు ఏర్పాటు చేసిన అరకొర కెమెరాల నిర్వహణ కరవైంది.

ప్లాట్‌ఫాంలు 19 ఉండగా ఒక్క కెమెరా కూడా ఏర్పాటు చేయలేదు. ఇటీవల బస్టాండ్‌లో 18 తులాలు బంగారం చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు.

**ఒక్కటీ లేదాయె..**

ఉరవకొండ ఆర్టీసీ ప్రాంగణంలో సీసీ కెమెరాల జాడే లేదు. 55 సర్వీసులతో పాటు ఇతర డిపోలకు చెందిన బస్సులు నడుస్తుంటాయి. రోజూ 15 వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు.

ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఉంటుంది. ఆ సమయంలో చరవాణులు ఎక్కువగా చోరీకి గురవుతున్నాయి.

చాలా కాలంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా యంత్రాంగం స్పందించడం లేదు.

ఉన్నా.. నిరుపయోగమే కళ్యాణదుర్గం ఆర్టీసీ బస్టాండులో రెండు సీసీ కెమెరాలు ఉండగా ఒక్కటీ పని చేయడం లేదు. తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి.

ఈనెల 6న బస్సు ఎక్కుతున్న మహిళ మెడలో నుంచి సుమారు 5 తులాల బంగారు గొలుసు అపహరణకు గురైంది.

ఇక్కడ 67 సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. రోజూ సుమారు సుమారు 8 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు.

పోలీసులే ఏర్పాటు చేస్తారు..-సుమంత్ ఆర్ ఆదోని, ఆర్ఎం, అనంతపురం జిల్లా

ఆయా ఆర్టీసీ ప్రాంగణాల్లో పోలీసులే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఇందుకు స్థానిక డిపో మేనేజర్లు పోలీసులకు సహకారం అందిస్తారు. కొన్ని బస్టాండుల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది.

# తవ్వేస్తా.. అడ్డుకుంటే తరిమేస్తా..!

రేణిగుంట : వైకాపా హయాంలో రేణిగుంట మండలంలో కొన్ని చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడితే.. మరి కొన్ని చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. ఇదే పంథాను ఓ కూటమి నేత అనుసరిస్తున్నాడు. అడ్డుకున్న యంత్రాంగాన్ని బెదిరించి అక్కడి నుంచి తరిమేస్తున్నాడు. ఇందుకు రేణిగుంట మండలం ఆర్పీ అగ్రహారం చెరువే ఉదాహరణ.రేణిగుంట మండలంలోని గుత్తివారిపల్లె-ఆర్.మల్లవరం మధ్యలో ఉన్న ఆర్పీ అగ్రహారం చెరువు మట్టిపై ఓ భాజపా నేత కన్నేశాడు. తిరుపతికి చెందిన ఓ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వారు ఇక్కడ సుమారు 40 ఎకరాల భూమి కొన్నారు. దాన్ని చదును చేయాలని భావించగా.. ఆ బాధ్యతను సదరు భాజపా నేత తీసుకున్నారు.



గుత్తేదారు అవతారమెత్తిన ఆయన రెండు రోజులుగా రాత్రుళ్లు జేసీబీలు పెట్టి చెరువు మట్టి తవ్వి టిప్పర్లతో తరలిస్తున్నాడు. ఒక టిప్పర్‌కు సుమారు రూ.10 వేలు చొప్పున వసూలు చేస్తున్నాడు.

**అడ్డుకున్నా.. ఆగట్లేదు** ఇక్కడ మట్టి తవ్వకాలతో చెరువు రూపురేఖలు మారిపోయాయి. జాతీయ రహదారిని ఈ చెరువుపైనే కాస్త నిర్మించారు. వంతెన కింద సమీపంలో చేపడుతున్న మట్టి తవ్వకాలతో భవిష్యత్తులో వంతెనకు ఇబ్బంది తప్పదు. స్థానిక రెవెన్యూ సిబ్బంది అడ్డుకోగా బదిలీ చేయిస్తానని వారిని బెదిరించడంతో చేసేదేమీలేక వెనుదిరిగారు. ఈ అంశంపై మండల ఇరిగేషన్ ఏఈ హరికృష్ణను వివరణ కోరగా పలుమార్లు ఇక్కడ అడ్డుకున్నామని, అయినా మట్టి తవ్వుతున్నారని తెలిపారు.

# యంత్రాంగం కదిలింది..!

భీమిలి : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మహా విశాఖ నగర పాలక సంస్థ అధికార యంత్రాంగం కదిలింది. వచ్చి ఫిర్యాదులపై అధికారులు స్పందించారు. ఉదయం నుంచి జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, మంచినీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. భీమిలి, మధురవాడ, మద్దిలపాలెం, పాతనగరం, గాజువాక, మల్కాపురం, వేపగుంట తదితర చోట్ల 42 ప్రాంతాల్లో ప్రత్యేక పరిశుభ్రత పనులు చేశారు. కాలువల్లో పూడికలు తీసి, దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. నీటి సరఫరా తక్కువగా ఉన్న ప్రాంతాలపై నివేదిక సమర్పించాలని నీటి సరఫరా పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్.రవి ఆదేశాలతో ... సహాయ



ఇంజినీర్లు ఆయా ప్రాంతాల వివరాలతో పాటు, కారణాలు తెలియజేస్తూ నివేదిక సిద్ధం చేస్తున్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి ఎంత మంది లబ్ధిదారులకు నిధులు వెనక్కి చెల్లించాలన్న అంశాలపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు. అభివృద్ధి పనుల ప్రతిపాదనలు, టెండర్లకు కాస్త సమయం పడుతుందని మేయరు పీలా శ్రీనివాసరావు తెలిపారు. ఆయా సమస్యల్నీ త్వరలోనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

# బిడ్డల సంరక్షణకు శ్రీకారం!

పుత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం పిల్లల సంరక్షణకు సంబంధించి దృష్టి సారించింది. ఈ మేరకు ఎన్టీఆర్ బేబీ కిట్లు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. తద్వారా చిన్నారులకు ఇన్‌ఫెక్షన్ నుంచి ఊరట లభించనుంది. గతంలో తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ బేబీ కిట్లు పథకాన్ని అమలు చేసింది. 2019ల వైకాపా అధికారంలోకి వచ్చాక పేరు మార్చింది. అనంతరం 2021లోనే ఈ పథకానికి స్వస్తి పలికింది. ఇది చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తోందని భావించిన కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకోవడం గమనార్హం.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏటా సుమారు 38 వేల ప్రసవాలు జరుగుతాయి. ఈ మేరకు ఏడాదికి సుమారు రూ.5.35 కోట్లను ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు




వ్యయం చేయనుంది. ఈ బేబీ కిట్‌లో 11 రకాల వస్తువులుంటాయి. దోమతెర, బేబీబెడ్, వాటర్‌ప్రూఫ్ కాట్, బేబీ డ్రస్, జేబు రుమాళ్లు, పౌడర్, షాంపూ, ఆయిల్, సబ్బు తదితర వస్తువులుంటాయి. ఒక్కో కిట్టు విలువ రూ.1,410 ఉంటుంది.

**పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరట..**

ఆర్థిక స్థోమత లేని వారంతా కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకుంటుంటారు. కనీసం ప్రసవం అనంతరం పిల్లలకు చిన్నపాటి బెడ్ కూడా కొనలేని వారికి ఈ పథకం ఎంతో ఉపయోగకరం. పేదలు, మధ్య తరగతి ప్రజలు గర్భం దాల్చిన నాటి నుంచి కూడా ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలతో సిజేరియన్ ప్రసవాలు చేస్తున్నారు. తిరుపతి మెటర్నిటీ, శ్రీకాళహస్తి, చిత్తూరు, కుప్పం, నగరి, పలమనేరు ప్రాంతీయ ఆస్పత్రుల్లో ప్రసవాలు బాగానే జరుగుతున్నాయి. వీరికి బేబీ కిట్లు అందించడం వల్ల పిల్లలు ఇన్‌ఫెక్షన్లు, రోగాల బారిన పడకుండా ఉంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తిరిగి ఈ పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.పిల్లల సంరక్షణకు ఎంతో ఉపకరిస్తుందని పేర్కొంటున్నారు.

# మధుర ఫలం.. విషతుల్యం..



పుట్టపర్తి : పచ్చి మామిడి కాయలను కొందరు వ్యాపారులు యథేచ్ఛగా ప్రమాదకర రసాయనాలతో మాగబెట్టి విక్రయిస్తున్నారు. ఆ పండ్లను తిన్న వారు అనారోగ్యపాలవుతున్నారు. ఆహార భద్రతా తనిఖీ అధికారులు అరకొరగా తనిఖీలు చేస్తుండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 47,500 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. అత్యధికంగా పుట్టపర్తి నియోజకవర్గంలోని పుట్టపర్తి, బుక్కపట్నం, నల్లమాడ, కొత్తచెరువు, కదిరి నియోజకవర్గంలో తలుపుల, గాండ్లపెంట, ఎన్పీకుంట, ధర్మవరం నియోజకవర్గంలో ముదిగుబ్బ మండంలో దిగుబడులు ఉంటున్నాయి. 95 శాతం బేనీషా రకం సాగుచేయగా, మిగిలిన ఐదు శాతం మల్లిక, బాదామి, కేసరి రకాలు సాగులో ఉన్నాయి. ఏటా 1.50 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. రైతుల నుంచి కాయలు కొనుగోలు చేసిన వ్యాపారుల్లో అత్యధిక మంది రసాయనాలతో మాగబెట్టి విక్రయాలు జరుపుతున్నారు.

**రంగు చూసి మోసపోవద్దు**

మామిడి పండ్లను వివిధ రసాయనాలతో మాగబెట్టడం నేరమని తెలిసినా కొందరు వ్యాపారులు ఆ ధోరణిని మాత్రం వదల్లేదు. మాగబెట్టడానికి క్యాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. దీంతోపాటు ఈథెఫోన్ రసాయనాన్ని కాయలపై చల్లుతున్నారు. ఈ రసాయనాలు అసిటలీన్‌ను ఉత్పత్తి చేయడంతో మామిడి కాయ దాని నిర్ణీత సమయం కంటే త్వరగా పసుపు రంగులోకి మారుతోంది. వీటిని తినడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు, వాంతులు, తలనొప్పితోపాటు ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. దీర్ఘకాలంలో క్యాన్సర్, లివర్, జీర్ణ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని వారు హెచ్చరికలు చేస్తున్నారు.

**ఇలా చేస్తే మేలు..**'ఎథ్రిల్ రసాయన పౌడర్‌ను నీటిలో కలిపి ఉంచాలి. అందులో పక్వానికి వచ్చిన మామిడి పండ్లను ఐదు నిమిషాలు ఉంచి బయటికి తీయాలి. మూడు, నాలుగు రోజుల తరువాత పండు మాగి పసుపు వర్ణంలోకి వస్తుంది. మంచి సువాసన వస్తుంది.' అని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ విధంగా మాగబెట్టిన పండ్లను తింటే అనారోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. సహజ సిద్ధంగా మాగబెట్టిన మామిడి రుచికరంగా ఉండటంతోపాటు ఆరోగ్యానిస్తు ందన్నారు.


**తనిఖీలు చేస్తున్నాం..- కల్యాణ్‌చక్రవర్తి, జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి** మామిడి పండ్ల సీజన్ ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్లు, మండీలు, ఉత్పత్తులు నిల్వ చేసిన ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాం. ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదకర రసాయనాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# అదిగో.. మరో రాచబాట

విశాఖపట్నం : విజయనగరం, అనకాపల్లి జిల్లాలను అనుసంధానిస్తూ వలయ రహదారి (రింగు రోడ్డు)కి విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళిక రూపొంది స్తోంది. ముఖ్యంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునేలా ఈ ప్రతిపాదన సిద్ధం చేశారు. భవిష్యత్తు అవసరాలు, విశాఖలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ కసరత్తు సాగుతోంది. ఇటీవల విశాఖ జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం నిర్వహించిన సమయంలో దీనిపై చర్చించడంతో అమలు దిశగా వీఎంఆర్‌డీఏ చర్యలు తీసుకుంటోంది.అనకాపల్లి, పెందుర్తి, ఆనందపురం, భోగాపురం మండలాల పరిధిలో సుమారు 85 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మించాలనుకుంటున్నారు. మొదట నాలుగు వరుసలు, ఆ తర్వాత ఆరు, ఎనిమిది వరుసలతో నిర్మించేలా భూసేకరణ చేయాలని భావిస్తున్నారు.భూసేకరణ జరిపి రైతులకు పరిహారం అందజేసి నిర్మించాలంటే ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున.. ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నారు.

ప్రతిపాదిత రోడ్డుకు ఇరువైపులా ఉండే భూములకు విలువ కల్పించేలా ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్య విధానంలో చేపట్టాలనే దిశగా ప్రాథమికంగా పరిశీలిస్తున్నారు. అంటే.. అక్కడక్కడ వాణిజ్య సముదాయాలు, బహుళ అవసరాల నిర్మాణాలు చేపట్టి సంబంధిత భూయజమానులకు ప్రయోజనం కల్పించేలా చేయనున్నారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా సర్వే నిర్వహణ, లేఅవుట్ ఖరారు, ప్రతిపాదిత మార్గం, సాంకేతిక, ఆర్థిక అంశాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీకి కన్సల్టెంట్ నియామకానికి వీఎంఆర్‌డీఏ ఆసక్తి వ్యక్తీకరణ (ఆర్ఎఫ్‌పీ) కోరింది. వేగంగా పట్టాలెక్కేలా వీఎంఆర్‌డీఏ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.



ప్రయాణ సమయం తగ్గేలా: వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ, పరిసర ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని ఈ రోడ్డుకు ప్రణాళిక చేశాం. అచ్యుతాపురం నుంచి భోగాపురం బీచ్ వరకు, రాంబిల్లి ఇతర ప్రాంతాల్లోని రద్దీ, ప్రయాణ సమయం తగ్గించడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. విశాఖ, భోగాపురం విమానాశ్రయాన్ని ఇతర ప్రాంతాలతో అనుసంధానించేలా ఇది ఉంటుంది. అటు పర్యాటకంగానూ కీలకంగా మారనుంది. దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టు రూపొందిస్తున్నాం. - ఎంవీ ప్రణవ్‌గోపాల్, ఛైర్మన్, వీఎంఆర్‌డీఏ

# సాహస యాత్రలా.. జాగ్రత్తలు పాటించండి

తిరుపతి : ప్రకృతిపై ప్రేమతోనో.. అడవులంటే మమకారంతోనో.. జాలీ ట్రిప్పుల కోసమో కొందరు అడవిబాట పడుతున్నారు. అయితే అటవీశాఖను సంప్రదించకుండా, అనుభవజ్ఞుల తోడులేకుండా ట్రెక్కింగ్‌లకు ప్రయత్నించడం కోరి ప్రమాదాలను ఆహ్వానించడమేనని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరీ ప్రధానంగా గుర్తింపులేని నిర్వాహకులను నమ్మి ప్రవేశిస్తే అటవీ చట్టాలను అనుసరించి జైలుపాలు కావాల్సి వస్తుందని చెబుతున్నారు. రెండురోజుల కిందట తలకోనలో, అంతకుముందు అన్నమయ్య జిల్లాలో అనుమతులు లేకుండా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించడంతో సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో అటవీశాఖ అప్రమత్తం చేస్తోంది.

**గుర్తింపులేని సంస్థలతో జాగ్రత్త**

కొన్ని గుర్తింపులేని సంస్థలు తమకు అన్నీ తెలుసని, అధికారుల సహకారం ఉందని కిందిస్థాయి సిబ్బందిని అడ్డుపెట్టుకుని అనధికార ట్రెక్కింగులు నిర్వహిస్తున్నాయి. రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. తాము పరిశోధకులమని, వన్యప్రాణి ప్రేమికులమని ప్రకటించుకుని స్నేహితులను, సన్నిహితులను వెంటబెట్టుకుని అడవుల్లో సాహస యాత్రలు చేపడుతున్నారు.

**అనుతులు ఇలా..**

శేషాచలం అడవుల్లోని రిజర్వు అటవీ ప్రాంతాల్లో, శ్రీవేంకటేశ్వర నేషనల్ పార్కు, ఎస్వీ అభయరణ్యాల పరిధిలో ట్రెక్కింగ్ నిర్వహించాలంటే తప్పనిసరిగా అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. డీఎఫ్‌వో స్థాయి అధికారి వద్ద ముందస్తు ప్రణాళిక, రూట్‌మ్యాప్, బృంద సభ్యుల వివరాలు, రక్షణకు సంబంధించిన నిర్దిష్ట ఏర్పాట్ల వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ఔత్సాహికులు స్వతహాగా వెళ్లాలంటే



బృందంగా ఏర్పడి అటవీశాఖ అధికారులను సంప్రదిస్తే వారే ఏర్పాట్లు చేస్తారు. వన సంరక్షణ సమితులు (వీఎస్ఎస్), ఎకో డెవలప్ కమిటీలు (ఈడీసీ), కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం (సీబీఈటీ) బృందాల సాయంతో ట్రెక్కింగ్‌లో పాల్గొనేలా అవకాశం కల్పిస్తారు.

**ఆ మూడు నెలలు నిషేధం**

సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వేసవి కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయి. ఈ సమయంలో ట్రెక్కింగ్‌లకు వెళ్తే అగ్నికీలల్లో చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకోవాల్సి ఉంటుంది. నీటికోసం చిరుతలు, ఏనుగుల గుంపులు వెతుకులాటల్లో ఉంటాయి. ఈ సమయంలో వాటి కంటపడితే ప్రాణాపాయం తప్పదు. ఈ కారణంగానే ఈ మూడు నెలలూ అడవుల్లోకి ప్రవేశం, ట్రెక్కింగ్‌ల నిర్వహణపై అటవీశాఖ నిషేధం విధిస్తుంది. ఔత్సాహికులు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాల్సి ఉంటుంది.

**కొత్త పాలసీ సిద్ధం చేస్తున్నాం..- వివేక్ ఆనంద్, డీఎఫ్‌వో, జిల్లా అటవీపాలనాధికారి**

శేషాచలం అడవుల్లో ట్రెక్కింగ్ నిర్వహణకు అనుమతులు తప్పనిసరి. గుర్తింపులేని సంస్థల నిర్వాహకులను అనుసరిస్తే ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తుంది. కొందరు అనధికారికంగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ట్రెక్కింగ్‌ల నిర్వహణ కోసం అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేస్తున్నాం. త్వరలోనే కొత్తపాలసీని ప్రవేశపెడుతాం. తలకోన, అన్నమయ్య జిల్లాల పరిధిలో జరిగిన ఘటనలపై చర్యలు తీసుకుంటున్నాం.

# లోపాలు దాచబోయి.. మరిన్ని తప్పులు

తిరుపతి : తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశువైద్య వర్సిటీ అధికారుల తప్పటడుగులతో సరికొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. విజయనగరం జిల్లాలోని గరివిడి పశువైద్య కళాశాలకు భారత పశువైద్య మండలి (వీసీఐ) అనుమతుల సాధన కోసం గతంలో చేసిన దొడ్డిదారి ప్రయత్నం బెడిసికొట్టింది. ఈనెల 14 నుంచి 16 వరకు వీసీఐ బృందాలు అనుమతులు అవసరమైన గరివిడి కళాశాలతోపాటు మరో మూడింటిలో సాధారణ పరిశీలనలు చేపడుతున్నట్లు సమాచారం ఇవ్వడంతో వర్సిటీ అధికారులు ఇరకాటంలో పడ్డారు.

**ఇదీ జరిగింది..!** పశువైద్య విద్యను ఉత్తరాంధ్రకు విస్తరించాలన్న లక్ష్యంతో 2016లో విజయనగరం జిల్లా గరివిడిలో రూ.81.72 కోట్లతో పశువైద్య కళాశాలను అప్పటి తెదేపా ప్రభుత్వం మంజూరు చేసింది. 2021లో వైకాపా ప్రభుత్వం భారత పశువైద్య మండలి (వీసీఐ) అనుమతులు లేకుండానే ప్రవేశాలు కల్పించింది. తదనంతరం రాష్ట్రవాటా చెల్లించపోవడంతో నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారు. 86 మంది అధ్యాపకులను నియమించాల్సి ఉండగా 18 మందితోనే సరిపెట్టారు. దీంతో 2021, 2022లో ప్రవేశం పొందిన విద్యార్థులకు మాత్రమే వీసీఐ అనుమతి లభించింది. 2022 ఆగస్టులో కళాశాలను సందర్శించి నా అనుమతుల మంజూరుకు నిరాకరించింది. 2024 నవంబరులో మరోదఫా పరిశీలనకు



వస్తున్నట్లు తెలుసుకున్న అధికారులు సరికొత్త ఎత్తులు వేశారు. తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలల నుంచి 26 మంది సీనియర్ అధ్యాపకుల్ని అక్కడికి బదిలీ చేశారు. ముందస్తు ఒప్పందం ప్రకారం పరిశీలనలు ముగిసిన వెంటనే 2025 జనవరిలో 18 మందిని యథాస్థానాలకు పంపారు. ఇంకో రెండునెలల్లో ఐదేళ్ల బీవీఎస్సీ (ఏహెచ్) తొలిబ్యాచ్ పూర్తికానుండటం, అందులో మూడేళ్లకు వీసీఐ అనుమతులు లేకపోవడంతో 70 మంది తొలిబ్యాచ్ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వీసీఐ అనుమతులు లేకుండా కోర్సు పూర్తిచేస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు ఉండదు.

**వర్సిటీ ఎత్తుకు వీసీఐ పైఎత్తు**

వర్సిటీ అధికారులు వేసిన ఎత్తుల్ని చిత్తుచేస్తూ వీసీఐ ఈదఫా పరిశీలనల్ని పక్కా ప్రణాళికతో రూపొందించుకుంది. గరివిడి కళాశాలతో పాటు తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు కళాశాలల్ని ఏకకాలంలో సందర్శించాలని నిర్ణయించింది. ఒక్కో వర్సిటీకి ఒక్కో బృందం ఈనెల 14- 16 వరకు తనిఖీలకు వెళ్లనుండటం, వర్సిటీ పరిధిలో 50 శాతం అధ్యాపకుల ఖాళీలు ఉండటంతో అసలుకే ఎసరు తెచ్చిపెడుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# త్వరపడండి.. ధ్రువపత్రం పొందండి

పుంగనూరు : విద్యార్థులు తమకు అవసరమైన ధ్రువపత్రాల కోసం త్వరపడి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రధాన పరీక్షలు ముగియడం.. ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో విద్యార్థులందరూ ఉన్నత చదువులపై దృష్టి పెట్టారు. ఆయా కళాశాలలు, కోర్సుల్లో చేరాలంటే విద్యార్హతతో పాటు కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు జతపరచాలి. వాటిని ముందుగా పొందడానికి ఇదే సరైన సమయమని పేర్కొంటున్నారు. వాటిని ఎలా పొందాలో తెలుసుకుంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు.

విద్యార్థి తనకు కావాల్సిన ధ్రువపత్రం కోసం గ్రామ, వార్డు సచివాలయం లేదా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్, రేషన్, ఇతర పత్రాలు అందించాలి. డిజిటల్ అసిస్టెంట్ ఆన్‌లైన్ చేసిన తర్వాత సంబంధిత వీఆర్వో నేరుగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఆ వివరాలు ఆన్‌లైన్ దరఖాస్తుకు జతచేసి మండల




రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు పంపుతారు. ఆ వివరాల ఆధారంగా తహసీల్దారు లాగిన్‌కు దరఖాస్తు వెళ్తుంది. తహసీల్దారు పరిశీలించి డిజిటల్ సంతకం చేస్తే ధ్రువపత్రం మంజూరవుతుంది.

15 రోజులు ముందుగా...– రాము, తహసీల్దారు, పుంగనూరు

విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు ముందుగానే అవసరమైన పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయం, మీ సేవా కేంద్రాల్లో 15 రోజుల ముందుగానే దరఖాస్తు చేసుకుంటే బాగుంటుంది. అప్పటికప్పుడు చేసుకుంటే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

# సవాలుకు.. ప్రతి సవాలు

తిరుపతి : తిరుపతి గ్రామీణ పరిధిలోని ఎస్వీ గోశాల రాజకీయాలకు వేదికగా మారింది. గోవుల మృతిపై తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విసిరిన సవాలును తాను స్వీకరిస్తున్నానని తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. గురువారం గోశాలను సందర్శించి అక్కడే వాస్తవాలు వెల్లడిస్తానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కూటమి నేతలు సైతం దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తామూ గోశాలకు వస్తామని, అక్కడే మీడియా ఎదుట వాస్తవాలు తేలుద్దామంటూ ప్రకటించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కీలక నేతలు గోశాలకు తరలిరానున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు.

**రాజకీయ లబ్ధికేనా?**

గోవుల మృతిపై ఇప్పటికే తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు స్పష్టతనిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మృతిచెందిన గోవుల వివరాలు తెలియజేస్తూ వయసు మీరిన,




అనారోగ్య పరిస్థితుల్లో మృతి చెందినవి ఉన్నాయి తప్ప ఇతర కారణాలతో కాదని ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఇతర కూటమి నేతలు సైతం ఈ అంశంపై వైకాపా నేతల తీరు ఎండగట్టారు. భక్తుల మనోభావాలు, తితిదే ప్రతిష్ఠను మంటగలపడానికి ఆయన కంకణం కట్టుకున్నారంటూ మండిపడ్డారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సైతం గోశాలను సందర్శించి అక్కడ ఎటువంటి గోహత్యలు జరగలేదని, ఈ అంశంపై రాజకీయం తగదంటూ కరుణాకర్‌రెడ్డికి హితవు పలికారు. అయినా భూమన కరుణాకర్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసం చూస్తున్నట్లు స్పష్టమవుతున్న నేపథ్యంలో ఆయన చర్యలను సమర్థంగా తిప్పికొట్టేందుకు కూటమి నేతలు, హిందూ సంఘాలు సిద్ధమయ్యాయి.

# మసకబారిన గోవాడ 'వెలుగు'

చోడవరం : చక్కెర తయారీ ఖర్చు అంతకంతకు పెరుగుతుండటంతో చెరకు సరఫరా చేసిన రైతులకు సకాలంలో చెల్లింపులు చేయలేని దుస్థితి గోవాడ కర్మాగారానిది. ఉప ఉత్పత్తుల ద్వారా అయినా ఆదాయం పెంచుకుందామంటే వాటి పరిస్థితీ అంతే ఉంది. జిల్లాలో గోవాడ, ఏటికొప్పాక కర్మాగారాల్లో విద్యుదుత్పత్తి ప్లాంట్లను 20 ఏళ్ల కిందట నెలకొల్పారు. ఏటికొప్పాకలో ఒక మెగావాట్ సామర్థ్యం గల ప్లాంట్ ఏర్పాటు కాగా, గోవాడలో 13 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 6.5 మెగావాట్లను కర్మాగారం అవసరాలకు వినియోగిస్తూ, మిగులు విద్యుత్తును తూర్పుప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థకు (ఈపీడీసీఎల్) విక్రయించేలా ఒప్పందం ఉంది.

2002–03 గానుగాట కాలం నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. ఒక్కో యూనిట్ రూ.3.45 చొప్పున విక్రయించేలా ప్రభుత్వంతో అంగీకారం కుదిరింది. ఏటా రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు కర్మాగారానికి ఆదాయం వచ్చేది. 2017–18లో బకాయిలతో సహా రూ.8.76 కోట్లు వచ్చింది. తర్వాత నుంచి విద్యుదుత్పత్తి తగ్గుతూ వచ్చింది. తద్వారా ఆదాయమూ పడిపోయింది. 2023–24లో విద్యుత్తు విక్రయం ద్వారా రూ.72 లక్షలే వచ్చింది. 2024–25లో ఆదాయం బాగా తగ్గింది. ఈ గానుగాట కాలంలో 50 వేల యూనిట్లే విద్యుదుత్పత్తి జరిగిందని పరిశ్రమ వర్గాల సమాచారం. 2024–25లో రూ.1.35 కోట్ల ఆదాయం విద్యుదుత్పత్తి ద్వారా వస్తుందని కర్మాగార యాజమాన్యం అంచనా వేసినా.. ఆ పరిస్థితులు కనిపించడం లేదు. గతంలో యూనిట్ ధరపై ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం 2023తో ముగిసింది. యాజమాన్యం ఆ ఒప్పందాన్ని కొనసాగించేలా ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి చివరకు కొనసాగించేలా చేసింది. యూనిట్‌కు కనీసం రూ. 6కు పైగా చెల్లించాలన్న విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించలేదు. దీంతో యూనిట్ ధర రూ. 4కే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

# మీ భూమిలో సారమెంత?



అనంతపురం : గత ఐదేళ్ల వైకాపా పాలనలో భూసార పరీక్షలు పూర్తిగా అటకెక్కాయి. కనీసం పరీక్షలకు వాడే రసాయనాలు సరఫరా చేయలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు ముందే మట్టి పరీక్షలు చేయాలని నిర్ణయించారు. 2025–26 ఏడాదికి ఉమ్మడి అనంతపురం జిల్లాలో 48,266 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యాలను నిర్దేశించారు. అందులో అనంతపురం జిల్లాకు 25,107, శ్రీసత్యసాయి జిల్లాకు 23,159 మట్టి నమూనాలను సేకరించాలని నిర్ణయించారు.

**భూసారంతో అధిక దిగుబడి.. నేల ఆరోగ్యం**

భూసారం భద్రంగా ఉన్నప్పుడే మొక్క ఎదుగుదల ఉంటుంది. తద్వారా దిగుబడులు నాణ్యతగా ఉండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచిక, లవణ పరిమాణం, లభ్య నత్రజని, భాస్వరం, పొటాష్ లభించే మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. రసాయన ఎరువుల వాడకం పెరిగిందని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రకటించింది. పంటల సాగుకు తగిన నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్షల ఫలితాల మేరకు పోషకాలు అందించి దిగుబడులు పెంచుకోవచ్చు.

**నమూనాల సేకరణ ఇలా..**

నేలను బట్టి ఐదెకరాల వరకు ఒక నమూనా సేకరించవచ్చు. నమూనాలు తీసే పొలంలో 10–20 చోట్ల మట్టిని సేకరించాలి. పారతో 'వి' ఆకారంలో 6–8 అంగుళాల గుంత తవ్వాలి. అందులోని మట్టిని గోనెసంచి/పాలిథిన్ కవరు మీద వేసి బాగా కలపాలి. ఆ మట్టిని నాలుగు భాగాలుగా విభజించాలి. ఎదురెదురుగా ఉన్న భాగాలు తీసుకుని, మిగిలిన భాగాలు పడేయాలి. అర కిలో మట్టిని తీసుకుని పరీక్షలకు పంపాలి.

**ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపకల్పన**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాల్లో 864 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఆర్ఎస్‌కే పరిధిలో మట్టి నమూనాలు సేకరిస్తారు. ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి ప్రారంభమవుతోంది. ఆలోపే మట్టి నమూనాలు సేకరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. యాప్‌లో జీపీఎస్ ఆధారంగా నమూనాలు సేకరించి, ఆ చిత్రాలను అప్‌లోడ్ చేయాలి. ఫలితాలను రైతు చరవాణికి తెలుగులో సంక్షిప్త సందేశం పంపేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. భూసార పరీక్ష కార్డును రైతుకు అందజేస్తారు.

**మండలాల వారీగా లక్ష్యాలు ఇస్తాం**అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి భూసార మట్టి నమూనాల సేకరణ లక్ష్యాలు వచ్చాయి. ఆర్ఎస్‌కేల వారీగా నమూనాలను విభజించి లక్ష్యాలను నిర్దేశిస్తాం. జీపీఎస్ కోఆర్డినేషన్‌తోనే మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంటుంది. భూసార పరీక్షలు చేశాక ఫలితాల కార్డులను సకాలంలో రైతులకు అందజేస్తాం. ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారులు

# డ్వామాలో బదిలీ డ్రామాలు




అనంతపురం : అనంతపురంలోని డ్వామా కార్యాలయంలోని కీలక విభాగాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు ఏకంగా ఏడేళ్ల నుంచి పదేళ్లకుపైగా ఇక్కడే పని చేస్తున్నారు. సదరు ఉద్యోగులను ఇతర మండలాలకు బదిలీ చేసినా వెంటనే డెప్యుటేషన్‌పై తిరిగి వస్తున్నారు. సుదూర ప్రాంతాల్లోని మండల కార్యాలయాల్లో ఉద్యోగులు లేక పనులు నిలిచిపోతున్నాయి. అక్కడ పని చేయాల్సిన ఉద్యోగులు జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండటం గమనార్హం.

జిల్లాలోని వివిధ మండలాల్లో పని చేయాల్సిన టీఏలు ఇతర మండలాల్లో డెప్యుటేషన్‌లపై విధులు నిర్వహిస్తున్నారు. వీరందరూ వైకాపా ప్రభుత్వ హయాంలో ఇచ్చిన డెప్యుటేషన్‌లపైనే పని చేస్తున్నారు. ప్రస్తుతం వీటిని రద్దు చేయకపోవటంతో ఆయా ప్రాంతాలకు పని చేయాలనుకున్న ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వైకాపా ప్రభుత్వం అధికారం కోల్పోయి..** కూటమి ప్రభుత్వం గద్దెనెక్కినా డ్వామాలో బదిలీ డ్రామాలు నడుస్తున్నాయి. ఇటీవల డ్వామా పరిధిలో ఒకే చోట మూడేళ్లు, ఒకే క్లస్టర్‌లో ఐదేళ్లు పని చేసిన వారందరినీ బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వుల మేరకు బదిలీలు చేశామని అధికారులు చెప్పుకొచ్చారు. అయితే ఇక్కడే కొందరు అధికారులు తమదైన శైలిని ప్రదర్శించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పట్లో వైకాపాతో అంటకాగిన ఇద్దరు ఉద్యోగులకు వైస్‌వర్సెస్ బదిలీలు చేయటం ఇందులో ఒకరికి ఇంఛార్జిగా మరో బాధ్యతను అప్పగించటం దుమారం రేపుతోంది. బదిలీ చేసిన 11 మంది ఏపీవోలు ఇప్పటి వరకూ రిలీవ్ అయి నూతన స్థానాల్లో చేరకపోవటం అనుమానాలకు తెరతీసింది. జిల్లా వ్యాప్తంగా 30 నుంచి 40 మంది వివిధ కేడర్ల ఉద్యోగులకు డెప్యుటేషన్‌లు ఇవ్వటంపైనా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేటాయించిన స్థానంలో పని చేయకుండా నచ్చిన స్థానానికి డెప్యుటేషన్ వేయించుకుని కొందరు ఉద్యోగులు విధులు వెలగపెడుతున్నారు. వీరందరికీ ఒక అధికారి సహకరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇటీవల ఇచ్చిన బదిలీల్లో శింగనమలకు కేటాయించిన ఉద్యోగులను మార్చాలని అక్కడి ప్రజాప్రతినిధి భీష్మించుకుని కూర్చున్నట్లు సమాచారం. వైకాపా ప్రభుత్వ హయాంలో పీడీ వేణుగోపాల్‌రెడ్డి అధికంగా డెప్యుటేషన్‌లు ఇచ్చి వెళ్లిపోయారు. ప్రస్తుతం వారంతా యథాతథంగా పని చేస్తుండటం గమనార్హం.

**అన్నీ నిబంధనల ప్రకారమే..** ఇటీవల ఇచ్చిన బదిలీల్లో కొందరు ఏపీవోలు నూతన స్థానాల్లో చేరని మాట వాస్తవమే. గతంలో కొందరు ఉద్యోగులకు అప్పటి పీడీ వేణుగోపాల్‌రెడ్డి డెప్యుటేషన్‌లు ఇచ్చారు. ఆ వివరాలన్నింటిని పరిశీలించి కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు డెప్యుటేషన్‌లపై నిర్ణయం తీసుకుంటాం. నిబంధనల ప్రకారమే ఉద్యోగులను బదిలీ చేశాం. సలీంబాషా, పీడీ, డ్వామా కార్యాలయం

# రాయితీ రుణం.. స్వయం ఉపాధికి ఊతం




అనంతపురం : నా ఎస్సీ అంటూ దీర్ఘాలు తీసిన వైకాపా అధినేత ఎస్సీ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. తెదేపా హయాంలో అమలు చేస్తున్న పదుల సంఖ్యలో పథకాలను రద్దు చేసి ఎస్సీ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఐదేళ్లలో కనీసం ఒక్క పథకం అమలు చేయలేదు. ఒకసారి ఉపాధికి కార్లు ఇస్తామంటూ ఊరించి దరఖాస్తులు స్వీకరించారు. వేలల్లో దరఖాస్తులు రావడంతో అంత మందికి ఇవ్వలేమంటూ చేతులెత్తేశారు. ఎస్సీ ఉపప్రణాళికకు కేటాయించిన నిధులను సైతం దారి మళ్లించడంతో ఏవిధమైన సంక్షేమం అందలేదు. కేవలం ఆ శాఖ ఏమి చేసిందంటే 2019 కంటే ముందు తెదేపా హయాంలో ఇచ్చిన రుణాలను వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు అప్పగించే పని మాత్రమే చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘానికి సరికొత్త జవసత్వాలు తీసుకొచ్చారు. పక్కా ప్రణాళిక అమలు చేసి ఎస్సీల ఉపాధికి దన్నుగా నిలిచే స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లాలో జనాభా ప్రాతిపదికన రాయితీ ప్రకటించి యూనిట్లు కేటాయించడంతో ఆ వర్గాల్లో ఆనందం ఉప్పొంగుతోంది.

**సాంకేతిక అంశాలకు దీటుగా యూనిట్లు**ప్రస్తుతం మార్కెట్‌లో యువత నెట్టుకొని రావడానికి అందుకు సంబంధించిన ఆధారిత అంశాల్లో ఉపాధి కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. మొత్తం 32 రంగాల్లో యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందవచ్చు. వ్యవసాయ రంగంలో డ్రోన్‌ను ఉపయోగించడానికి ఐదుగురు సభ్యులు రూ.10 లక్షలతో యూనిట్ ఏర్పాటు చేసుకోవడానికి 40 శాతం రాయితీ, 55 శాతం బ్యాంకు రుణం, 5 శాతం లబ్ధిదారుని వాటాతో ఏర్పాటు చేసుకోవచ్చు. పరిశ్రమ ఏర్పాటులో రూ.3 లక్షల్లోపు రుణాలకు 60 శాతం, రూ.10 లక్షలకు 40 శాతం రాయితీ, ట్రాన్స్‌పోర్టు విభాగంలో రూ.3 లక్షలకు 50 శాతం రాయితీ ఇస్తారు. ఈవీ బ్యాటరీ స్టేషన్లు, ట్రాన్స్‌పోర్టు రంగంలో ఆటోలు, కార్లు, గూడ్స్ ట్రక్కు, ఫ్లవర్ బొకే, వర్మీ కంపోస్టు, వెబ్‌సైట్, ఎల్ఈడీ బల్బులు, ప్లంబింగ్, వాటర్ బాటిళ్ల రీఫిల్లింగ్, మొబైల్ రిపేరి, సోలార్ ఎనర్జీ, సోలార్ ప్యానల్, ఫొటో, వీడియో, వెల్డింగ్, బేకరి, బ్రిక్స్, మొబైల్ కార్ వాషింగ్, టూరిజం, వాటర్ రీసైక్లింగ్ తదితర రంగాల్లో ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు.**ఇవీ ప్రామాణికం**%http:///apobmms.cgg.gov.in% వెబ్‌సైట్‌లో 10.5.2025 లోపు దరఖాస్తు చేయాలి.అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వారు ఆ జిల్లాకే దరఖాస్తు చేసుకోవాలి.

# ఏయూ ఆస్తులు.. ఆక్రమణదారుల అంతస్తులు!!

విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఖాళీ స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. నగరంలో భూముల ధరలు భారీగా పెరగడంతో విలువైన స్థలాలను చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారు.వర్సిటీకి బీచ్ రోడ్డు, ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో రూ. వేల కోట్ల విలువైన దాదాపు 440 ఎకరాల భూములున్నాయి. గతంలో సరైన పర్యవేక్షణ లేక చాలా ప్రాంతాల్లో ఆక్రమణకు గురయ్యాయి. వాటిలో కొన్ని స్వాధీనం చేసుకోగా.. మరికొన్ని కోర్టు వివాదాల్లో చిక్కుకున్నాయి. స్థిరాస్తుల సంరక్షణపై దృష్టి సారించిన అధికారులు సర్వే చేపట్టనున్నారు.

ఏయూ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తేనే పర్యవేక్షణ మెరుగవుతుందని విశ్రాంత ఆచార్యులు, ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.

**విలువైన భూములున్నా..**

1 బీచ్ రోడ్డులో 'సీ హారియర్' వద్ద ఏయూకు చెందిన స్థలాన్ని గతంలో వీఎంఆర్డీఏ జనరేటర్ అవసరాల కోసం తాత్కాలికంగా వినియోగించుకోవాలని చూశారు. దీనికి అనుమతుల విషయంలో కొంత గందరగోళం ఏర్పడింది. పూర్తిస్థాయి అనుమతులు లేకపోవడంతో తాత్కాలికంగా జనరేటర్ అనుమతులకూ అప్పట్లో నిరాకరించారు.



2 బీచ్ రోడ్డులో విలువైన స్థలాలు ఉన్నప్పటికీ ఏయూ పూర్తిగా వినియోగించుకోలేక పోతుంది. కొందరు వ్యక్తులు, ప్రైవేటు వర్తకులు ఆ స్థలాలను ఆక్రమించుకోవాలని చూస్తున్నారు.

3 ప్రహరీలు సరిగా లేకపోవడంతో మద్దిలపాలెం, పిఠాపురం కాలనీ తదితర ప్రాంతాల్లో స్థలాలు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారం చిన్నచిన్న ఇళ్లు, టెంట్లు వేసి వినియోగించుకుంటున్నారు.

4 హనుమంతవాక కూడలిలోని విలువైన స్థలాన్ని స్థానిక నేతల సిఫార్సులతో కొందరు హస్తగతం చేసుకోవాలని చూస్తున్నారు.

5 పోలమాంబ గుడి సమీపంలో 2.5 ఎకరాలను గతంలో ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నించగా.. ఏయూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కానీ న్యాయపరమైన సమస్యలతో దాన్ని వినియోగించుకోవడానికి ఇబ్బందులు వస్తున్నాయి.

బీచ్ రోడ్డులో పర్యాటకాభివృద్ధికి: వర్సిటీకి చెందిన కొన్ని స్థలాలను జిల్లా యంత్రాంగం, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలు, తదితరాలకు కేటాయించారు. జీవీఎంసీకి వివిధ అవసరాల నిమిత్తం గతంలో దాదాపు 18 ఎకరాలు కేటాయించారు. బదులుగా ముడసర్లోవలో 54 ఎకరాలు కేటాయిస్తామని అప్పట్లో హామీ ఇచ్చినా.. ఇప్పటికీ ఇవ్వలేదు. బీచ్ రోడ్డులో విలువైన స్థలాలను జీవీఎంసీ తీసుకుని.. పర్యాటకాభివృద్ధి కోసం వీఎంఆర్డీఏకి అప్పగించింది. అందులో టీయూ 142, సీ హారియర్, టీయూ 142, యూహెచ్3హెచ్ హెలికాప్టర్ల మ్యూజియాలు ఏర్పాటుచేశారు. అక్కడ వచ్చే ఆదాయంలో కొంత భాగం ఇస్తామని అప్పట్లో ఎంవోయూ కుదుర్చుకున్నప్పటికీ.. లాభం లేకపోయింది.

**సంరక్షణకు చర్యలు– ఆచార్య ఈఎన్ ధనుంజయరావు, రిజిస్ట్రార్, ఏయూ** ఏయూ స్థలాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నాం. కంచెలు, ప్రహరీలు నిర్మించి సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం. జిల్లా యంత్రాంగం, జీవీఎంసీకి కేటాయించిన స్థలాలకు ప్రత్యామ్నాయం ఇస్తామని అప్పట్లో చెప్పారు. ఈ విషయాన్ని ఇటీవల జీవీఎంసీ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాం. శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో వర్సిటీని ఆర్థికంగా బలోపేతం చేయాలని భావిస్తున్నాం.

# పరిష్కార'మాయే'

విశాఖపట్నం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ఫిర్యాదులపై మహా విశాఖ నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల్లో కేవలం 20 శాతం సమస్యలకే సంతృప్తికరమైన పరిష్కారాలు చూపుతూ, 50 శాతం సమస్యలకు అరకొర సమాధానాలతో సరి పెడుతున్నారు. మరో 30 శాతం ఫిర్యాదుల పరిష్కారం వైపే దృష్టిసారించడం లేదు. కొన్ని సందర్భాల్లో ఫిర్యాదుదారులకు తెలియకుండానే సమస్య పరిష్కారమైనట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండటం గమనార్హం. మరోవైపు పీజీఆర్ఎస్‌ను కొంతమంది అధికారులు, సిబ్బంది తమ స్వార్థ ప్రయోజనాలకు, కాసులు దండుకునేందుకు వినియోగించుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఆన్‌లైన్‌లో ఇలా:** జీవీఎంసీలో గత ఏడాది జూన్ 15 నుంచి డిసెంబరు వరకు 5,451 ఫిర్యాదులు అందాయి. వాటిలో 5,066 ఫిర్యాదులు పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు 854 ఫిర్యాదులు రాగా, వాటిలో 756 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. జీవీఎంసీ అధికారు లు అధిక శాతంలో ఫిర్యాదుల్ని పరిష్కరిస్తున్నామని చెబుతుంటే, పీజీఆర్ఎస్‌కు వచ్చిన వారే పదే పదే వినతులతో వస్తున్నారు. మరోవైపు సమాధానాలు ఇచ్చిన ఫిర్యాదుల్లో 20 శాతం వరకు తిరిగి అధికారులే తెరుస్తుండడం గమనార్హం.

**ఇదీ పరిస్థితి..!**నగరంలోని ఓ భారీ ప్రాజెక్టుకు సంబంధించిన కేసుల వివరాలు, అక్కడ జరుగుతున్న అక్రమాలపై ఆధారాలతో సహా ఓ ప్రజాప్రతినిధి అధికారులకు ఫిర్యాదు చేశారు. పనులు నిలిపేయాలని వినతిలో కోరారు. అయితే... ఆ ఫిర్యాదుకు సంబంధించిన వివరాలేవీ తమకు అందలేదని, ఫిర్యాదును మూసేస్తున్నామని ఓ అధికారి సమాధానం ఇవ్వడం గమనార్హం. ఫిర్యాదుదారు గతంలోనే జీవీఎంసీ, కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఆధారాలు సమర్పించారు.గాజువాక సమీప ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు జరుగుతున్నాయని, ఆధారాలతో సహా ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు... ఆ ప్రాంతంలో ఆక్రమణలు ఏమీ లేవని, ఫిర్యాదు పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

నగరంలో రెండు నిర్మాణాలపై అదనపు అంతస్తులు వేస్తున్నారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేయగా.. నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి, నిర్మాణాలు తొలగించేశామని అధికారులు తప్పుడు సమాధానం ఇచ్చారు.

**కార్యదర్శులపై ఒత్తిడి:** ఫిర్యాదులు పరిష్కరించి, ఫిర్యాదుదారులకు తెలియజేసే బాధ్యతలను వార్డు కార్యదర్శులకు అప్పగించారు. దీంతో వారి లాగిన్‌లోనే ఎక్కువ సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇలా లెక్కకు మించి పెండింగ్ ఉంటే, ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. సమస్యను పరిష్కరించే స్థాయిలో ఉన్న అధికారులు నిర్లక్ష్యంగా ఉంటూ, తమపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తున్నారని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓ సమస్య పరిష్కారమైన తర్వాత.. ఫిర్యాదు చేసిన వ్యక్తితో బయోమెట్రిక్ వేయించాలన్న నిబంధన ఉంది. కాని చాలా మంది కార్యదర్శులు ఫిర్యాదుదారుల బయోమెట్రిక్ తీసుకోకుండానే.. ఆన్‌లైన్‌లో సమస్యను మూసేస్తున్నారు.

# ప్రభుత్వ ఆదాయానికి గండి

శింగనమల : శింగనమల నియోజకవర్గంలో రియల్టర్లు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇష్టారాజ్యంగా లేఅవుట్లు వేస్తున్నారు. నిబంధనలు పక్కన పెట్టి రూ.కోట్లు సంపాదిస్తున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చాలంటే మార్కెట్ విలువకు తగ్గట్టుగా ప్రభుత్వానికి రుసుము చెల్లించాలి. ఆ రసీదుతో తహసీల్దారుకు దరఖాస్తు చేసుకుంటే ఆర్డీవో నుంచి అనుమతులు వస్తాయి. ఇవేవీ చేయకుండానే వ్యవసాయ భూములను లేఅవుట్లుగా మార్చి క్రయవిక్రయాలు చేస్తున్నారు.

**నిబంధనలకు తూట్లు**

లేఅవుట్లు వేస్తున్న వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. ప్రభుత్వాని ఒక్క రూపాయి చెల్లించకుండా ప్లాట్లను విక్రయిస్తున్నారు. రెవెన్యూ అధికారులను సైతం లెక్క చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు ఆ భూమిని లేఅవుట్‌గా మార్పు చేసినట్లు అనుమతి ఇవ్వాలి. ఆ తర్వాత పంచాయతీ అనుమతి పొందాలి. ఇవేవీ లేకుండానే పనులు కానిచ్చేస్తున్నారు.

**రూ.లక్షలను రూ.కోట్లుగా**

రూ.లక్షలతో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఎటువంటి



అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి ఆ భూమిని రూ. కోట్లుగా మారుస్తున్నారు. కనీస అనుమతులను పొందడం లేదు. ఎక్కడ పడితే అక్కడ విక్రయాలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని నార్పల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, శింగనమల మండలాల్లో ఇదేవిధ భారీగా లేఅవుట్లు వెలిశాయి. భూమిని కొనుగోలు చేసిన వెంటనే ప్రైవేట్ సర్వేయర్లతో కమ్మకే భూములను లేఅవుట్లుగా మారుస్తున్నారు. వెంటనే వాటిని విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. శింగనమల మండలం లోలూరు క్రాస్, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, కల్లూరు, నార్పల, నాయనపల్లిక్రాస్‌లో రియల్టర్ల హవా నడుస్తోంది.

**నోటీసులు ఇస్తున్నాం**

క్షేత్ర స్థాయిలో వీఆర్‌వోలు గుర్తించిన వాటిని నోటీసులు ఇస్తున్నాం. లేఅవుట్లు అనుమతులకు తక్కువగా వస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే భూ విక్రయాలు చేయాలి. మా దృష్టికి తీసుకొస్తే వాటిని నిలిపివేస్తాం. ప్రజలు ఇలాంటి వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అనుమతులు లేని చోట్ల స్థలాలు కొంటే భవిష్యత్తులో ఇబ్బంది తలెత్తుతాయి. బ్రహ్మయ్య, తహసీల్దారు, శింగనమల

# చేసిన పనులే చేసి నిధులు మేసి



నంద్యాల : గ్రామీణులకు పనులు కల్పించి.. వలసలు నివారించాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేసినట్లు చూపుతున్నారు.. బోగస్ లెక్కలతో నిధులు భోంచేస్తున్నారు. మస్టర్లలో నమోదు చేసిన హాజరుకు క్షేత్రస్థాయిలో పనులు చేసే కూలీలకు పొంతన ఉండటం లేదు. తక్కువ మందే పనిచేసినా ఎక్కువమంది పేర్లు నమోదు చేసి అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఒక్క కాల్వకే రూ.6 లక్షల వ్యయం**

చాగలమర్రి మండలంలో 300 మంది ఉపాధిహామీ కూలీలు ఉన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని పంట కాల్వల్లో పిచ్చిమొక్కలు తీయిస్తున్నారు. ఏటా వేసవిలో ఇదే కాలువలో పిచ్చిమొక్కలు తొలగించడం సాధారణంగా మారిపోయింది. ఈ పనిని రోజుకు రెండు విడతల్లో చేయిస్తున్నారు. 800 మీటర్ల పంట కాలువలో రోజుకు 60 మంది పని చేస్తున్నారు. గంటలో చేసే పనిని వారం రోజుల పాటు చేయిస్తున్నారు. సగటున రోజుకు రూ.18 వేల చొప్పున ఖర్చవుతోంది. గత పదేళ్లలో ఈ ఒక్క పనికే రూ.6 లక్షల వరకు ఖర్చు చేయడం గమనార్హం.

**ప్రాధాన్యం లేని పనులతో కాలక్షేపం**

చాలా గ్రామాల్లో చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తున్నారు. వేసవి కాలంలో గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా.. చాలా గ్రామాల్లో పంట కాలువల్లో కలుపు మొక్కలను తీస్తూ మమ అనిపిస్తున్నారు. ఎక్కువగా ప్రాధాన్యం లేని పనులను చేస్తున్నారు. పంట కాల్వల నిర్మాణం, పూడికతీత, పొలం గట్లపై మొక్కల పెంపకం, పంటకుంటలు, సరిహద్దు కందకాలు, గడ్డి పెంపకం, షెడ్ల నిర్మాణం, మల్బరీ సాగు, నర్సరీల ఏర్పాటు వంటి ప్రాధాన్యం ఉన్న పనుల జోలికి వెళ్లడం లేదు. పంట కాలువల్లో పిచ్చిమొక్కలు ఏరివేయడం వంటి పనులను కూలీలతో చేయిస్తున్నారు. ఏటా విధిగా ఇదే పనులను చేస్తున్నారు.

**బాధ్యులను వదిలేస్తున్నారు**

ప్రతి గ్రామ పంచాయతీకి ఒక క్షేత్ర సహాయకుడు ఉంటారు. జిల్లాలో 453 మంది క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు 72 మంది, 28 మంది ఏపీవోలు, మరో 28 మంది ఈసీ పనిచేస్తున్నారు. ఉపాధిహామీ నిబంధనల ప్రకారం రూ.10 వేల రికవరీకి ఆదేశిస్తే క్షేత్రసహాయకుడిని, రూ.30 వేలు రికవరీ కోసం ముందుగా సాంకేతిక సహాయకుడిని, రూ.50 వేల రికవరీకైతే ఈసీలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా సామాజిక తనిఖీల్లో పెద్దఎత్తున అక్రమాలు వెల్లడవుతున్నా, రికవరీలు జరుగుతున్నా బాధ్యులపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదు.

**బోగస్ మస్టర్లు**

ఉపాధిహామీ సిబ్బంది మస్టర్లలో హాజరు వేసిన కూలీల్లో 70 శాతం మందే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. మరో 30 శాతం కూలీల పేరిట బోగస్ హాజరు వేస్తున్నారు. చాలా గ్రామాల్లో సగటున రోజుకు 30 మంది హాజరవుతుంటే.. మరో ఐదుగురి పేరిట దొంగ హాజరు నమోదవుతోంది. కూలీల ముఖచిత్రాలు తీయడం లేదు. మండల కేంద్రం గడివేములలో కొంతమంది నాయకులు కూలీల అవతారమెత్తి వేతనాలు తీసుకుంటున్నారు. నంద్యాల మండలం కానాల గ్రామంలో దొంగ హాజరు వివరాలు వెల్లడైనా కనీస చర్యలు లేవు. మహానంది మండలం మసీదుపురం గ్రామంలో ఉపాధిహామీ సిబ్బంది ఆధ్వర్యంలోనే దొంగ హాజరు నమోదైనా సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి చేతులు దులిపేసుకున్నారు. వెలుగోడు, పాణ్యం, కోవెలకుంట్ల, నందికొట్కూరు మండలాల్లో బోగస్ హాజరుపై చర్యలే లేవు.

లక్ష్యం పని దినాలు : 178 లక్షలు
వేతనాల ఖర్చు : రూ.289.49 కోట్లు
సామగ్రి వ్యయం : రూ.112.23 కోట్లు
పరిపాలన ఖర్చు : రూ.15.32 కోట్లు

# వారికి పండగ.. ప్రభుత్వానికి దండగ

తిరుపతి : 'అధికారం మాదే.. గనులు మా చేతిలోనే ఉండాలి.. లేదంటే మూసేసుకోవాలి..' అని కొందరిని బెదిరించారు.. మరికొందరిపై దౌర్జన్యాలకు దిగారు.. ఇంకొందరిపై నిబంధనల కత్తులు నూరారు. ఇలా వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు ఐదేళ్లలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 387 క్వారీలను మూతపడేలా చేశారు. వీటిలో అత్యధిక క్వారీల్లో అనధికారికంగా కార్యకలాపాలు నిర్వహించి జేబులు నింపుకొన్నారు. ప్రభుత్వ ఖజానాకు బొక్క పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా రంగాన్ని గాడిలో పెడుతోంది. గనుల శాఖలో వైకాపా హయాంలో జరిగిన ఘోరాలపై దృష్టిసారించింది. దీన్ని ప్రక్షాళన చేస్తే ఉమ్మడి జిల్లాలో రూ.102 కోట్ల ఆదాయంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మందికి ఉపాధి లభిస్తుందని భావిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2014- 19 మధ్య గ్రానైట్, గ్రావెల్, రోడ్డు మెటల్ లీజులు తీసుకునేందుకు పోటీలు పడ్డారు. డెడ్‌రెంట్, సీనరేజ్, పర్మిట్ ఇలా ప్రతి ఒక్కటీ తక్కువగానే ఉన్నాయి. అంతర్జాతీయంగానూ డిమాండ్ ఉన్నందున ఎగుమతులు జరిగాయి. తద్వారా విదేశీ మారక ద్రవ్యమూ వచ్చింది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక పరిస్థితి తలకిందులైంది.

**అప్పట్లో వేధింపులిలా..**

అప్పట్లో విద్యుత్తు ఛార్జీలు, డెడ్‌రెంట్, కన్సిడరేషన్ ఇలా ప్రతి ఒక్కటీ పెంచుకుంటూ పోయారు. దీనికితోడు ఫ్యాను పార్టీలోని కీలక నేత, ఆయన కుమారుడి వేధింపులు పెరిగిపోయాయి. మాట వినకుంటే



సొంత పార్టీ నేతల క్వారీలకూ డిమాండ్ నోటీసులు పంపారు. సదరు నాయకుడి ఆగ్రహాన్ని బట్టి జరిమానాలు విధించారు. రూ.10 కోట్లు- రూ.80 కోట్ల వరకు చెల్లించాలని నోటీసులు రావడంతో లీజుదారులు గగ్గోలు పెట్టారు. విధిలేని పరిస్థితుల్లో కొందరు వారికే అప్పగించగా.. మరికొందరు అరాచకాలకు భయపడి గ్రానైట్ క్వారీలు మూసేశారు. డిమాండ్ నోటీసులపై కోర్టుల్లో న్యాయ పోరాటం చేశారు.

**ఆరు నెలల కిందట ఆరా తీసినా..**

వైకాపా నేతల అరాచకాలు, వేధింపుల కారణంగానే గ్రానైట్ క్వారీలు మూతపడ్డాయని కూటమి ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడంతో ఆరు నెలల కిందట వీటిపై ఆరా తీశారు. ఎవరెవరికి ఎంత డిమాండ్ నోటీసులు పంపారు? పర్యావరణ అనుమతులు ఏమైనా రావాలా? ఇతరత్రా ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని తెలుసుకున్నారు. ఏమైందో తెలియదు కానీ ఇప్పటివరకూ దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకోలేదు. న్యాయస్థానాల్లో వివాదాల్లో ఉన్నవి మినహాయించి.. లీజుదారుల నుంచి బలవంతంగా లాక్కున్న క్వారీలను తిరిగి పాత వ్యక్తులకే అప్పగించాలని డిమాండ్ పెరుగుతోంది.

**సీఎం సమీక్షతో తెరపైకి..**

రాష్ట్రానికి ఆదాయం తెచ్చే శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ సమీక్షిస్తున్నారు. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో గనుల శాఖకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మొదట దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు మొదట లీజు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. ఇలా ఈ రంగంలో తెచ్చిన సంస్కరణలపై హర్షం వ్యక్తమవుతోన్నా.. జిల్లాలో వైకాపా హయాంలో మూతపడిన గనుల పరిస్థితేంటనే ప్రశ్న ఆ వర్గాల నుంచి వస్తోంది. అప్పట్లో లీజుదారులపై అధిక ఫీజుల భారం, నాయకుల వేధింపుల కారణంగానే కార్యకలాపాలు జరగడంలేదన్నది స్పష్టంగా అవగతమవుతోంది. వీటిపైనా ఓ నిర్ణయం తీసుకుంటే ఖజానాకూ ఆదాయం వస్తుంది.

**చిత్తూరులో 339 తిరుపతిలో 48**

రాష్ట్రంలోనే అత్యధికంగా కార్యకలాపాలు నిలిచిన క్వారీలు చిత్తూరు జిల్లాలోనే ఉన్నాయి. ఇక్కడ 339 గనులు నిలిచిపోయాయి. ఇందులో దాదాపు 90 శాతం గ్రానైట్ క్వారీలే కావడం గమనార్హం. తిరుపతి జిల్లాలో 48 లీజులు ఆగిపోయాయి. అధికంగా గ్రావెల్, రోడ్డు మెటల్ లీజులున్నాయి. మైనింగ్ నిలిచినందున ఒక్క చిత్తూరు జిల్లాలోనే రూ.90 కోట్ల వరకు ఆదాయం ప్రభుత్వానికి రాకుండా పోతోంది. తిరుపతి జిల్లాలో రూ.12 కోట్ల వరకు నష్టం వాటిల్లుతోంది.

# ఖనిజం తరలుతోంది.. ఆదాయం తరుగుతోంది



నంద్యాల : తనిఖీలకు తాళం వేయడంతో ఖనిజాలు గుట్టుగా తరలిపోతున్నాయి. బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల, బేతంచెర్ల, పాణ్యం, డోన్, ప్యాపిలి, కృష్ణగిరి, వెల్దుర్తి, ఓర్వకల్లు, సి.బెళగల్ తదితర మండలాల్లో గనులు ఉన్నాయి. జిల్లా పరిధిలోనే వెయ్యి వరకు క్వారీలు ఉన్నాయి. ప్రత్యేకించి నాపరాళ్లు, ఇనుప ఖనిజం, సిలికా, క్వార్ట్జ్, డోలమైట్ గనులు ఉన్నాయి. కచ్చితంగా చెక్‌పోస్టుల వద్ద రాయల్టీ చెల్లించి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాలి. ఆయా కేంద్రాల వద్ద తనిఖీలు సరిగా లేకపోవడంతో ఖనిజ సంపద తరలిపోతోంది.

**సిబ్బంది కొరత.. తనిఖీలకు కోత**

నందికొట్కూరు మండలం నాగలూటి గనుల నుంచి రాళ్లను రాయల్టీ బిల్లులు లేకుండా ట్రాక్టర్లలో బేతంచెర్లకు తరలిస్తున్నారు. బనగానపల్లి మండలం పలుకూరు నుంచి బేతంచెర్ల పాలిష్ పరిశ్రమలకు నిత్యం 180 నుంచి 250 వరకు నాపరాళ్ల ట్రాక్టర్లు వెళ్తుంటాయి. కొందరు రాయల్టీ బిల్లులు చూపించకుండా వెళ్తున్నారు. సిబ్బంది కొరతతో రాత్రి సమయంలో తనిఖీలు నిర్వహించట్లేదు. "నెలకు 2500 నుంచి 3 వేల బిల్లులు చెక్ చేస్తున్నట్లు, 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు సుమారు రూ.28,95,832 జరిమానా విధించినట్లు సిబ్బంది చెబుతున్నారు.

**నిబంధనలకు పాతర**

బెంచ్ కటింగ్ విధానంలో గనుల తవ్వకాలు చేపట్టాలి. 'ఏ', 'బి' కేటగిరీలుగా విభజించాలి. ఖనిజాన్ని బట్టి మూడు నుంచి 9 మీటర్ల వరకు బెంచ్ కటింగ్ చేపట్టాలి. అందుకు విరుద్ధంగా నిటారుగా 50 నుంచి 150 అడుగుల లోతు వరకు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. వ్యర్థాలు, రాళ్ల ముక్కలను ఎక్కడపడితే అక్కడ వదిలేస్తున్నారు. ఉదయం తవ్వి.. రాత్రివేళల్లో గుట్టుగా తరలిస్తున్నారు. నిత్యం రాత్రిళ్లు పెద్ద ఎత్తున్న లారీలు, టిప్పర్లలో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.వదిలేస్తున్నారు

కొలిమిగుండ్ల మండలం బందర్లపల్లె, బేతంచెర్ల, డోన్ పరిసరాల్లో చెక్‌పోస్టులు ఉన్నాయి. ట్రాక్టర్‌కు రూ.650 ప్రకారం, లారీలకు రూ.1800 వరకు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. పన్నును సంబంధించి మొత్తాన్ని ఆన్‌లైన్‌లో లేదా గనుల శాఖలో ముందే చెల్లించి యజమానులు రాయల్టీ తీసుకోవాలి. చెక్‌పోస్టుల వద్ద రాయల్టీ చూపిస్తే పరిశీలించి ఆన్‌లైన్‌లో ఉంచి రవాణాకు అనుమతి ఇస్తారు. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు రాయల్టీ లేకుండా వెళ్లే వాహనాలకు మామూళ్లు తీసుకొని పంపించేస్తున్నారు. నాపరాళ్లు అయితే 500 ట్రాక్టర్లు రాయల్టీతో వెళ్తే మరో 100 వరకు రుసుము చెల్లించకుండా వెళ్లిపోతున్నాయి. దీంతో ఏటా రూ.కోట్లలో ఆదాయం రాకుండా పోతోంది.

"నిరంతరం నిఘా ఉంచాం.. ప్రతి ట్రాక్టరు, లారీని పరిశీలిస్తున్నాం.. రాయల్టీ లేకుండా ఉంటే కేసులు నమోదు చేస్తున్నాం.. రాత్రింబవళ్లు చెక్ పోస్టుల వద్ద సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామని" గనులశాఖ ఏడీ రాజగోపాల్ పేర్కొన్నారు.


బావిలా తవ్వేస్తున్నారు డోన్ మండలం బావిపల్లెలో తెల్లసుద్ద తవ్వకాలను చూస్తే ఎవరైనా నోరెళ్ల బెట్టాల్సిందే. ఈ ఒక్క గ్రామంలోనే 12 చోట్ల మైనింగ్ జరుగుతోంది. అధికారికంగా తవ్వకాలు సాగించేవారు ఇద్దరే ఉండగా.. ఆరేళ్లుగా విచ్చలవిడిగా మరికొందరు అక్రమంగా తవ్వేస్తున్నారు.

# అతివల ఆలంబనకు అడుగులు

పుట్టపర్తి: మహిళల ఆర్థిక అభ్యున్నతికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. స్వయం సహాయక సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు అందించడంతోపాటు వాటి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేస్తోంది. జిల్లాలో డ్వాక్రా మహిళల్లో ఎంతో మంది బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకుని స్వయం ఉపాధి బాటలో పయనిస్తున్నారు. మరి కొందరు తమ పేరిట ఇతరులకు అప్పు ఇస్తున్నారు. కొన్ని చోట్ల వెలుగు ఉద్యోగులే మహిళల పేరిట రుణాలు తీసుకుంటున్నారు. రుణాలు పక్కదారి పడుతున్నాయని గ్రహించిన డీఆర్‌డీఏ అధికారులు కొత్త పంథా ఎంచుకున్నారు. డ్వాక్రా సంఘాల సభ్యుల అభిప్రాయాలను సిబ్బంది తెలుసుకుంటున్నారు. అవసరం ఉన్న వారికే రుణం మంజూరు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు జిల్లాలో 60 శాతం అభిప్రాయాల సేకరణ పూర్తి చేశారు.

**అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని..**

తాజాగా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరం రుణ జీవనోపాధుల ప్రణాళిక పేరుతో కార్యచరణ చేపట్టింది. వ్యవసాయం, ఉద్యాన, తయారీ సేవలు, ట్రేడింగ్ రంగం, హస్తకళలు, చేతివృత్తులు, తదితర వాటికి వ్యక్తిగత రుణ సదుపాయం కల్పించనున్నారు. గతంలో 10 మంది సభ్యులు ఉండే సంఘానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తే చాలా వరకు సద్వినియోగం అయ్యేది కాదు. అలాకాకుండా సొంత వ్యాపారం చేసేందుకు ఆసక్తిచూపే వారికి బ్యాంకులు, స్త్రీనిధి రుణాలు మంజూరు చేయనున్నారు. సభ్యురాలి పేరు, సంఘం, అవసరమైన రుణమొత్తం, కుటుంబసభ్యుల ఆదాయ వనరుల వివరాలు సేకరిస్తున్నారు. వ్యాపార విస్తరణ పిల్లల ఉన్నత చదువుల అవసరాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు.




**సభ్యుల అభ్యున్నతే లక్ష్యం**

మహిళల ఆర్థిక అభ్యున్నతికి ప్రయత్నిస్తున్నాం. మండల స్థాయిలో సంఘాల సభ్యులకే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఆ తర్వాత సేకరించిన అభిప్రాయాలతో జీవనోపాధుల ప్రణాళిక రూపొందిస్తాం. తర్వాత అమలుకు శ్రీకారం చుడతాం. మహిళల అభిరుచికి అనుగుణంగా చేపట్టే వ్యాపారానికి అవసరమైన రుణాన్ని బ్యాంకులు, స్త్రీనిధి నుంచి మంజూరు చేయిస్తాం.

నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ

జిల్లా: శ్రీసత్యసాయి
డ్వాక్రా సంఘాలు : 33,442
మొత్తం సభ్యులు : 3,51,922
2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ కింద రుణాలు: రూ.1,035 కోట్లు
స్త్రీనిధి : రూ.141 కోట్లు
పొదుపు నిధులు : రూ.240 కోట్లు
2025–26 బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి క్రింద రూ.2 వేల కోట్లు రుణాలు అందించే దిశగా ప్రణాళికకు రూపకల్పన

# నృసింహ క్షేత్రం.. తీగల మార్గం



ఆళ్లగడ్డ : దట్టమైన అటవీ ప్రాంతం.. ఎత్తైన కొండలు.. జలపాతాల హొయలు.. 'నవ' నృసింహస్వామి క్షేత్రం.. ఆధ్యాత్మిక, పర్యాటక ధామంగా విరాజిల్లుతున్న అహోబిలంలో తీగలమార్గం (రోప్‌వే) ఏర్పాటుకు కేంద్రం ముందుకొచ్చింది. ఎగువ అహోబిలం నుంచి జ్వాలా నృసింహస్వామి ఆలయానికి తీగ మార్గం వేసే ఆలోచనలో ఉన్నారు. జాతీయ రహదారుల లాజిస్టిక్ అథారిటీతో సంప్రదింపులు చేసి రోప్‌వే నిర్మాణానికి ముందుకు వెళ్లాలని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులు యోచిస్తున్నారు. అవసరమైతే లోటు భర్తీ నిధి(వీజీఎఫ్) తీసుకొనే ఆలోచనలో ఉన్నారు. ఇది అందుబాటులోకి వస్తే అహోబిలానికి పర్యాటకుల సంఖ్య మరింత పెరగనుంది.

**పచ్చని అడవిలో పయనం**

ఆళ్లగడ్డ నుంచి 23 కి.మీ. ప్రయాణిస్తే దిగువ అహోబిలం వస్తుంది. అక్కడి నుంచి 8 కి.మీ. దూరంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఎగువ అహోబిలం ఉంటుంది. పచ్చటి చెట్ల మధ్య వాగులు, వంతెనలు దాటుకొంటూ ఈ ప్రయాణం సాగుతుంది.అక్కడ నుంచి కాలినడక మార్గంలో మాలోల, వరాహ, జ్వాలా, పావన నృసింహస్వామి ఆలయాలకు భక్తులు వెళ్తుంటారు. ఈ మార్గంలో వెళ్లడం ఓ సాహసం లాంటిది.. భక్తులు చేతి కర్రల సాయంతో వెళ్తుంటారు.. ఓ రకంగా ట్రెక్కింగ్ లాంటి అనుభూతిని ఇస్తుంది. అలా వెళ్లలేని భక్తులు డోలీలను ఆశ్రయిస్తుంటారు. స్వాతి నక్షత్రం రోజు భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

**2018లోనే ప్రతిపాదన**

అహోబిలంలో రోప్‌వే ఏర్పాటు చేయాలని 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం ప్రయత్నించింది. ఎగువ అహోబిలం ఆలయం నుంచి మాలోల, అక్కడి నుంచి జ్వాలా ఆలయం వరకు నిర్మించాలని ప్రతిపాదించారు. తర్వాత ఎన్నికలు రావడం.. వైకాపా అధికారంలోకి వచ్చింది.. గత ఐదేళ్లు పట్టించుకోలేదు.. మళ్లీ తాజాగా రోప్‌వే నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఉత్తమ పర్యాటక గ్రామంగా అహోబిలానికి 2023లో అవార్డు వచ్చింది. కేంద్రం నిర్వహించిన ఉత్తమ ఆధ్యాత్మిక, పర్యాటక గ్రామాలకు సంబంధించిన పోటీల్లో అహోబిలానికి ఉత్తమ ఆధ్యాత్మిక, పర్యాటక గ్రామం అవార్డు దక్కింది.

# సాకారం దిశగా.. సొంతింటి కల

చిత్తూరు : పేదల సొంతింటి కలను సాకారం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) 2.0 ద్వారా సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు గృహాల మంజూరుకు సర్వే చేపట్టి జిల్లాలో 39,258 మందిని గుర్తించారు. ఇళ్ల మంజూరుపై డీపీఆర్ సిద్ధం చేశారు. వీరందరికీ ఈ ఆర్థిక సంవత్సరంలో వర్తకాన్ని వర్తింపజేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో యూనిట్‌కు రూ.1.80 లక్షలు కేటాయించారు. ఈ సొమ్ము కూడా కేంద్రం ఇచ్చినదే. తాజాగా కూటమి ప్రభుత్వంలో యూనిట్ విలువ రూ.2.50 లక్షలుగా నిర్ణయించారు. మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు.. పట్టణ ప్రాంతాల్ని పరిశీలిస్తే.. పలమనేరు పట్టణంలో 155 మంది, పుంగనూరు 293, కుప్పం 815, నగరి 701, చిత్తూరు నగరంలో 1,545 మంది లబ్ధిదారుల్ని గుర్తించారు.



పాలసముద్రంలో 403, కార్వేటినగరం 534, వెదురుకుప్పం 541, రొంపిచెర్ల 548, చిత్తూరు 562, పెనుమూరు 582, గుడిపాల 593, నిండ్ర 601, తవణంపల్లి 630, జీడీనెల్లూరు 647, విజయపురం 661, పుంగనూరు 667, ఎస్ఆర్‌పురం 682, నగరి 698, పూతలపట్టు 745, చౌడేపల్లె 746, ఐరాల 800, సదుం 803, యాదమరి 939, పులిచెర్ల 1,011, బంగారుపాళ్యం 1,143, పలమనేరు 1,372, సోమల 1,458, గుడుపల్లె 1,568, గంగవరం 2016, రామకుప్పం 2,017, పెద్దపంజాణి 2,070, శాంతిపురం 2,196, బైరెడ్డిపల్లె 2,246, కుప్పం 3,062, వి.కోట మండలంలో 3,208 మందిని గుర్తించారు.

**సద్వినియోగం చేసుకోవాలి–గోపాల్‌నాయక్, పీడీ**

పేదల సొంతింటి కల సాకారం చేసేలా ప్రభుత్వం పీఎంఏవై 2.0ను అమలు చేస్తోంది. అర్హత కలిగిన లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దీనికోసం సచివాలయాల్లో దరఖాస్తుల్ని సమర్పించాలి.

చురకలు



## పూరి మూవీలో విద్యాబాలన్ క్లారిటీ

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా ఒక సినిమా రూపొందుతున్న విషయం తెల్సిందే. గత కొన్నాళ్లుగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన నటీనటుల ఎంపిక జరుగుతోంది. తెలుగుతో పాటు సౌత్‌లోని అన్ని భాషల్లో, హిందీలోనూ భారీ ఎత్తున విడుదల చేసే విధంగా సినిమాను రూపొందిస్తున్నారు. కేవలం మూడు నెలల్లోనే ఈ సినిమాను పూర్తి చేయడం కోసం దర్శకుడు పూరి ఎక్కువ సమయం ప్రీ ప్రొడక్షన్ వర్క్ కి తీసుకుంటున్నాడు. ఈ సినిమాలో ఇప్పటికే టబు, రాధిక ఆప్టే కీలక పాత్రలో కనిపించబోతున్నారు అనే వార్తలు వచ్చాయి. వీరిద్దరితో పాటు నివేథ థామస్‌ను ఎంపిక చేశారనే వార్తలు వచ్చాయి. ఇటీవల ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ విద్యాబాలన్‌ను ఎంపిక చేశారనే వార్తలు వచ్చాయి. గత రెండు రోజులుగా ఈ విషయమై ప్రముఖంగా వస్తున్న వార్తలపై చిత్ర యూనిట్ సభ్యులను సంప్రదించిన సమయంలో క్లారిటీ ఇచ్చారు. విద్యా బాలన్‌ను ఈ సినిమా కోసం అసలు సంప్రదించలేదు అంటూ క్లారిటీ ఇచ్చారు. విద్యా బాలన్ కోసం ఈ సినిమాలో ఎలాంటి పాత్ర లేదని చెప్పుకొచ్చారు. అంతే కాకుండా ఈ సినిమా నటీ నటుల విషయంలో తుది నిర్ణయం ఇంకా జరగలేదని, మీడియాలో వస్తున్న పుకార్లను



నమ్మవద్దని, త్వరలోనే పూర్తి క్లారిటీ ఇస్తూ మేకర్స్ నుంచి అధికారికంగా ప్రకటన వస్తుందని చెప్పుకొచ్చారు. విద్యా బాలన్ నటించడం అనేది పుకారే అని తేలిపోయింది. తెలుగుతో పాటు అన్ని భాషల్లోనూ విద్యా బాలన్‌కి మంచి క్రేజ్ ఉంది. అందుకు తగ్గట్లుగా ఆమెను ఈ సినిమాలో నటింపజేస్తే కచ్చితంగా మంచి బజ్ క్రియేట్ అవుతుందని అంతా భావించారు. కానీ చిత్ర యూనిట్ సభ్యులు మాత్రం ఈ సినిమా కోసం ఆమెను కనీసం సంప్రదించినట్లుగా కూడా చెప్పడం లేదు. ముందు ముందు కూడా ఆమెను ఈ సినిమాలో తీసుకునే యోచన లేదు అన్నట్లుగానే యూనిట్ సభ్యులు చెబుతున్నారు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉన్న సీనియర్ హీరోయిన్స్‌ను కాదని, టబు, రాధిక ఆప్టేలను ఈ సినిమా కోసం ఎంపిక చేయడంను బట్టి చూస్తే సినిమాను పాన్ ఇండియా మార్కెట్‌లో ఎక్కువగా పబ్లిసిటీ చేయాలని పూరి భావిస్తున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఈ మధ్య కాలంలో వచ్చిన లైగర్, డబుల్ ఇస్మార్ట్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డాయి. దాంతో ఈ సినిమా విషయంలో పూరి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. ముఖ్యంగా ఈ సినిమా కథ విషయంలో చాలా వర్క్ చేశాడు. సాధారణంగా పూరి సినిమాల కోసం వర్క్ చేసే తీరు, స్టైల్ డిఫరెంట్‌గా ఉంటుంది. కానీ ఈ సినిమాకు మరో రకంగా ఆయన వర్క్ చేస్తున్నాడని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఇదే ఏడాదిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారు. అతి త్వరలోనే పూరి జగన్నాథ్ నుంచి అధికారిక ప్రకటన వస్తుందని సమాచారం అందుతోంది.

## కేన్స్ 2025.. ఆలియా ఆలస్యానికి కారణం?

కేన్స్ 2025 ఉత్సవాలు ఈనెల 13న ఘనంగా ప్రారంభం కాగా, రెండు వారాల పాటు సందడి సాగనుంది.. ఈ ఉత్సవాలకు ఐశ్వర్యారాయ్ తో పాటు ఆలియా భట్ అటెండ్ కావాల్సి ఉంది. కానీ ఆలియా తన మొదటి కేన్స్ పర్యటనను రద్దు చేసుకోవడం చర్చనీయాంశమైంది. భారతదేశం-పాకిస్తాన్ ఉద్రిక్తతల దృష్ట్యా అలియా భట్ 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి హాజరు కాలేదని కథనాలొస్తున్నాయి. మే 13న జరిగిన ప్రారంభోత్సవానికి హాజరు కావాలని ఆలియా నిర్ణయించుకుంది. అయితే అంతకుముందు ఉన్న ఉద్రిక్తల దృష్ట్యా కేన్స్ వేడుకలకు హాజరు కాకూడదని ఆలియా నిర్ణయించుకుంది. కానీ గత శనివారం ఇరు దేశాల అధినేతలు కాల్పుల విరమణ ప్రకటించారు. అయితే ఈ నిర్ణయం అనంతరం ఆలియా తిరిగి కేన్స్ కు చేరుకునే అవకాశం ఉందని తెలిసింది. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన నటి అలియా ప్రఖ్యాత లోరియల్



రాయబారిగా కేన్స్ ఫెస్టివల్‌కు హాజరవుతోంది. ఈ ఉత్సవం మే 24 వరకు కొనసాగుతుంది. ఇదే చోట జాన్వీ కపూర్, ఊర్వశి రౌతేలా లాంటి భామలు కూడా సందడి చేస్తుండడం ఆసక్తికరం. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా భారత సైన్యం పాకిస్తాన్ పై యుద్ధంలో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ తర్వాత మంగళవారం ఆలియా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో సైనికులకు నివాళులు అర్పించారు. ఆలియా నటిస్తున్న స్పై మూవీ ఆల్ఫా విడుదల కావాల్సి ఉంది. ఇందులో శార్వరి కూడా నటిస్తోంది. సంజయ్ లీలా భన్సాలీ లవ్ %ఁ% వార్‌లోను ఆలియా నటిస్తోంది. ఇందులో రణబీర్ కపూర్, విక్కీ కౌశల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## సూపర్ స్టార్ భవితవ్యం తేలి పోయేనా..?



బాలీవుడ్ సూపర్ స్టార్ ఆమీర్ ఖాన్ త్వరలో 'సితారే జమీన్ పర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. చాలా ఏళ్ల క్రితం వచ్చిన 'తారే జమీన్ పర్' సినిమాకు ఇది సీక్వెల్ అనే ప్రచారం జరిగింది. వాస్తవానికి సితారే జమీన్ పర్ సినిమాకు అప్పట్లో వచ్చిన తారే జమీన్ పర్ సినిమాకు ఎలాంటి సంబంధం లేదని సమాచారం. ఇటీవల వచ్చిన టీజర్, ట్రైలర్‌తో సినిమా కథ ఏంటో పూర్తిగా క్లారిటీ వచ్చింది. ఈ సినిమా స్పానిష్ మూవీ కాంపియోన్స్ కి అఫిషియల్ రీమేక్ అనేది ఇండస్ట్రీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. ఇంగ్లీష్‌లో ఇదే సినిమా ఛాంపియన్స్ టైటిల్‌తో రీమేక్ అయింది. ఇప్పుడు తెలుగులో సితారే జమీన్ పర్ అనే టైటిల్‌తో రాబోతుంది. ఆమీర్ ఖాన్ సూపర్ హిట్ దక్కించుకుని చాలా సంవత్సరాలు అవుతోంది. ఆయన ఇండస్ట్రీలో ఒకానొక సమయంలో అత్యధిక సక్సెస్ రేటు కలిగి ఉన్న హీరోగా నిలిచాడు. కానీ ఇప్పుడు బాలీవుడ్ ఫ్లాప్ హీరోలతో పోటీ పడుతూ మరీ ఆమీర్ ఖాన్ తన ఆదిపత్యంను కోల్పోయాడు. దారుణమైన ఫామ్‌లో ఉన్న ఆమీర్ ఖాన్ ఇప్పుడు సితారే జమీన్ పర్ సినిమాతో హిట్ కొట్టాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. సినిమాలో ఆయన పాత్ర గురించి ఇప్పటికే ఒక క్లారిటీ ఇచ్చింది. హీరోయిజం చూపించే అవకాశం లేదు, రొమాంటిక్ సీన్స్‌లో కనిపించే అవకాశం లేదు, రెగ్యులర్ ఫక్త్ సినిమా కానే కాదు. అయినా కూడా ఈ సినిమా హిట్ అయితే ఆయన కెరీర్ ముందుకు సాగే అవకాశాలు ఉన్నాయి. సూపర్ స్టార్ ఆమీర్ వయసు పెరుగుతున్న నేపథ్యంలో ఇండస్ట్రీకి దూరం అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. హీరోగా గత దశాబ్ద కాలంగా సక్సెస్ లేకపోవడంతో ఇక ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పి ఆమీర్ ఖాన్ ఇతర పనులతో బిజీ అయ్యే అవకాశం కూడా ఉందని కొందరు అంటున్నారు. అదంతా కూడా సితారే జమీన్ పర్ సినిమా ఫలితాన్ని బట్టి ఉంటుంది అనేది పలువురి అభిప్రాయం. సోషల్ మీడియాలో ఇప్పటికే ఆమీర్ ఖాన్ గురించి ఓ రేంజ్‌లో ట్రోల్స్ వస్తున్నాయి. ఖాన్స్ త్రయం అంటూ ఒకప్పుడు బాలీవుడ్‌ను ఏలిన ఆమీర్, షారుఖ్, సల్మాన్‌లు ఇప్పుడు ఏం చేస్తున్నారు అనేది అందరికీ తెలిసిందే. ఇండస్ట్రీ వారి పరిస్థితి ఆశాజనకంగా లేదు. సితారే జమీన్ పర్ సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యి చాలా కాలం అయింది. వచ్చే ఏడాదిలో సినిమా విడుదల చేయాలని భావిస్తున్నట్లుగా ఆ మధ్య వార్తలు వచ్చాయి. అనూహ్యంగా సినిమా ను ఈ జూన్‌లోనే ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు రెడీ చేశారు. సినిమాను వాయిదా వేసే అవకాశాలు ఉన్నాయంటూ కొందరు కామెంట్ చేస్తూ ఉన్నారు. సినిమా ఎప్పుడు విడుదల అయినా హిట్ టాక్ దక్కించుకుని భారీ వసూళ్లు సొంతం చేసుకుంటేనే ఆమీర్ ఖాన్‌కి తన సూపర్ స్టార్ హోదా కంటిన్యూ అయ్యేను, అలాగే ఆయన ఇండస్ట్రీలో మరిన్ని సినిమాలు చేసే అవకాశాలు ఉంటాయి అంటూ సినీ వర్గాల వారు, మీడియా సర్కిల్స్ వారు మాట్లాడుకుంటున్నారు.

## టీజర్ ఇష్యూ.. 25 కోట్ల పరువు నష్టం..





బాలీవుడ్ స్టార్ నటులు అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, రితేష్ దేశ్ ముఖ్ లీడ్స్ రోల్స్ లో హౌస్ ఫుల్ మూవీ తెరకెక్కిన విషయం తెలిసిందే. తరుణ్ మన్ సుఖానీ దర్శకత్వం వహించిన ఆ సినిమాను సాజిద్ నడియాడ్ వాలా నిర్మించారు. సూపర్ హిట్ కామెడీ ఫ్రాంఛైజీ హౌస్ ఫుల్ సిరీస్ లో భాగంగా రూపొందిన ఆ మూవీ.. జూన్ 6వ తేదీన రిలీజ్ కానుంది. అయితే రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో మూవీపై పాజిటివ్ క్రియేట్ అయింది. సినిమా కచ్చితంగా హిట్ అవుతుందని అంతా ఫిక్స్ అయ్యారు. ముఖ్యంగా లాల్ పరి సాంగ్ ఇప్పటికే అదిరిపోయే హిట్ అయిన విషయం తెలిసిందే.

ఆ సాంగ్ టీజర్ లో మెయిన్ అట్రాక్షన్ గా మారింది. కానీ మే 9వ తేదీన టీజర్ చూసేందుకు ట్రై చేసిన ఆడియన్స్ ను కాపీరైట్స్ వార్నింగ్ చూపించింది యూట్యూబ్. అందుకు కారణం.. టీజర్ లో ఉన్న లాల్ పరి సాంగ్ పై కాపీరైట్ దావా వచ్చింది. మో ఫ్యూజన్ స్టూడియోస్ సంస్థ ఆ దావా వేసి.. ఆ సాంగ్ హక్కులు తమ వద్ద ఉన్నాయని అందులో పేర్కొంది. దీంతో యూట్యూబ్.. టీజర్ ను తొలగించింది. అదే సమయంలో సింగర్ యో యో హనీ సింగ్ జోక్యం చేసుకున్నారు. ఆ సాంగ్.. నదేనని తెలిపారు. తాను హౌస్ ఫుల్ మేకర్స్ అయిన నదియాడ్ వాలా గ్రాండ్ సన్ ఎంటర్టైన్మెంట్ కు ప్రత్యేకంగా విక్రయించానని రాతపూర్వకంగా ప్రకటన ఇచ్చారు. అయితే హనీ సింగ్ అధికారిక ప్రకటనతో సాజిద్ నడియాడ్ వాలా అండ్ టీమ్.. మో ఫ్యూజన్ స్టూడియోస్ తోపాటు యూట్యూబ్ పై రూ. 25 కోట్ల పరువు నష్టం దాఖలు చేసింది. టీజర్ ను అన్యాయంగా తొలగించారని నిర్మాణ సంస్థ భావిస్తూ ఆ చర్యలు తీసుకుంది. మే 12న యూట్యూబ్ కు నోటీసు కూడా పంపింది టీజర్ ను వెంటనే తిరిగి అప్లోడ్ చేయాలని లేదా నష్టపరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉండాలని నోటీసుల్లో పేర్కొంది. అయితే హౌస్ ఫుల్ టీజర్ విషయంపై ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. కంటెంట్ ను తొలగించే ముందు యూట్యూబ్ చెక్ చేయకుండా ఎలా చేస్తుందని అంతా క్వశ్చన్ చేస్తున్నారు. అలా చేయడం వల్ల మూవీపై ఉన్న బజ్ దెబ్బతింటుందని అంటున్నారు. ఏదేమైనా మూవీ టీమ్.. ఇప్పుడు సినిమా వైపు అందరి దృష్టి తిప్పుకోవాలి.

## అద్దంలో చిక్కిన అందాల ప్రగ్య

కంచె బ్యూటీ ప్రగ్య జైశ్వాల్ ఇటీవల ముంబై పరిశ్రమలో అవకాశాల వేట సాగిస్తున్న సంగతి తెలిసిందే. సల్మాన్ ఖాన్ లాంటి పెద్ద హీరో ఈ భామకు అవకాశం కల్పించినా అదృష్టం కలిసి రాలేదు. ప్రస్తుతం తన స్నేహితురాళ్లు మంచు లక్ష్మి, రకుల్ తో కలిసి తన కెరీర్ గేమ్ ఛేంజర్ ఛాన్స్ కోసం వేచి చూస్తోంది. ఇదే సమయంలో వరుస ఫోటోషూట్లతో విరుచుకుపడుతూ అభిమానులను యంగేజ్ చేస్తోంది. తాజాగా మరోసారి ప్రగ్య ఓ స్పెషల్ ఫోటోషూట్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. మేకప్ రూమ్ లో మేకప్ సెషన్స్ లో ఉన్న ప్రగ్య అలా అద్దంలో తన రూపాన్ని చూసుకుని మురిసిపోతోంది. పక్కనే మేకప్ ఆర్టిస్ట్ ఎనర్జిటిగ్గా ఫోటోకు ఫోజులిచ్చాడు.



ఈ ఫోటోలో ప్రగ్య పసుపు రంగు ఫ్రాకులో ఎంతో బ్యూటిఫుల్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. అద్దంలో చిక్కిన అందాల భామ అంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రగ్య ప్రస్తుతం హిందీ చిత్రసీమలో ఔత్సాహిక దర్శకులు వినిపించిన కథలు వింటోందని సమాచారం. కానీ ఇంకా అధికారికంగా ఏదీ ఫైనల్ చేయలేదు. త్వరలోనే తదుపరి సినిమాకి సంబంధించిన అప్ డేట్ చెబుతుందని అభిమానులు భావిస్తున్నారు.

## బాలీవుడ్ లో కళావతికి మరో బంపర్ ఆఫర్!

కీర్తి సురేష్ అలియాస్ కళావతి బేబీజాన్ తో బాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో వరుణ్ ధావన్ కి జోడీగా నటించింది. భారీ యాక్షన్ థ్రిల్లర్ గా రిలీజ్ అయిన చిత్రం మాత్రం ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో కళావతికి ఆరంభంలో చేదు అనుభవం తప్పలేదు. అయినా కీర్తికి కొత్త ఛాన్సులకేమి కొదవలేదన్నట్లు బ్యాక్ టూ బ్యాక్ ఛాన్సులందుకుంటుందనే ప్రచారం బాలీవుడ్ మీడియాలో పీక్స్ లో జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ప్రాజెక్ట్ లకు సంబంధించి అగ్రిమెంట్ జరిగినట్లు వార్తలొస్తున్నాయి. ఆ సినిమాలేంటి? అన్నది బయటకు రాలేదు కానీ తాజాగా రాజ్ కుమార్ రావుకి జోడీగా మరో చిత్రంలో ఎంపికైనట్లు తెలుస్తోంది. విద్యా వ్యవస్థ నేపత్యంలో రాజ్ కుమార్ రావు హీరోగా ఓ సినిమాకు సన్నాహాలు జరుగు తున్నాయి. ఈ చిత్రాన్ని ఆయనే సొంత బ్యానర్లో నిర్మిస్తున్నారు. సెక్టార్ 36 ఫేం ఆదిత్యా నింబాల్కర్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో హీరోయిన్ గా కీర్తి సురేష్ ఎంపికైంది. విద్యావ్యవస్థలో కుంభకోణాన్ని



బయట పెట్టే పాత్రలో కీర్తి కనిపించనుంది.

జూన్ లోనే చిత్రీకరణకు రంగం సిద్ధమవుతోంది. ఇదే నెలలో కీర్తి సీక్రెట్ గా ఉంచిన మరో ప్రాజెక్ట్ కూడా లాంచ్ అవుతుందని సమాచారం. మొత్తానికి అమ్మడికి తొలి సినిమాతో వైఫల్యం ఎదురైనా అవకాశాల పరంగా జోరందుకుంటుంది. ఇదే తరహాలో శ్రీలీల కూడా వరుస ఛాన్సులందుకుంటుంది. తొలి సినిమా రిలీజ్ కు ముందే రెండు..మూడు ప్రాజెక్ట్ లు రెడీగా చేతిలో పెట్టుకుంది. బాలీవుడ్ మేకర్స్ కూడా ఈ మధ్య కాలంలో సౌత్ భామలకు పెద్ద పీట వేస్తున్నారు. ట్యాలెంటెడ్ బ్యూటీలకు అవకాశాలు కల్పించడానికి ముందుకొస్తున్నారు. మునుపటి పరిస్థితికి పూర్తి భిన్నమైన సన్నివేశం బాలీవుడ్ మార్కెట్ లో కనిపిస్తోందిప్పుడు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536